





గంగమ్మ ఒడికి దుర్గమ్మ

దసరా శరన్నవరాత్రుల అనంతరం దుర్గమ్మ విగ్రహాల నిమజ్జనోత్సవం శని, ఆదివారాల్లో భారీ శోభాయాత్రలతో వైభవంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున సైతం పెద్ద సంఖ్యలో విగ్రహాలతో వాహనాలు నెక్లెస్‌రోడ్డుకు తరలిరావడంతో నిమజ్జన పర్వం సోమవారమూ కొనసాగింది.

ఓటీఎస్ చెల్లింపులకు ఎస్ఎంఎస్ ద్వారా లింకు



అధికారులతో సమీక్షలో జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: నీటి బిల్లుల బకాయిలకు సంబంధించి వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీం(ఓటీఎస్) కింద చెల్లింపు చేయాలంటే జలమండలి మరింత సులువైన విధానాన్ని అందుబాటులోకి తెచ్చింది. బకాయిల వివరాలు.. రాయితీపోను మిగతా మొత్తం బిల్లుల వివరాలను నేరుగా చెల్లించేలా నల్లాదారుల సెల్‌ఫోన్‌కే లింకు పంపుతున్నట్లు జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి తెలిపారు. గతంలో జలమండలి కౌంటర్లు లేదంటే ప్రత్యేక శిబిరాలను పెట్టి బకాయిల మొత్తాలను చెల్లించేవారని.. ఇక నుంచి వినియోగదారులే సులువుగా ఇంటి నుంచే ప్రక్రియ పూర్తి చేసి రాయితీ పొందవచ్చని వివరించారు. సోమవారం ఖైరతాబాద్ ప్రధాన కార్యాలయంలో మురుగు తొలగింపుపై 90 రోజుల ప్రత్యేక డ్రైవ్‌పై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రత్యేక డ్రైవ్‌పై ప్రధాన కార్యాలయంలో డాష్ బోర్డు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. వచ్చే జనవరి నుంచి ఇంకుడుగుంత లేని ఇళ్లకు నీటి ట్యాంకర్‌పై అసలు ధరతోపాటు అదనపు ఛార్జీలు వసూలు చేయనున్నట్లు ప్రకటించారు. రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్-2 స్వామి, డైరెక్టర్ ఆపరేషన్-1 విజయరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

వెలగని వీధిలైట్లు
కాలనీల్లో వెతల చీకట్లు

- నగరవ్యాప్తంగా 12 శాతం పనిచేయనివే..
- ఈఈఎస్ఎల్, జీహెచ్ఎంసీ నిర్లక్ష్యంతో అవస్థ

ఈనాడు, హైదరాబాద్: నగరంలో వందలాది కాలనీలు చీకట్లో మగ్గుతున్నాయి. మెహిదీపట్నం, జూబ్లీహిల్స్, కాప్రా, మలక్‌పేట, మూసాపేట, ముషీరాబాద్, మల్కాజిగిరి, బేగంపేట సర్కిళ్ల పరిధిలోని కాలనీల రోడ్లు నెలలుగా చీకటికే పరిమితమయ్యాయి. వీధిలైట్లు అమర్చాలంటూ కాలనీవాసులు జీహెచ్ఎంసీ చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఆయా ప్రాంతాల్లో వీధికుక్కల దాడులు, రోడ్డు ప్రమాదాలు, చోరీలు, ఆకతాయిల వేధింపులు, మహిళలపై దాడులు చోటుచేసుకుంటున్నాయని పోలీసులు సైతం గగ్గోలు పెడుతున్నారు.

జోన్లవారీగా ఈ సంవత్సరం ఫిబ్రవరి ఒకటినుంచి పెండింగ్ ఫిర్యాదులివి..

ఎల్బీనగర్	724
చార్మినార్	1080
ఖైరతాబాద్	2666
శేరిలింగంపల్లి	710
కూకట్‌పల్లి	1354
సికింద్రాబాద్	1702
మొత్తం	8236



మెహిదీపట్నం దేవరకుంట ప్రాంతంలో..

అధ్వాన నిర్వహణ ఇలా..

- నగరంలో వీధి లైట్లు.. 5.48లక్షలు
- రోజూ వెలగాల్సినవి.. 98శాతం
- వెలుగుతున్నవి.. 88శాతం
- ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాల్సిన లైట్లు.. 5శాతం (27,400)
- ప్రస్తుతం అందుబాటులో ఉన్నవి.. 2,574
- ఏర్పాటుచేసిన సీసీఎంఎస్ బాక్సులు.. 30,200
- రెండేళ్లుగా పనిచేయనివి.. 4,000
- దీంతో రోజంతా వెలుగుతున్న లైట్లు.. 25 - 28వేలు
- నెలవారీ విద్యుత్తు ఛార్జీల్లో పెరుగుదల.. రూ.34లక్షలు
- రోజూ వీధిలైట్లపై వస్తున్న ఫిర్యాదులు.. 500-600

రెండేళ్లుగా సమస్య.. పాత తరం లైట్లను తొలగించి, వాటి స్థానంలో ఎల్ఈడీ లైట్లను అమర్చి, ఏడేళ్లు వాటిని మెరుగ్గా నిర్వహిస్తామంటూ ఏడేళ్ల కిందట ఈఈఎస్ఎల్(ఎనర్జీ ఎఫిషియన్సీ సర్వీసెస్ లిమిటెడ్) జీహెచ్ఎంసీతో ఒప్పందం చేసుకుంది. ఆ ప్రకారం.. గతంలోని 3.9లక్షల పాతలైట్లను తొలగించి ఎల్ఈడీవి ఏర్పాటుచేసింది. ప్రస్తుతం ఐదున్నర లక్షల ఎల్ఈడీ లైట్లు నగరంలో ఉన్నాయి. ఒప్పందం ప్రకారం అందులోని 98శాతం లైట్లు రోజూ వెలగాల్సిందే. 5శాతం లైట్లను బఫర్ స్టాక్‌గా ఎప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలి. ఎప్పటికప్పుడు జీహెచ్ఎంసీ ఆదేశాల మేరకు కొత్త లైట్లను అమర్చాలి. ప్రతి వీధి లైటును సీసీఎంఎస్ బాక్సులతో అనుసంధానంచేసి.. సాయంత్రం 6.30నుంచి ఉదయం 6.30గంటల మధ్య వెలిగేలా నియంత్రించాలి. ఏ ఒక్క నిబంధననూ ఆ సంస్థ పూర్తిస్థాయిలో అమలు చేయట్లేదని జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ విభాగం ఆందోళన వ్యక్తంచేస్తోంది. రెండేళ్లుగా నిర్వహణ పడకేయడంతో సదరు సంస్థకు రూ.9కోట్లకుపైగా జరిమానా విధించామని, అనేక నోటీసులూ ఇచ్చామని తెలిపింది.

ముదిరిన వివాదం

సమయపాలన నియంత్రణకు ఏర్పాటుచేసే సీసీఎంఎస్ మీటర్లు 30వేలకుపైగా ఉండగా, వాటిలో 4,500 మీటర్లు పని చేయట్లేదని, దీంతో వేలాది వీధి లైట్లు రేయింబవళ్లు వెలుగుతున్నాయని, సిబ్బంది ద్వారా వాటిని పగలు ఆపేయాలంటూ రాసిన లేఖలను ఈఈఎస్ఎల్ పట్టించుకోవట్లేదని జీహెచ్ఎంసీ చెబుతోంది. కొత్త కాలనీలు, బస్తీల్లో 10వేల కొత్త వీధి లైట్లు అమర్చాలని ఏప్రిల్, 2024లో ఈఈఎస్ఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని, ఆరు నెలల్లో ఆ సంస్థ 3,540 మాత్రమే అమర్చిందని అధికారులు తెలిపారు. పోలీస్ కమిషనరేట్లు సూచిస్తున్న నిర్మానుష్య ప్రాంతాల్లోనూ వీధి లైట్లను అమర్చలేకపోతున్నామని వాపోతున్నారు. అందుకే ఈ ఏడాది ఏప్రిల్ నుంచే సదరు సంస్థకు నెలవారీ బిల్లులను నిలిపివేశామంటున్నారు. మరోవైపు.. బకాయిలను చెల్లించకపోవడంతోనే కొత్త లైట్లను సరఫరా చేయలేకపోతున్నామని ఈఈఎస్ఎల్ చెబుతోంది. ఈ వివాదంతో సామాన్య ప్రజలు.. ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారులు నిత్యం నరకం చూస్తున్నారు.

దీపావళి తరువాత

మూసీ కార్యాచరణ ముమ్మరం

- ఇప్పటికే ఖాళీ చేసిన నిర్వాసితులకు ఆర్థిక తోడ్పాటు
- 170 కుటుంబాలకు వడ్డీలేని రుణాలివ్వాలని నిర్ణయం



ఈనాడు–సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి: మూసీ గర్భంలో ఇళ్లను నిర్మించుకున్నవారిని ఒప్పించిన తరువాతే ఖాళీ చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయించింది. ఇప్పటికే ఖాళీ చేయించిన నిర్వాసితుల కుటుంబాలకు వడ్డీలేని రుణాలు ఇప్పించాలని కార్యాచరణ రూపొందించారు. ఉపాధి విషయంలో ప్రత్యేకంగా శిక్షణ కార్యక్రమం కూడా మొదలుపెట్టాలని నిర్ణయించారు. మిగిలిన నిర్వాసితులకూ ఇలాగే ఆర్థిక తోడ్పాటు ఇచ్చేలా ప్రణాళిక రూపొందించారు. దీపావళి తరువాత మరో వెయ్యి మందికిపైగా ఇళ్లను ఖాళీ చేయడానికి అంగీకరించినట్లు అధికారవర్గాలు తెలిపాయి.

ఎట్టి పరిస్థితుల్లో మూసీ సుందరీకరణ చేయాల్సిందేనన్న ఉద్దేశంలో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారు. సత్వర కార్యాచరణకు అధికారులను ఆదేశించారు. ఇందుకు మూసీలో, బఫర్ జోన్‌లో ఉన్న నిర్మాణాలను ఖాళీ చేయించే ప్రక్రియ రెండు దశల్లో చేపట్టాలని సర్కారు తాజాగా నిర్ణయించింది. నదీ గర్భంలో 1600 ఇళ్లు ఉన్నట్లు తేల్చారు. ఇప్పటివరకు 280 కుటుంబాలు తమ ఇళ్లు ఖాళీచేసి ప్రభుత్వం ఇచ్చిన రెండు పడకగదుల ఇంటికి వెళ్లిపోయాయి. ఇళ్ల కూల్చివేతలు ఇటీవల వివాదంగా మారడంతో అధికారులు కొద్ది రోజులపాటు నిలిపివేశారు. తాజాగా మరో వెయ్యి మంది వరకు ఇళ్లను ఖాళీ చేయడానికి ముందుకు రావడంతో దీపావళి తరువాత వీరిని తరలించాలని భావిస్తున్నారు. రెండోదశ కింద.. నది బఫర్ జోన్‌లో ఉంటున్నవారితో చర్చలు మొదలుపెట్టాలని నిర్ణయించారు.

నిర్వాసిత కుటుంబాలకు సాయం

మూసీ నిర్వాసితులను ఆదుకునే విషయంలో సర్కారు ఉదారంగా వ్యవహరించబోతోంది. ఖాళీ చేసిన 280 కుటుంబాల్లో 170 కుటుంబాలతో ఏదో ఒక వ్యాపారం లేదా వృత్తిపరమైన ఉపాధి కార్యక్రమం మొదలుపెట్టించాలని నిర్ణయించింది. బ్యాంకులనుంచి వడ్డీ లేని రుణాలు రూ.2లక్షల వంతున ఇప్పించడానికి ఏర్పాట్లు చేసింది. రుణం ఇప్పించి వారిని అలా వదిలేయకుండా స్త్రీనిధితో పాటు టీమాస్ సంస్థలతో కలిసి శిక్షణ ఇప్పించాలని నిర్ణయించారు. వీరు ఏ వ్యాపారం చేసుకోవడానికి ఇష్టపడుతున్నారో అందులో శిక్షణ ఇవ్వబోతున్నారు. ఈ వారంలోనే రుణాల పంపిణీ మొదలవుతుందని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఇప్పటికే ఖాళీచేసిన నిర్వాసితుల కుటుంబాలకు చెందిన 60మంది విద్యార్థులను గురుకులాలు, ఇతర విద్యాసంస్థల్లో చేర్పించారు.

శివారు రైతుకు చేయూత

- అంకుర సంస్థల స్థాపనకు ప్రోత్సాహం

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో పండ్లు కూరగాయలు పండిస్తున్న రంగారెడ్డి జిల్లా రైతులకు చేయూతనందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. వ్యవసాయ, వ్యవసాయేతర అంకుర సంస్థలను స్థాపించేందుకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మార్కెట్ అవసరాలకు అనుగుణంగా రైతుల నుంచే కూరగాయలు, ఉద్యాన పంటలు.. పండ్ల క్రయవిక్రయాలు నిర్వహించేందుకు అవసరమైన అంకుర సంస్థలు ఉండాలని ప్రభుత్వం నిర్ణయించగా.. అధికారులు ఈ మేరకు ఆ సంస్థల వివరాలను సేకరిస్తున్నారు. రంగారెడ్డి జిల్లాలో పండ్లు, కూరగాయలను పండించే ప్రాంతాలు హైదరాబాద్‌కు సమీపంలో ఉండడం, రవాణా సౌకర్యం సులభంగా ఉండడంతో అంకుర సంస్థలు ఏర్పాటు చేసేందుకు చాలామంది



ఆసక్తి ప్రదర్శిస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.

మెట్రో నగరాలే లక్ష్యం: అంకుర సంస్థల ఏర్పాటుతో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబయి నగరాలకు పండ్లు, కూరగాయలు, పూలను పంపించేందుకు నెట్‌వర్క్ ఏర్పాటుకానుందని అధికారులు చెబుతున్నారు. ఫైవ్‌స్టార్ హోటళ్లు, కార్పొరేట్ సంస్థలు, ఇతర కంపెనీలకు వీటిని పంపించేందుకు అంకుర సంస్థలు మార్కెటింగ్ చేయనున్నాయి. ప్రస్తుతం రంగారెడ్డి జిల్లాల్లో 75వేల ఎకరాల్లో కూరగాయలు, పండ్లు, పూలను రైతులు పండిస్తున్నారు. కూరగాయలు, ఉద్యాన పంటలను ఎక్కువగా హైదరాబాద్, బెంగళూరు మార్కెట్లకు తరలిస్తున్నారు. కూరగాయలు సాగు చేస్తున్న రైతులు బోయిన్‌పల్లి వ్యవసాయ మార్కెట్, సమీపంలోని రైతుబజార్లలో విక్రయిస్తున్నారు. పెట్టుబడి, రవాణా ఖర్చులు, కొంత లాభం వేసుకుని అమ్మేసుకుంటున్నారు. అంకుర సంస్థలు ఏర్పాటైతే ఈ పంటలకు మార్కెటింగ్‌తో పాటు వ్యవసాయేతర పనులు చేస్తున్న యువకులకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలున్నాయి.

కొత్త ఉపాధ్యాయులు...
కౌన్సెలింగ్‌కు హాజరుకండి



ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విధులు నిర్వహించేందుకు ఎంపికైన కొత్త ఉపాధ్యాయులు మంగళవారం ఉదయం 9గంటలకు హాజరు కావాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. ఎల్బీ స్టేడియంలో ఈ నెల 9న సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపు పత్రాలు అందుకున్న వారు వాటితో పాటు మూడు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, హాల్ టిక్కెట్ తీసుకురావాలని తెలిపారు. కౌన్సెలింగ్ గదిలో అభ్యర్థులను మాత్రమే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు.

- హైదరాబాద్ జిల్లా.. స్టాన్లీ బాలికల ఉన్నత పాఠశాల, ఎస్ఎస్‌సీ బోర్డు ఎదురుగా, చాపెల్ రోడ్, ఆబిడ్స్.
- రంగారెడ్డి జిల్లా... జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్, కొంగరకలాన్, ఇబ్రహీంపట్నం మండలం.
- మేడ్చల్ జిల్లా... జిల్లా విద్యాశాఖాధి కార్యాలయం. మేడ్చల్-మల్కాజిగిరి కలెక్టరేట్, అంతాయిపల్లి, శామీర్‌పేట్.

పాత బైక్‌లు.. విద్యుత్తు సొబగుల్

ఈనాడు, హైదరాబాద్

- రెట్రోఫిట్టింగ్‌పై నగరవాసుల ఆసక్తి
- కాలుష్యం, ట్రాఫిక్ సమస్యల నుంచి ఉపశమనం



పాత బైక్‌లను విద్యుత్తు వాహనాలుగా మార్చే విధానానికి నగరంలో ఆదరణ పెరుగుతోంది. రెట్రోఫిట్టింగ్‌పై నగర వాసులు ఆసక్తి చూపుతున్నారు. 10-15 ఏళ్ల పాటు బైక్‌లు వాడిన తర్వాత చాలామంది వాటిని తక్కువ ధరకు అమ్మేయడం, లేదంటే షెడ్డుకు పరిమితం చేస్తుంటారు. మళ్లీ లక్షలు పోసి కొత్త వాహనం కొంటుంటారు. తాజాగా రెట్రోఫిట్ పాలసీకి కేంద్రం ఆమోదముద్ర వేయడంతో పాత వాహనాలకు ప్రాణం పోయవచ్చని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా పెట్రోల్‌తో నడిచే బైక్‌లను రెట్రోఫిట్టింగ్‌తో బ్యాటరీ బైక్‌లుగా మార్చుకునే అవకాశం కల్పించనున్నారు. అదనంగా మరో 10ఏళ్ల వరకు ఇబ్బంది లేకుండా వాడుకునే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు.

పర్యావరణానికి ఎంతో మేలు...

వాహనాల తాకిడితో నగరంలో ఎక్కడ చూసినా ట్రాఫిక్ రద్దీ పెరుగుతోంది. ఎక్కువ శాతం ద్విచక్ర వాహనాలే ఉంటున్నాయి. ప్రతి నలుగురు కుటుంబ సభ్యులు ఉన్న ఇంట్లో కనీసం రెండేసి ద్విచక్ర వాహనాలు తప్పనిసరి అవుతోంది. ఏటా ఈ సంఖ్య అనూహ్యంగా పెరుగుతోంది. ఫలితంగా రోడ్లపై ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. కాలుష్యం అధికంగా ఉంటోంది. ఈ నేపథ్యంలో పాత బైక్‌లను విద్యుత్తు వాహనాలుగా మార్చుకోవడం ద్వారా పర్యావరణానికి మేలు జరగనుంది.

సంస్థ ఎంపికలో జాగ్రత్తలు అవసరం

బ్యాటరీతో నడిచే వాహనాలుగా మార్చే ముందు రెట్రోఫిట్టింగ్‌కు సంబంధించి సరైన సంస్థ ఎంపిక కీలకం. ఇలాంటి కంపెనీలకు ఆటోమొబైల్ రీసెర్చి అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఆర్ఏఐ) గుర్తింపు ఉందో..లేదో..? పరిశీలించాలి. నాణ్యమైన బ్యాటరీల సేవలకు ఈ గుర్తింపు ముఖ్యం. బ్యాటరీలకు ఒకటి, రెండేళ్ల గ్యారంటీని కూడా ఈ సంస్థలు అందిస్తాయి. బ్యాటరీల్లో నాణ్యత తగ్గినప్పుడు కొన్నిసార్లు పేలిపోయే ప్రమాదం ఉంటుంది. ఏఆర్ఏఐ సర్టిఫికేషన్ ఉన్న వాటిని నాణ్యతకు గ్యారంటీ ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

వ్యయం ఇలా..

- ప్రస్తుతం ఒక బైక్‌ను విద్యుత్తు వాహనంగా మార్చేందుకు కిట్‌తోపాటు బ్యాటరీకి రూ.60-70 వేల వరకు ఖర్చు అవుతుంది.
- భవిష్యత్తులో కిట్‌తోపాటు బ్యాటరీల ధరలు తగ్గితే రూ.20-30 వేలలోనే ఈ సదుపాయాన్ని పొందొచ్చు.
- గ్రేటర్‌లో బైక్‌లు, కార్లు ఇతర వాహనాలు కలిపి 80 లక్షలు దాటాయి.
- రోజూ మూడు వేల వాహనాలు కొత్తగా రోడ్లపైకి వస్తున్నాయి.
- 10-15 ఏళ్లు వాడిన తరువాత బైక్‌లను విద్యుత్తు వాహనాలుగా మార్చుకునే అవకాశం ఉంది.
- బ్యాటరీల్లో కనీసం వివిధ రకాలను బట్టి 50 కిలోమీటర్ల నుంచి 150 కిలోమీటర్ల వరకు నిరాటంకంగా నడపవచ్చని నిపుణులు చెబుతున్నారు.
- 100-150 కిలోమీటర్ల సామర్థ్యం కావాలంటే బ్యాటరీకి రూ.30 నుంచి రూ.35 వేల వరకు వెచ్చించాల్సి ఉంటుంది.

జనారణ్యం.. హరిణోత్సాహం

వనంలో నుంచి జింకలు జనంలోకి వచ్చినట్లున్నాయి కదూ.. పంజాగుట్ట నాగార్జున కూడలిలో జింకలు చెంగుచెంగున ఎగురుతూ పరుగులు తీస్తున్నట్లున్న ఈ బొమ్మలు ఆకట్టుకుంటున్నాయి.



సగం ఎస్టీపీలు.. ఎఫ్‌టీఎల్‌లోనే!

- ఆలస్యంగా గుర్తించిన జలమండలి
- హైడ్రా దెబ్బతో కొత్త స్థలాల ఎంపిక

ఈనాడు, హైదరాబాద్: జలమండలి కొత్తగా నిర్మించనున్న మురుగు శుద్ధి కేంద్రాలు(ఎస్టీపీల) చాలా వరకు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయని జలమండలి ఆలస్యంగా గుర్తించింది. మొత్తం 39 ఎస్టీపీల్లో దాదాపు సగం కేంద్రాలది ఇదే పరిస్థితి అని తెలుసుకుంది. హైడ్రా నిబంధనల నేపథ్యంలో ఎస్టీపీలు నిర్మించనున్న ప్రాంతాలపై అధికారులు మరోసారి సమీక్ష చేశారు. ఈ కేంద్రాల్లో ఎక్కువ శాతం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లల్లో ఉండటంతో అప్రమత్తమయ్యారు. చెరువులకు దూరంగా నిర్మించేందుకు కొత్త స్థలాల ఎంపికపై కసరత్తు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అమృత స్కీంలో భాగంగా ప్రభుత్వంతోపాటు గుత్తేదారు భాగస్వామ్యం కింద హైబ్రిడ్ యాన్యుయుటీ పద్ధతి(హామ్)లో కొత్తగా 39 ఎస్టీపీలను నిర్మించనున్న సంగతి తెలిసిందే. అవుటర్ రింగ్‌రోడ్డు వరకు మురుగు కలిసే మూసీతో పాటు చెరువులు, కుంటల వద్ద వీటిని ఏర్పాటుచేయనున్నారు. మరో వారంలో టెండర్లను ఆహ్వానించేందుకు జలమండలి సిద్ధమవుతోంది. మొత్తం రూ.3849.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్నారు.



కేంద్రం నుంచి 40శాతం.. అమృత స్కీంతో పాటు హామ్ మోడల్ కింద కేంద్రం 40 శాతం, గుత్తేదారు సంస్థ, జలమండలి కలిసి 60 శాతం నిధులు వెచ్చిస్తాయి. పనులు పూర్తిచేసిన తర్వాత గుత్తేదారు పెట్టిన మొత్తాన్ని వాయిదాల పద్ధతిలో తిరిగి జలమండలి చెల్లించనుంది. భూసేకరణ ఇబ్బంది లేకుండా ప్రభుత్వ భూముల్లో చిన్నచిన్న కేంద్రాలను ఎక్కువ ప్రాంతాల్లో నిర్మించనున్నారు. వీటిలో చాలా వరకు చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్‌లో నిర్మించేందుకు తొలుత ప్రణాళిక సిద్ధంచేశారు. సర్వే లేకుండానే ఈ స్థలాలను ఎంపిక చేశారు. ఇటీవల హైడ్రా కార్యాచరణ నేపథ్యంలో జలమండలి మరోసారి వీటిని పరిశీలించడంతో అసలు విషయం తెలిసింది. దీంతో తాజాగా చెరువులకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లకు దూరంగా ఉండేలా చూస్తున్నామని ఓ అధికారి తెలిపారు.

కేంద్రాలు ఏర్పాటయ్యే ప్రాంతాలు: అమీన్‌పూర్, నేరెల్ల, ఇక్రిశాట్, ఉస్కెబావి, బాచుగూడ, తిమ్మక్కచెరువు, గండిగూడెం, గౌడవల్లి, పోతాయ్‌పల్లి లేక్, నవకుంట లేక్, పీర్జాదిగూడ, కొర్రెముల, నాగారంలేక్, చీర్యాల లేక్, కుందన్‌పల్లి, యామ్నంపేట్, కుంట్లూరు, గౌరెల్లి, ఎదులచెరువు, పల్లెచెరువు, ఉమ్దాసాగర్, బండ్లగూడ, గుర్రంచెరువు, మీర్‌పేట్ తలాబ్ ఎస్టీపీ, సాధన చెరువు, రావిర్యాల, బొంగులూరు, మాసబ్‌చెరువు, కొత్వాల్‌గూడ, కామునిలేక్, నల్లచెరువు-2, కాప్రా, హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్, ఫతేనగర్-2, చిత్రపురి, నార్సింగ్(ఓఆర్ఆర్), హైదర్షాకోట్, సంగం(బాపూఘాట్), పటేల్‌చెరువు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అమీర్‌పేట, న్యూస్‌టుడే: (ఇవి సోమవారం నాటివి. కిలోకు రూపాయల్లో) టమాట 55, నల్ల వంకాయ 35, బెండ 35, పచ్చిమిర్చి 23, బజ్జి మిర్చి 65, క్యాప్సికం 70, పచ్చకారం 38, పందిరి బీర 45, క్యాబేజీ 23, క్యారెట్ 40, దొండ 35, గుండుబీన్స్ 95, గింబచిక్కుడు 55, గోకరకాయ 40, కీర 23, బీర 35, బీట్‌రూట్ 25, ఉల్లి 40, ఆలు 37, చామ 35, కంద 60, గోబీ 23, సొర 15, పొట్లకాయ 23, అరటి 9, మునగ 4, ముల్లంగి 6, ఉల్లిపొరక 65, వేరుశనగ 50, నిమ్మకాయలు (డజన్) 35, అల్లం(తెల్లది) 160, వెల్లుల్లి 320.

అల్వాల్‌లో.. అల్వాల్: టమాట 55, వంగ 35, బెండ 35, పచ్చిమిర్చి 50, కాలిఫ్లవర్ 23, క్యాబేజీ 23, క్యారెట్ 40, దొండ 35, ఆలు 37, ఉల్లి 34, సొర 17, పొట్ల 23, బీన్స్ 95, గోరుచిక్కుడు 40, చిక్కుడు 55, దోస 35, బీర 45, కాకర 38, చామగడ్డ 35, కీర 35, క్యాప్సికం 70, బీట్‌రూట్ 25, మునగ 80, ముల్లంగి 7(ఒకటి).

సికింద్రాబాద్

• సికింద్రాబాద్ • కంటోన్మెంట్ • సనత్‌నగర్

తలసానిని కలిసిన బేగంపేట బస్తీవాసులు



బేగంపేట, న్యూస్‌టుడే: బేగంపేట డివిజన్‌కు చెందిన పలువురు బస్తీవాసులు సోమవారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిశారు. మారేడుపల్లిలోని క్యాంపు కార్యాలయానికి వెళ్లిన బస్తీవాసులు ఎమ్మెల్యేను సన్మానించి, పండగ శుభాకాంక్షలు తెలిపారు. కలిసిన వారిలో నాయకులు శ్రీహరి, శేఖర్ ముదిరాజ్, డివిజన్ భారాస అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

మేమున్నాం..మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ. 1 గంట మధ్య

సికింద్రాబాద్ : 8008573368
కంటోన్మెంట్ : 8008573361
సనత్‌నగర్ : 8008573356

సనత్‌నగర్, న్యూస్‌టుడే: ? సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం నుంచి కూరగాయల మార్కెట్‌కు వెళ్లే దారి పూర్తిగా పాడైపోయింది. రోడ్డుపై గుంతలు పడ్డాయి. మ్యాన్‌హోళ్ల నుంచి పొర్లిపొంగుతున్న మురుగుతో ఇబ్బంది పడుతున్నాం. **-వెంకటేష్‌గౌడ్, సనత్‌నగర్**

✓ రోడ్డు బాగు చేసేందుకు నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం. **- సందీప్, ఏఈ, జీహెచ్ఎంసీ**

సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: ? ఎస్సార్‌నగర్ ప్రాంతంలో పలువురు ఇంటి గేటు ముందే చెత్త తీసుకొచ్చి పడేస్తున్నారు. దీంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం. **- మంజుల, ఎస్సార్‌నగర్**

✓ ఎవరూ చెత్త వేయకుండా బ్యానర్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటాం. చెత్తవేసిన వారికి జరిమానా విధిస్తాం. **- ఏఎంహెచ్ఓ డా.చంద్రశేఖర్‌రెడ్డి**

ట్రాఫిక్ కష్టాలు.. ఇంకెన్నాళ్లో..!

● అడుగు పడని చిలకలగూడ - సీతాఫల్‌మండి రహదారి విస్తరణ పనులు

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ నియోజకవర్గంలో రహదారుల విస్తరణ ప్రణాళికలు మోక్షం లభించడం లేదు. రోజురోజుకు వాహనాల సంఖ్య పెరుగుతుండటంతో ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. నియోజకవర్గంలో ప్రధాన రహదారైన చిలకలగూడ-సీతాఫల్‌మండి, సీతాఫల్‌మండి-జామై ఉస్మానియా రోడ్లను విస్తరించాలని ప్రతిపాదనలు పాతికేళ్ల నుంచి ఉన్నా పూర్తిస్థాయి విస్తరణకు నోచుకోవడం లేదు. తుకారాంగేట్, లాలాపేట ప్రాంతాల్లోని రోడ్లను విస్తరించి ప్రజలకు కొన్ని ఊరటనిచ్చినప్పటికీ మిగతా వాటిని విస్తరించడంలో అంతగా దృష్టి సారించడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.



చిలకలగూడలో..

1.5 కి.మీటర్ల ప్రయాణానికి అరగంట..

నియోజకవర్గంలో విస్తరించిన ప్రధాన రహదారుల్లో చిలకలగూడ-సీతాఫల్‌మండి-జామై ఉస్మానియా ఒకటి. ఒలిఫెంటా బ్రిడ్జి నుంచి సీతాఫల్‌మండి నుంచి బౌద్ధనగర్ జామై ఉస్మానియా మీదుగా రాంనగర్, విద్యానగర్, అంబర్‌పేట, దిల్‌సుఖ్‌నగర్‌వైపు, రాంనగర్ మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకున్న అతి సమీప దారి ఇదే. ఒకప్పుడు సికింద్రాబాద్ నుంచి తార్నాక, ఓయూ ఆ పరిసర ప్రాంతాలకు వెళ్లాలంటే ఆలుగడ్డబావి, మెట్టుగూడ, తార్నాక మీదుగా వెళ్లాల్సి వచ్చేది. ఉదయం, సాయంత్రం వేళల్లో ఒలిఫెంటా బ్రిడ్జి చౌరస్తా నుంచి చిలకలగూడ-సీతాఫల్‌మండి చౌరస్తా వరకు ఉన్న కిలోమీటరున్నర దూరం ప్రయాణించాలంటే 20-30 నిమిషాలు పడుతోంది. కొన్నేళ్లకిందట టీడీఆర్(ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్) పథకం తెరపైకి రావడంతో విస్తరణ సులభతరం అవుతుందని యంత్రాంగం భావించింది. కాని యజమానులెవరూ ముందుకు రాలేదు. ప్రస్తుతం ఈ రోడ్డు పరిస్థితి ఎలా ఉందంటే, ఎదురెదురుగా బస్సులు ఎదురవుతే ఒకేసారి దేనికది వెళ్లలేవు. ఒకటి ఎదురుగా వస్తుందంటే అటుగా వెళ్తున్న బస్సు, ఇతర భారీ వాహనం గాని నిలిచిపోవాల్సిందే. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని రోడ్ల విస్తరణ పనులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. 'సర్కిల్ పరిధిలో చేపట్టాల్సిన రోడ్ల విస్తరణ దశలవారీగా చేపడుతున్నాం. చిలకలగూడ-సీతాఫల్‌మండి రోడ్డు విషయంలో స్థలాలు కోల్పోయే యజమానులకు నోటీసులు ఇచ్చి, పరిహారం చెల్లించేందుకు సన్నాహాలు చేస్తున్నాం' అని ఓ సీనియర్ అధికారి తెలిపారు.

విస్తరణ జరగాల్సిన సరళి

ప్రాంతం	ప్రస్తుత వెడల్పు	విస్తరించే అడుగులు	దూరం	కోల్పోయే నివాసాలు	ప్రయాణికులు
ఒలిఫెంటా-సీతాఫల్‌మండి	40-60 (అడుగులు)	80-120	1.5 కిమీ	179	1.5 లక్షలు
సీతాఫల్‌మండి-జామైఉస్మానియా	40-60 (అడుగులు)	80-120	2.5 కిమీ	323	2.5 లక్షలు

నాగేందర్‌కు శుభాకాంక్షలు తెలిపిన నేతలు



బేగంపేట, న్యూస్‌టుడే: విజయ దశమి సందర్భంగా బేగంపేట డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నేతలు సోమవారం ఎమ్మెల్యే దానం నాగేందర్‌ను కలిశారు. నాయకుడు విశాల్ సూదం ఆధ్వర్యంలో అరుణ్‌గౌడ్, చిరంజీవి, అఖిల్, మోహిత్, గోవింద్ తదితరులు నాగేందర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కారుణ్య నియామకాల సమస్య పరిష్కరించాలని వినతి



కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయిన ఎంపీ ఈటల

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సోమవారం ఎంపీ ఈటల రాజేందర్ దిల్లీలో భేటీ అయినట్లు ఆయన కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కారుణ్య నియామకాల విషయంలో అయిదు శాతం సీలింగ్‌ను ఎత్తివేసి సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో మృతిచెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులను నియమించేలా చర్యలు తీసుకోవాలని ఈటల మంత్రిని కోరినట్లు తెలిపారు.

ప్రొఫెసర్ సాయిబాబా మరణం తీరనిలోటు

లాలాపేట, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ సాయిబాబా మరణం తీరని లోటని పలువురు నాయకులు పేర్కొన్నారు. టీపీసీసీ కార్యదర్శి కోట శ్రీనివాస్, సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్‌లు మౌలాలిలోని ఆయన నివాసానికి చేరుకొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన గొప్ప వ్యక్తి ప్రొ.సాయిబాబా అని కొనియాడారు.

ఉచిత వైద్య శిబిరం

అమీర్‌పేట: అమీర్‌పేటలోని ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఎస్సార్‌నగర్ సీనియర్ సిటిజన్ కౌన్సిల్ కార్యాలయంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సీనియర్ సిటిజన్ కౌన్సిల్ ప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన సుమారు 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఔషధాలను అందజేశారు. ఈసీజీ, రక్త పరీక్షలనూ నిర్వహించారు. కౌన్సిల్ అధ్యక్ష, కార్యదర్శులు మాణిక్‌రావు పాటిల్, జి.యాదగిరి తదితరులు పర్యవేక్షించారు.

విరిగిన మూత.. కర్రే సూచిక



సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలోని ఎమ్మ్‌ఎస్ రేస్ కోర్సు పంప్ హౌస్ చౌరస్తా మీదుగా నిత్యం వేల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ చౌరస్తాలో గతంలో ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్ మూత విరిగి ప్రమాదకరంగా మారింది. దీంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా స్థానికులు ప్రమాద సూచికగా కర్రను ఏర్పాటు చేశారు. బోర్డు అధికారులు కొత్త మ్యాన్‌హోల్ మూతను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

ప్లే గ్రౌండ్‌ను పట్టించుకోరా..?



వెస్ట్ మారేడుపల్లి నెహ్రూనగర్ పార్క్ సమీపంలోని చిన్నపిల్లల ప్లే గ్రౌండ్ రాళ్లు రప్పలు, చెత్తకుప్పలు, తుప్పు పట్టి విరిగిన ఆట వస్తువులతో అధ్వానంగా తయారైంది. ఈ సమస్య కొన్నేళ్లుగా ఉన్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. పరిసర ప్రాంతాల పిల్లలు ఇటుగా వచ్చి ఆడుకోవడానికి ఇబ్బంది పడుతున్నారు. కొందరు ఆడుకుంటూ గాయాలపాలయ్యారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. **-న్యూస్‌టుడే, మారేడుపల్లి**

ప్రయాణికుల రక్షణకు ఆర్పీఎఫ్ పోలీసుల కృషి

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: ప్రయాణికుల భద్రతకు ఆర్పీఎఫ్ పోలీసులు కృషి చేస్తున్నారని సికింద్రాబాద్ డివిజనల్ సీనియర్ సెక్యూరిటీ కమిషనర్ దేబాష్మితా ఛటోపాధ్యాయ బెనర్జీ ఓ ప్రకటనలో తెలిపారు. ఆపరేషన్ జీవన్ రక్షలో భాగంగా రైల్వేస్టేషన్లలో తమ సిబ్బంది అప్రమత్తంగా ఉండటమే కాకుండా ఆపదలో ఉన్న ప్రయాణికులను రక్షిస్తున్నారని పేర్కొన్నారు. 2023లో ఆరుగురిని, 2024లో నలుగురు ప్రయాణికుల ప్రాణాలను ఆర్పీఎఫ్ సిబ్బంది కాపాడినట్లు తెలియజేశారు. లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ పి.రాజశేఖర్, కానిస్టేబుల్ విశ్వజిత్‌కుమార్‌లు ఈ నెల 13న లింగంపల్లి రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంపై విధులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్-పూర్ణ ఎక్స్‌ప్రెస్ రైలు లింగంపల్లి రైల్వేస్టేషన్‌లోని 1వ నంబర్ ప్లాట్‌ఫాంకు చేరుకొని.. తిరిగి బయలుదేరే సమయంలో కదులుతున్న రైల్లో ఎక్కేందుకు ఓ మహిళా ప్రయత్నించింది. మెట్లమీద నుంచి కాలు జారడంతో కిందపడుతుండగా.. గుర్తించిన కానిస్టేబుళ్లు బయటకు లాగారు. దీంతో ఆమెకు ప్రమాదం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న సెక్యూరిటీ కమిషనర్ కానిస్టేబుళ్లతో మాట్లాడి అభినందించారు.

మహాత్మానగర్‌లో బస్తీబాట



బస్తీవాసులతో మాట్లాడుతున్న బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతానికి మంచి నీటి సరఫరా విషయంలో రాష్ట్ర ప్రభుత్వంతో సమరం చేయక తప్పని పరిస్థితులు నెలకొంటున్నాయని బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ అన్నారు. న్యూబోయిన్‌పల్లి మహాత్మానగర్ బస్తీలో సోమవారం నిర్వహించిన బస్తీబాటలో రామకృష్ణ పాల్గొని మాట్లాడారు. బస్తీలో నెలకొన్న సమస్యలను త్వరతగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. జలమండలి ఈ ప్రాంతానికి సరిపడా మంచినీటిని సరఫరా చేయలేకపోతుండడంతోనే సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. అనంతరం ఆయన భాజపా నేతలతో కలిసి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. అజయ్‌గౌడ్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున ఆలయంలో విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో స్వామి

సనత్‌నగర్, న్యూస్‌టుడే: సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలోని మల్లికార్జున స్వామి ఆలయంలో సోమవారం స్వామివారికి విశేష పూజలు చేశారు. స్వామిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకుడు రిపుంజయ్‌శర్మ ఆధ్వర్యంలో ఉదయం నుంచి స్వామికి అభిషేకం, అర్చన తదితర కార్యక్రమాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈఓ సత్యనారాయణ, శ్రీనివాస్ గౌడ్ పర్యవేక్షించారు.

వైభవంగా అమ్మవారి నిమజ్జనోత్సవం

సంజీవరెడ్డినగర్, న్యూస్‌టుడే: శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా బస్తీ, కాలనీల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలు ఆదివారం రాత్రి నిమజ్జనానికి ఊరేగింపుతో స్థానిక పురవీధుల గుండా భక్తులు వెంటరాగా హుస్సేన్‌సాగర్‌కు తరలివెళ్లాయి.

● బల్కంపేట సైంటిఫిక్ కాలనీ వీరాంజనేయస్వామి సాయిమణికంఠ దేవస్థానంలో ఏర్పాటు చేసిన దేవిని నిమజ్జనానికి తరలించారు. ఏర్పాట్లను ఆలయ కార్యదర్శి కుందారం ప్రభాకర్‌చారి పర్యవేక్షించారు.

● బీకేగూడ దాసారం బస్తీ ప్రధాన రహదారిలో ఏర్పాటు చేసిన అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం నిమజ్జనానికి తరలించారు. స్వామి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అడ్డగుట్ట కమ్యూనిటీ హాల్ సమీపంలో..

అడ్డగుట్ట: తుకారంగేట్ పీఎస్ పరిధిలోని అడ్డగుట్ట ఏబీసీడీ సెక్షన్లు, మహేంద్ర హిల్స్ తదితర తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 17 దుర్గామాత విగ్రహాలను ఆదివారం నిమజ్జనానికి తరలినట్లు తుకారంగేట్ ఠాణా సీఐ శంకర్‌నాయక్ తెలిపారు. అమ్మవారి మండపాల నిర్వాహకులు ప్రతిమలను వాహనాలపై ఏర్పాటు చేసి డప్పు చప్పుల మధ్య నృత్యాలు, భజనాలు చేస్తూ భక్తిశ్రద్ధలతో తరలించారు. కొన్ని విగ్రహాలు సఫీల్‌గూడ, షామీర్‌పేట్, మరికొన్ని విగ్రహాలు ట్యాంక్ బండ్‌కి పోలీస్ బందోబస్తు మధ్య తరలించినట్లు సీఐ తెలిపారు.

పద్మారావునగర్: దసరా శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా బన్సీలాల్ పేట డివిజన్ హమాలీబస్తీలోని నల్ల పోచమ్మ పల్లకి ఊరేగింపు నిర్వహించారు. సీతాఫల్ మండి కార్పొరేటర్ సామల హేమ తదితరులు హాజరయ్యారు.



బల్కంపేట సైంటిఫిక్ కాలనీలో..



హమాలీ బస్తీలో నల్లపోచమ్మకి పల్లకి సేవ

జడ్సీ కార్యాలయంలో అధికారుల సమావేశం



సికింద్రాబాద్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, జలమండలి, విద్యుత్తు తదితర విభాగాల అధికారులతో జోనల్ కమిషనర్ రవికిరణ్ సోమవారం సమావేశాన్ని నిర్వహించి వివిధ అంశాలపై చర్చించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ సూచనల ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో పేరుకుపోయిన వ్యర్థాలు, చెత్తను, శిథిలాలను తొలగించడంపై దృష్టి సారించాలని తీర్మానించారు. ట్రాఫిక్ డిపార్ట్‌మెంట్ ద్వారా ట్రాఫిక్ మార్కింగ్, జీబ్రా క్రాసింగ్‌లు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ డీసీపీ రాహుల్ హెగ్డే, సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.అనిల్ రాజ్, సిటీ ప్లానర్ రఘునందన్, ఈఈ రోహిణిలతో పాటు జోన్ పరిధిలోని డిప్యూటీ కమిషనర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఏఎంఓహెచ్‌లు పాల్గొన్నారు.

చూపు కోల్పోతున్న వారి సంఖ్య పెరుగుతోంది

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: దేశంలో చూపు కోల్పోతున్నవారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందని శాసనమండలి సభ్యుడు తీన్మార్ మల్లన్న అన్నారు. కాబట్టి ఈ రంగంలో కృషి, సేవ చేసేవారి బాధ్యత కూడా పెరుగుతుందన్నారు. సోమవారం రాత్రి రవీంద్రభారతిలో 'ఇట్రాడ్' (ఇనిస్టిట్యూట్ ఫర్ ట్రైనింగ్ రిలీఫ్ రిహాబిలిటేషన్ ఆఫ్ డిసెబుల్డ్ డిస్ట్రెస్డ్ అండ్ డిస్‌ఇన్‌హెరిటెడ్ చిల్డ్రన్) 29వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. మళ్లీ జన్మ లేదు.. పోయేటప్పుడు కట్టుకుపోయేది లేదు. కాబట్టి బతికున్నంత కాలం చరిత్రలో నిలిచిపోయేలా సేవ చేద్దామన్నారు. కేంద్రంలో అంధుడిని మంత్రిగా, అలాగే అంధుడిని అర్చకుడుగా చూడాలని ఉందన్నారు. చిలుకూరు బాలాజీ ప్రధానార్చకులు సీఎస్ రంగరాజన్ మాట్లాడుతూ.. ప్రజల్లో భక్తితో పాటు సామాజిక స్పృహను కూడా పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, ఎంఎల్ఆర్ విద్యా సంస్థల అధినేత మర్రి లక్ష్మణ్‌రెడ్డి, చిలుకూరు బాలాజీ ప్రధాన సేవకుడు పవన్‌కుమార్, సామాజిక కార్యకర్త కె.మాలతీ శ్రీనివాస్‌లు మాట్లాడారు. నిర్వాహకుడు మధుకర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా 'ఆచార్య దేవో భవ' పురస్కారాలతో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సత్కరించారు.



వేడుకను ప్రారంభిస్తున్న రంగరాజన్, తీన్మార్ మల్లన్న, బంగారు శృతి, మధుకర్‌రెడ్డి తదితరులు

పద్యనాటకాల పరిరక్షణ బాధ్యత అందరిది

గాంధీనగర్, న్యూస్‌టుడే: పౌరాణిక పద్యనాటకాలు తెలుగు భాషా సంపద అని సాహితీవేత్త ఎంకే రాము అన్నారు. ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో.. సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో పద్యనాటకోత్సవాలను ఆయన ముఖ్యఅతిథిగా ప్రారంభించి మాట్లాడారు. రోజురోజుకూ కనుమరుగవుతున్న నాటకాల పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదీ అన్నారు. ఈ సందర్భంగా ద్వారక మయసభల ఘట్టాన్ని ప్రేక్షకరంజకంగా ప్రదర్శించారు. దుర్యోధనుడిగా ఎం.సాళ్వాచారి, శ్రీకృష్ణుడిగా టి.బాబురాజు, అర్జునుడిగా నారాయణస్వామిలు ప్రదర్శనను రక్తికట్టించారు. నిర్వహణ సంస్థ అధ్యక్షుడు లోకం కృష్ణయ్య, ప్రముఖులు లంకా లక్ష్మీనారాయణ, వీరభోగ వసంతరాయలు తదితరులు పాల్గొన్నారు.



కళాకారులతో ఎంకే రాము, లక్ష్మీనారాయణ, కృష్ణయ్య

కేజీకేఎస్ వార్షికోత్సవ సభ 18న

బాగ్‌లింగంపల్లి: కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్) 67వ వార్షికోత్సవ సభను ఈ నెల 18న సుందరయ్య కళానిలయంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ తెలిపారు. సోమవారమిక్కడ కేజీకేఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్లుగీత వృత్తిలో ఉపాధి అవకాశాలు అనే అంశంపై ప్రధానంగా చర్చిస్తామన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, బీసీ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు హాజరవుతున్నట్లు తెలిపారు. కేజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, నేతలు వెంకటనరసయ్య, కృష్ణస్వామి, లింగంగౌడ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి



విద్యార్థులతో కోనసీమ ద్రవిడ సంఘం ప్రతినిధులు

గాంధీనగర్: చదువుతోపాటు నైపుణ్యాలనూ విద్యార్థులు పెంపొందించుకోవాలని కోనసీమ ద్రవిడ సంఘం ప్రతినిధులు వడ్లమాని బాలమణి, ఆదిభట్ల కామేశ్వరరావు కోరారు. విజయదశమిని పురస్కరించుకుని సంఘం ఆధ్వర్యంలో.. గతేడాది ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలు సహా స్కాలర్‌షిప్‌లు, ధ్రువపత్రాలను ప్రదానం చేసి మాట్లాడారు. సంఘం ప్రతినిధులు బండి శ్రీనివాస్, కందాల భాస్కర రామచంద్ర, మంతా నరసింహశాస్త్రి, దక్షిణామూర్తి, అనంతలక్ష్మి, త్రిమూర్తి, డీఎల్‌వీ సత్యనారాయణ, కర్ర లక్ష్మీనారాయణ, భీమశంకరం పాల్గొన్నారు.

సాయంత్రం వేళ.. సికింద్రాబాద్‌లో వాన



సికింద్రాబాద్‌లో సోమవారం సాయంత్రం కురిసిన వర్షంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. పలు కాలనీలు, బస్తీల్లో రోడ్లు జలమయం అయ్యాయి.

అప్రమత్తంగా హైడ్రా

ఈనాడు డిజిటల్, హైదరాబాద్ : రానున్న మూడు రోజుల పాటు నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో హైడ్రా అప్రమత్తంగా ఉన్నట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో పరిస్థితిని డీఆర్ఎఫ్ బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. రాజ్‌భవన్ రోడ్డుతోపాటు వరద ముప్పు ఉన్న బేగంపేట, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో డీఆర్ఎఫ్ బృందాలు తనిఖీలు నిర్వహించారు.

ప్రమాదవశాత్తు రైలు కిందపడి ఒకరి దుర్మరణం

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: రైల్లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారి రైలు కింద పడిపోవడంతో ఓ గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్-లాలాగూడ రైల్వేస్టేషన్ల మధ్య రైలు పట్టాలపై సోమవారం ఉదయం ఓ వ్యక్తి(30) మృతదేహం ఉన్నట్లు రైల్వేస్టేషన్ అధికారుల ద్వారా జీఆర్పీ పోలీసులకు సమాచారం అందింది. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. రైల్లో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు రైలు కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. వివరాలను తెలిసిన వారు 87126 58581 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

మల్కాజిగిరి

అల్వాల్ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

అల్వాల్: (సోమవారం నాటివి..కిలో రూ.లో) టమాటా 55, వంగ 35, బెండ 35, పచ్చిమిర్చి 50, కాలీఫ్లవర్ 35, క్యాబేజీ 25, క్యారెట్ 40, దొండ 35, ఆలు 37, ఉల్లి 34, సొర 17, పొట్ల 23, బీన్స్ 95, గోరుచిక్కుడు 40, చిక్కుడు 55, దోస 35, బీర 45, కాకర 38, క్యాప్సికం 70, కీర 35, క్యాప్సికం 70, బీట్‌రూట్ 25, కందగడ్డ 60, మునగ 80, ముల్లంగి 7(ఒకటి).

రామకృష్ణాపురంలో..

డిఫెన్స్‌కాలనీ: టమాట కిలో రూ.55, వంగ 35, బెండ 35, పచ్చిమిర్చి 50, కాకర 38, బీర 45, క్యాబేజీ 25, బీన్స్ 95, క్యారెట్ 40, దొండ 38, చిక్కుడు 55, క్యాప్సికం 70, ఆలు 37, కీర 23, దోస 35, చామగడ్డ 35, అరటి 9, బీట్‌రూట్ 25, సొర 17, గోకర 40, చిలకడదుంప 38, మామిడి 105, మునగ 82.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి


జోనల్ కమిషనర్ రవికిరణ్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

నేరేడ్‌మెట్: వినాయకనగర్ డివిజన్‌లో నిధులు లేక ఆగిపోయిన అభివృద్ధి పనులకు వెంటనే నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ రాజ్యలక్ష్మి జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను కోరారు. ఈ మేరకు ఆమె మల్కాజిగిరి సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మణ్‌తో కలిసి సోమవారం రవికిరణ్‌ను సికింద్రాబాద్‌లోని కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. డివిజన్ పరిధిలో సీసీ రోడ్లు, సామాజిక భవనాల నిర్మాణానికి సిద్ధం చేసిన అంచనాలు మంజూరు చేయాలని తెలిపారు. సంబంధిత అధికారులు సహకరించాలని ఆమె విన్నవించారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోండి


కార్యక్రమంలో డీసీ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు

అల్వాల్: ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని బస్తీ, కాలనీ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అల్వాల్ సర్కిల్ ఉపకమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో మాట్లాడారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజావాణి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆర్థిక వనరులతో సంబంధం లేని వినతులను మూడు రోజుల్లో పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు. ఆర్థిక పరమైన వినతులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ నరసింహారెడ్డి, ఈఈ శ్రీకాంతి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: మేడ్చల్ కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణికి 33 ఫిర్యాదులు వచ్చాయి. దసరా పండగ ప్రభావంతో ప్రజావాణికి ఎక్కువ మంది ప్రజలు రాలేదు. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, లాఆఫీసర్ చంద్రావతితో కలిసి అర్జీలను స్వీకరించారు. ఫిర్యాదుల్లో భూసమస్యలు, ధరణి, రెండు పడక గదులు, పింఛన్లు ఇతర సమస్యలపై ఉన్నాయి.

లక్షల వ్యయం.. ఆనవాళ్లు మృగ్యం

● దొంగల పాలైన చెత్త సేకరణ డబ్బాలు ● నిమజ్జన ఘాట్ల వద్ద మళ్లీ కొత్తవి ఏర్పాటు

మల్కాజిగిరి సర్కిల్ పరిధిలో

డివిజన్లు	6
కాలనీలు	400
పారిశుద్ధ్య సిబ్బంది	450
సహాయకులు	29
సూపర్‌వైజర్లు	2
పారిశుద్ధ్య నిర్వహణ అధికారి	1

గౌతంనగర్, న్యూస్‌టుడే: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా జీహెచ్‌ఎంసీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో రూ.5.70 లక్షల వ్యయంతో గత ఏడాది మార్చి-జులై మధ్య చెత్త సేకరణ డబ్బాలు ఏర్పాటు చేశారు. సైనిక్‌పురి కూడలి నుంచి ఆర్కేపురం ఫ్లైఓవర్ వరకు, నేరేడ్‌మెట్ కూడలి నుంచి సఫిల్‌గూడ కూడలి వరకు, మిర్జాలగూడ కూడలి నుంచి సఫిల్‌గూడ కూడలి వరకు మూడు విభాగాలుగా విభజించి 60 ప్రాంతాల్లో చెత్త సేకరణ డబ్బాలు ఏర్పాటు చేశారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో మూడు డబ్బాలు చొప్పున పెట్టారు. వాటిలో తడి, పొడితో పాటు హానికర వ్యర్థాల సేకరణకు కూడా ప్రత్యేకంగా మరో డబ్బా, రద్దీ తక్కువగా ఉండే ప్రాంతాల్లో కేవలం తడి, పొడి చెత్త సేకరణ డబ్బాలు మాత్రమే ఏర్పాటు చేశారు. నాణ్యత లేమో.. అధికారుల పర్యవేక్షణ లోపమో దాదాపుగా డబ్బాలన్నీ మాయమయ్యాయి. ఇనుప కడ్డీలు మాత్రం నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి.


సఫిల్‌గూడలో మాయమైన డబ్బాలు


మినీట్యాంక్‌బండ్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన డబ్బా

బతుకమ్మ ఘాట్ల వద్ద..

ప్రస్తుత నగరాన్ని డస్ట్‌బిన్ రహిత నగరంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో బహిరంగ ప్రదేశాల్లోని చెత్తను తరలించేందుకు జీహెచ్‌ఎంసీ రాంకీ సంస్థకు బాధ్యతలు అప్పగించింది. మల్కాజిగిరిలో సుమారు 180 మంది పారిశుద్ధ్య కార్మికులు నిత్యం చెత్త తరలింపులో పాలు పంచుకుంటున్నారు. ఇందుకు కోసం 19 పెద్ద లారీలు, 3 చిన్న లారీలు, ఒక జేసీబీని వినియోగిస్తున్నారు. ప్రస్తుతం రాంకీ సంస్థ ఆధ్వర్యంలో నిమజ్జన ఘాట్ల వద్ద మళ్లీ చిన్న డస్ట్‌బిన్లు ఏర్పాటు చేస్తున్నారు. వాటి నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది.

మహిళల సౌలభ్యం కోసం..

-మంజుల, ఏఎంహెచ్‌వో

ప్రస్తుతం దసరా శరన్నవరాత్రుల సందర్భంగా బతుకమ్మ నిమజ్జనాల కోసం ఘాట్ల వద్దకు తరలివచ్చే మహిళల సౌలభ్యం కోసం రాంకీ సంస్థ ఆధ్వర్యంలో డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేశారు. నిత్యం వాటిని శుభ్రం చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ప్రతి ఒక్కరూ వ్యక్తిగతంగా శుభ్రతను పాటిస్తే స్వచ్ఛ హైదరాబాదు కల నెరవేరినట్టే.

మేమున్నాం.. మీకు తోడుగా..

మల్కాజిగిరి:80085 73378, అల్వాల్: 93911 06395
వినాయక్‌నగర్: 98498 60095, మౌలాలి: 80089 02818
గౌతంనగర్: 93475 56399 డిఫెన్స్‌కాలనీ: 84990 06641

మల్కాజిగిరి, డిఫెన్స్‌కాలనీ, అల్వాల్, న్యూస్‌టుడే:

? తూర్పు ఆనంద్‌బాగ్ డివిజన్ పీవీఎన్ కాలనీలో రహదారులను శుభ్రం చేసి చెత్తకుప్పలను సకాలంలో తొలగించడం లేదు.
– మంజరి, కాలనీవాసి

✓ మీ కాలనీలో సమస్యను పరిశీలించి చెత్తకుప్పలు తొలగించేలా చర్యలు తీసుకుంటాం.
– శ్రీనివాస్, పర్యవేక్షకుడు, సర్కిల్ పారిశుద్ధ్య విభాగం

? యాప్రాల్ కమ్మరిబస్తీ ప్రధాన మార్గంలో పలు వీధి దీపాలు వెలగడం లేదు. చీకటితో ఇబ్బంది పడుతున్నాం. – నర్మద, కమ్మరిబస్తి

✓ పరిశీలించి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటా.
–వెంకటేష్, వీధి దీపాల నిర్వహణ అధికారి

? మచ్చబొల్లారం కల్లుదుకాణం - రుక్మిణి ఎన్‌క్లేవ్ రహదారిలో వ్యర్థాలు పేరుకుపోయాయి. వర్షాలకు తడిసి దుర్వాసన వెలువడుతోంది.
– రాధిక, స్థానికురాలు

✓ కార్మికులను పంపించి చెత్తను తొలగించేలా చర్యలు తీసుకుంటా.
– ప్రభాకర్, పారిశుద్ధ్య అధికారి

ప్రశాంతంగా అమ్మవారి విగ్రహాల నిమజ్జనం


సఫిల్‌గూడ చెరువు వద్ద

నేరేడ్‌మెట్: శరన్నవరాత్రి ఉత్సవాల్లో పూజలందుకున్న అమ్మవారి విగ్రహాల నిమజ్జనం సఫిల్‌గుడ చెరువులో ఆది, సోమవారాల్లో ఘనంగా జరిగాయి. నేరేడ్‌మెట్, మల్కాజిగిరి పరిసర ప్రాంతాల్లోని మండపాల్లో నెలకొల్పిన విగ్రహాలను నిర్వాహకులు ఈ చెరువు వద్దకు తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులు చెరువు వద్ద భారీ క్రేన్ ఏర్పాటు చేశారు. విగ్రహాలను అక్కడ ఏర్పాటు చేసిన నీటి గుంతలో నిమజ్జనం చేశారు. ఈ ఏడాది పోలీసులు డీజేలకు అనుమతి ఇవ్వకపోవడంతో ఎవరూ వాటిని ఊరేగింపులో ఉపయోగించలేదు.

‘ప్రొ. సాయిబాబాను రాజ్యమే హత్య చేసింది’

ఆయన నివాసం వద్ద నినదించిన పౌరసంఘాల నాయకులు

మౌలాలి, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాను రాజ్యమే హత్య చేసిందంటూ పౌర సంఘాల నాయకులు, విరసం ప్రతినిధులు, ఆయన అభిమానులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మండిపడ్డారు. ఆయన మృతదేహం మౌలాలి జవహర్‌నగర్‌లోని నివాసం వద్దకు తీసుకొచ్చాక పౌర హక్కుల సంఘం నాయకులు, విప్లవ రచయితల సంఘం, ప్రజాసంఘాల, వివిధ పార్టీల నాయకులు, అభిమానులు భారీ సంఖ్యలో చేరుకొని కన్నీటి వీడ్కోలు పలికారు. జేఎన్‌యూ నుంచి ఓ విద్యార్థి బృందం వచ్చింది. వారంతా ప్రొ.సాయిబాబాకు ఘనంగా నివాళులర్పించారు. సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ఆయన చేసిన పోరాటాలను గుర్తు చేస్తూ కళాకారులు పలు గేయాలు ఆలపించారు. దీంతో ఆ ప్రాంతమంతా జోహార్ ప్రొఫెసర్ అంటూ నినాదాలతో మార్మోగింది. న్యాయస్థానం ఆయన్ని నిర్దోషిగా విడుదల చేయడానికి దశాబ్దకాలం పాటు శిక్షించిందని.. ఆ శిక్షే ఆయన జీవించే హక్కును రద్దు చేసిందంటూ గోడ పత్రికలు అంటించారు. అక్కడికొచ్చిన వారికి కరపత్రాలు అందజేశారు. రాజ్యహింసకు వ్యతిరేకంగా పోరాడాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు.


గీతాలు ఆలపిస్తున్న జేఎన్‌యూ విద్యార్థులు


సాయిబాబాకు నివాళి అర్పిస్తున్న గాంధీ వైద్యవిద్యార్థులు



అంతిమయాత్రలో అభిమానులు

బొల్లారం ఠాణా వద్ద భాజపా నేతల నిరసన


ఠాణా వద్ద మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

అల్వాల్, మల్కాజిగిరి:న్యూస్‌టుడే: హిందూ దేవాలయాలపై వరుసగా జరుగుతున్న దాడులను నిరసిస్తూ భాజపా నేతలు బొల్లారం ఠాణాలో నిరసన తెలిపారు. కార్పొరేటర్లు శ్రావణ్‌కుమార్, కొంతం దీపిక నాయకత్వంలో సోమవారం మూడు గంటల పాటు నిరసన తెలిపారు. దేవాలయాలపై దాడులను తీవ్రంగా ఖండించారు. వలసొచ్చిన రోహింగ్యాలే ఆలయాలపై ఒక పథకం ప్రకారం దాడులు చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే నిందితులను గుర్తించి శిక్షించాలన్నారు. అంతకుముందు ఆయా నేతలను సికింద్రాబాద్‌లో ఉద్రిక్తతకు కారణమైన ఓ ఆలయం వద్ద అరెస్టు చేసి ఇక్కడి ఠాణాకు తరలించారు. కార్యక్రమంలో స్థానిక భాజపా నేతలు మోయిసు జాత, పద్మిని, అజిత్ తదితరులు పాల్గొన్నారు. హిందూ దేవాలయాలపై దాడులను ఆపాలని.. లేనిపక్షంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసాన్ని ముట్టడిస్తామని వి.శ్రవణ్‌కుమార్ అన్నారు. మల్కాజిగిరిలో విలేకరులతో మాట్లాడారు.

అప్రమత్తంగా హైడ్రా


మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఎఫ్ బృందం

ఈనాడు డిజిటల్, హైదరాబాద్ : రానున్న మూడు రోజుల పాటు నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో హైడ్రా అప్రమత్తంగా ఉన్నట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో పరిస్థితిని డీఆర్‌ఎఫ్ బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. రాజ్‌భవన్ రోడ్డుతోపాటు వరద ముప్పు ఉన్న బేగంపేట, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో డీఆర్‌ఎఫ్ బృందాలు తనిఖీలు నిర్వహించారు.

లక్ష్మీ నృసింహస్వామి దేవాలయానికి శంకుస్థాపన


పూజలు చేస్తున్న వేద పండితులు

డిఫెన్స్‌కాలనీ, న్యూస్‌టుడే: సైనిక్‌పురి శృంగేరీ శంకరమఠం విజయ గణపతి ఆలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించబోయే లక్ష్మీ నృసింహస్వామివారి దేవాలయ శంకుస్థాపన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. కర్ణాటకలోని శృంగేరీ జగద్గురువులచే పూజించబడిన శంఖువుకు ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠాపన చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మాధికారి పండరీనాథ్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



గౌతంనగర్, న్యూస్‌టుడే: మల్కాజిగిరి పోలీసు స్టేషన్ పరిధి మౌలాలి భరత్‌నగర్‌లో ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. పోలీసుల కథనం ప్రకారం.. **గుండ్రొల్లు యాదగిరి (60),** లక్ష్మీభాయి భార్యాభర్తలు. భార్య ఇళ్లలో పనిచేస్తుంది. 9వ తేదీ ఉదయం లక్ష్మీభాయి పని చేసేందుకు వెళ్లింది. తిరిగి మధ్యాహ్నం 1 గంటకు ఇంటికి తిరిగి వచ్చే సరికి భర్త కనిపించలేదు. పలుచోట్ల గాలించినా యాదగిరి ఆచూకీ లభించకపోవడంతో మల్కాజిగిరి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేసింది.


అల్వాల్ ఐటీఐలో దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్ కలెక్టరేట్: ప్రభుత్వ ఐటీఐ అల్వాల్‌లో 2024-2025 అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌కి (ఏటీసీ) సంబంధించిన ప్రవేశాలకు ఆసక్తిగల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఐటీఐ కన్వీనర్ పి.శంకరయ్య కోరారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా హాజరై ప్రవేశం పొందాలని సూచించారు. ఇతర వివరాలకు 90596 85237, 98491 88346 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పోలీస్ డ్యూటీమీట్‌కు జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్

జీడిమెట్ల, న్యూస్‌టుడే: పోలీసు శాఖ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే పోలీస్ డ్యూటీ మీట్ కార్యక్రమానికి జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ ఎంపికయ్యారు. సోమవారం నుంచి ఈ నెల 19 వరకు తెలంగాణ పోలీస్ అకాడమీ లో నిర్వహిస్తున్నారు. ఇందులో పోలీసులు నేరాల పరిశోధనలో వ్యవహరించాల్సిన తీరు, ప్రజలతో ఎలా మెలగాలి అనే అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తారు. దీనికి సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌రేట్ నుంచి మల్లేశ్‌కు అవకాశం దక్కింది.

శిథిల భవనం.. విష సర్పాలకు నిలయం



మచ్చబొల్లారం-బటన్‌గూడ ప్రధాన రహదారిని ఆనుకొని మున్సిపల్ స్థలంలోని మహిళా భవన్ శిథిలావస్థకు చేరింది. ఒకప్పుడు స్థానిక మహిళా సమావేశాలు ఈ భవనంలో జరిగేవి. కొన్నాళ్లగా ఎవరూ పట్టించుకోకపోవడంతో నిర్వహణ కొరవడి శిథిలావస్థకు చేరుకుంది. తీగ మొక్కలు గదిని మొత్తం వ్యాపించడంతో పాములు, తేళ్లు తిరుగుతున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. తరచూ తమ ఇళ్లలోకి వస్తున్నాయని వాపోతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. –న్యూస్‌టుడే, అల్వాల్

సంక్షిప్త సమాచారం

వేంకటేశ్వరస్వామి ఆలయానికి అంకురార్పణ

బోడుప్పల్, న్యూస్‌టుడే: పర్వతాపూర్ సాయి ఐశ్వర్య కాలనీలో నిర్మించనున్న వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శంకుస్థాపన చేశారు. దేవనాథ జీయర్ స్వామి, డిప్యూటీ మేయర్ కుర్రశివకుమార్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, పవన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఐటీఐ కొత్త కోర్సుల్లో చేరేందుకు 19వరకూ అవకాశం

మేడ్చల్, న్యూస్‌టుడే: మేడ్చల్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో నూతనంగా ప్రవేశపెట్టిన కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 19వరకు అవకాశం కల్పించినట్లు, ప్రిన్సిపల్ ఎం. హనుమనాయక్ తెలిపారు.

అవినీతి నిర్మూలన అందరి బాధ్యత

ఉప్పల్, న్యూస్‌టుడే: అవినీతి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత కావాలని బెల్ జీఎం డా. విశ్వనాథం, ఏజీఎం ప్రకాష్‌రావు, విజిలెన్స్ అధికారి రూత్ బెక్కం పేర్కొన్నారు. దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక పురోగతికి అవినీతే ప్రధాన అవరోధంగా మారిందన్నారు. ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం బీహెచ్‌ఈఎల్(నాచారం) ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన కార్యక్రమం జరిగింది.

ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవల పరిశీలన

మేడ్చల్ కలెక్టరేట్: ఆరోగ్య కేంద్రాల్లో అమలు అవుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పరిశీలించేందుకు కేంద్ర ప్రతినిధుల బృందం జిల్లాకు వచ్చింది. కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి టి.రఘునాథస్వామి జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలను వివరించారు.

విద్యార్థులకు నైపుణ్యాలు అవసరం

గాంధీనగర్: చదువుతోపాటు నైపుణ్యాలనూ విద్యార్థులు పెంపొందించుకోవాలని కోనసీమ ద్రవిడ సంఘం ప్రతినిధులు వడ్లమాని బాలమణి, ఆదిభట్ల కామేశ్వరరావు కోరారు. గతేడాది ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలు సహా స్కాలర్‌షిప్‌లు, ధ్రువపత్రాలు ప్రదానం చేశారు.

కేజీకేఎస్ వార్షికోత్సవ సభ 18న

బాగ్‌లింగంపల్లి: కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్) 67వ వార్షికోత్సవ సభను ఈ నెల 18న సుందరయ్య కళానిలయంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ తెలిపారు. జీకేఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు.

ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కీసర, న్యూస్‌టుడే: ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ 108 కాల్ సెంటర్‌లో పని చేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ షేక్ జాన్ షాహిద్ తెలిపారు. ఇంటర్, డిగ్రీ చేసిన వారు అర్హులన్నారు. ఈనెల 15 నుంచి 19 వరకు మేడ్చల్ గుండ్లపోచంపల్లిలోని కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఆసక్తిగలవారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ పత్రాలు వెంట తీసుకొని రావాలన్నారు.

సనాతన ధర్మంపై అవగాహన అవసరం

నల్లకుంట, న్యూస్‌టుడే: సనాతన ధర్మంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖశర్మ కోరారు. సోమవారం నల్లకుంటలోని శంకరమఠంలో ‘సువర్ణ భారతీ మహోత్సవం’ అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రవచనాలు చెప్పారు. శృంగేరీ పీఠం విశిష్టత, జగద్గురు భారతీ తీర్థ మహాస్వామి వైభవం గురించి భక్తులకు వివరించారు. శృంగేరీ పీఠం, అహం బ్రహ్మాస్మీ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నిరుపయోగం.. ఆకాశ దీప స్తంభం



టెంపుల్‌అల్వాల్‌లోని వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపం వద్ద మూడు నెలల క్రితం ఆకాశ దీపాల ఏర్పాటుకు స్తంభం ఏర్పాటు చేశారు. దీపాలను అమర్చకపోవడంతో స్తంభం అలంకారప్రాయంగా మారింది. వెంటనే యంత్రాంగం కూడలిలో ఉన్న కల్యాణ మండపం నలువైపులా వెలుగు నిండేలా దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.
–న్యూస్‌టుడే, అల్వాల్

హరిత ప్రయాణ విధానం దేశమంతా అమలు కావాలి


జెండా ఊపి యాత్రను కొనసాగిస్తున్న గోపాలకృష్ణ తదితరులు

నిజాంపేట, న్యూస్‌టుడే: హరిత ప్రయాణ విధానం దేశమంతా అమలు కావాలని రాష్ట్ర ప్రభుత్వ ఆటోమోటివ్, ఈవీ డైరెక్టర్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. న్యూ గో సంస్థ ఆధ్వర్యంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 4 వేల కిలోమీటర్ల వరకు జరుగుతున్న బస్సు యాత్ర సోమవారం బాచుపల్లికి చేరింది. ఈ నెల 4న ప్రారంభమైన యాత్ర 19న కన్యాకుమారికి చేరుకుంటుంది. బాచుపల్లిలోని న్యూ గో డిపోకు చేరిన యాత్ర బస్సును గోపాలకృష్ణ జెండా ఊపి కొనసాగించారు.

పద్యనాటకాల పరిరక్షణ బాధ్యత అందరిది


కళాకారులతో ఎంకే రాము, లక్ష్మీనారాయణ

గాంధీనగర్: పౌరాణిక పద్య నాటకాలు తెలుగు భాషా సంపద అని సాహితీవేత్త ఎంకే రాము అన్నారు. ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో.. సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో పద్యనాటకోత్సవాలను ఆయన ముఖ్యఅతిథిగా ప్రారంభించి మాట్లాడారు. రోజురోజుకూ కనుమరుగవుతున్న నాటకాల పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిదీ అన్నారు. ఈ సందర్భంగా ద్వారక మయసభల ఘట్టాన్ని ప్రేక్షకరంజకంగా ప్రదర్శించారు. దుర్యోధనుడిగా ఎం. సాళ్వాచారి, శ్రీకృష్ణుడిగా టి.బాబురాజు, అర్జునుడిగా నారాయణస్వామిలు ప్రదర్శనను రక్తికట్టించారు. నిర్వహణ సంస్థ అధ్యక్షుడు లోకం కృష్ణయ్య, లంకా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బస్తీల్లో మత్తు చిచ్చు

ఇష్టారాజ్యంగా బెల్టుషాపుల్లో మద్యం విక్రయాలు


మచ్చబొల్లారం మద్యం దుకాణం సమీపంలో పడిపోయిన వ్యక్తి

అల్వాల్, న్యూస్‌టుడే: మధ్యతరగతి పేద వర్గాలకు నిలయమైన అల్వాల్ సర్కిల్ పరిధిలోని పలు బస్తీలు మత్తులో ఓలలాడుతున్నాయి. వీధుల్లో, రోడ్లపై పడిపోయే మందుబాబులు ఆయా ప్రాంతాల్లో సర్వసాధారణం. కొన్ని బస్తీల్లో ఉదయం పూటే మందుబాబులు రోడ్లపై పడిపోతున్న పరిస్థితి. ఇందుకు.. రోజంతా మద్యం అందుబాటులో ఉండటమే కారణమన్న విమర్శలు ఉన్నాయి. ప్రభుత్వ లైసెన్స్ పొందిన దుకాణాలు, బార్ల సంఖ్య ఐదేళ్లతో పోల్చితే రెండింతలయినా బస్తీల్లో గల్లీకో బెల్టు దుకాణం కొనసాగుతోంది. వాటికి అనుబంధంగా మరికొందరు కల్తీకల్లు, గంజాయి విక్రయాలు సాగిస్తున్నారని బస్తీల్లో పలువురు ఆవేదన చెందుతున్నారు. బస్తీలలోని పేద కుటుంబాల్లో మద్యం, కల్లు, గంజాయి చిచ్చు పెడుతున్నాయి. ప్రభుత్వ అనుమతి ఉన్న మద్యం దుకాణాలు సమయానికి మూసివేస్తున్నా.. ఇందిరానగర్, అంబేడ్కర్‌నగర్, తుర్కపల్లి, జొన్నబండ, కౌకూర్, గోపాల్‌నగర్, రాజీవ్‌నగర్ తదితర బస్తీల్లోని బెల్టు దుకాణాల్లో వేకువజాము వరకు విక్రయాలు సాగుతున్నాయి.

శాంతి భద్రతలకు విఘాతం.. బెల్టు దుకాణాల్లో దాదాపు తెల్లవార్లు విక్రయాలు కొనసాగుతుండటంతో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతోంది. మందుబాబులు దుకాణం సమీపంలోనే కూర్చుని గొడవలు పడుతున్నారు. ఇటీవల మద్యం మత్తులో అర్ధరాత్రి వేణుగోపాల్‌రెడ్డి కాలనీలో నేతలపై హత్యాయత్నం జరిగిన విషయం తెలిసిందే. తుర్కపల్లి, మచ్చబొల్లారం, హస్మత్‌పేటలో తరచూ ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో పాటు పలువురు మత్తులో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

సోదాలు లేకపోవడంతో.. ఒకప్పుడు ముమ్మరంగా దాడులు నిర్వహిస్తూ అక్రమ అమ్మకాలపై ఎక్సైజ్ సిబ్బంది ఉక్కుపాదం మోపుతూ పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకునే వారు. ఇటీవల అలాంటి సోదాలే కరవయ్యాయి. గాంధీ జయంతి రోజున ఇక్కడి పలు బస్తీల్లో మద్యం విక్రయాలు కొనసాగాయి. నిషేధం నిబంధన ఉన్నా వినాయక నిమజ్జనం, బోనాల ఉత్సవాల రోజున సైతం బహిరంగంగానే విక్రయాలు చేశారు. ముందురోజే మద్యం నిల్వ ఉంచుకుని అధిక ధరలకు ఆయా రోజుల్లో అమ్మకాలు నిర్వహించారు. ఈ వ్యవహారంపై తుర్కపల్లి, సుభాష్‌నగర్‌లో మహిళలు నిరసన తెలిపినా అధికారులు స్పందించలేదనే ఆరోపణలున్నాయి. మద్యపాన నిషేధ ప్రచార కమిటీలను ఏర్పాటు చేయాల్సి ఉండగా.. ఆ మాట ఎత్తేవారు లేరు.

ముషీరాబాద్

● ముషీరాబాద్ ● అంబర్‌పేట

పద్యనాటకాల పరిరక్షణ బాధ్యత అందరిది



కళాకారులతో ఎంకే రాము, లక్ష్మీనారాయణ, కృష్ణయ్య

గాంధీనగర్: పౌరాణిక పద్యనాటకాలు తెలుగు భాషా సంపద అని సాహితీవేత్త ఎంకే రాము అన్నారు. ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో.. సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో పద్యనాటకోత్సవాలను ఆయన ముఖ్యఅతిథిగా ప్రారంభించి మాట్లాడారు. రోజురోజుకూ కనుమరుగవుతున్న నాటకాల పరిరక్షణ బాధ్యత ప్రతిఒక్కరిదీ అన్నారు. ఈ సందర్భంగా ద్వారక మయసభల ఘట్టాన్ని ప్రేక్షకరంజకంగా ప్రదర్శించారు. దుర్యోధనుడిగా ఎం.సాళ్వాచారి, శ్రీకృష్ణుడిగా టి.బాబురాజు, అర్జునుడిగా నారాయణస్వామిలు ప్రదర్శనను రక్తికట్టించారు. నిర్వహణ సంస్థ అధ్యక్షుడు లోకం కృష్ణయ్య, ప్రముఖులు లంకా లక్ష్మీనారాయణ, వీరభోగ వసంతరాయలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలూ పెంపొందించుకోవాలి



విద్యార్థులతో కోనసీమ ద్రవిడ సంఘం ప్రతినిధులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: చదువుతోపాటు నైపుణ్యాలనూ విద్యార్థులు పెంపొందించుకోవాలని కోనసీమ ద్రవిడ సంఘం ప్రతినిధులు వడ్లమాని బాలమణి, ఆదిభట్ల కామేశ్వరరావు కోరారు. విజయదశమిని పురస్కరించుకుని సంఘం ఆధ్వర్యంలో.. గతేడాది ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలు సహా స్కాలర్‌షిప్‌లు, ధ్రువపత్రాలను ప్రదానం చేసి మాట్లాడారు. సంఘం ప్రతినిధులు బండి శ్రీనివాస్, కందాల భాస్కర రామచంద్ర, మంతా నరసింహశాస్త్రి, దక్షిణామూర్తి, అనంతలక్ష్మి, త్రిమూర్తి, డీఎల్‌వీ సత్యనారాయణ, కర్ర లక్ష్మీనారాయణ, భీమశంకరం పాల్గొన్నారు.

‘ఎన్నికల హామీలు అమలు చేయాలి’

బాగ్‌లింగంపల్లి: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరుతూ భారాసతో కలిసి పోరాటాలను చేపడతామని ధర్మసేన ఫౌండేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు దినకర్ తెలిపారు. సోమవారం ఆయన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవెల్లిలోని ఫాంహౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలో దినకర్ మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ పక్షాన అందిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను కేసీఆర్ అభినందించారని తెలిపారు.

గోల్నాక మార్కెట్‌లో కూరగాయల ధరలు

తిలక్‌నగర్, న్యూస్‌టుడే: (సోమవారం నాటివి... కిలోకు రూపాయల్లో) టమాట-50, ఆలుగడ్డ-45, వంకాయ-50, బెండ-70, దొండ-50, దోసకాయ-40, కాకర-70, బీర-70, సొర-30, క్యాబేజి-35, క్యాప్సికం-60, బీన్స్-90, చిక్కుడు-70, క్యారెట్-45, బీట్‌రూట్-40, ఉల్లిగడ్డ-50, పచ్చిమిర్చి-40, వెల్లుల్లి-350, అల్లం-80.

తిరుగు పయనం.. అవస్థలమయం

సొంతూళ్ల నుంచి నగరానికి రావడానికి ప్రజల అగచాట్లు

కిటకిటలాడుతున్న రైళ్లు, బస్సులు



కాచిగూడ స్టేషన్‌లో రైలు దిగిన ప్రయాణికులు

కాచిగూడ, న్యూస్‌టుడే: దసరా పర్వదినానికి సెలవుల్లో కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి సొంతూళ్లకు వెళ్లిన నగరవాసులు తిరిగి రావడానికి ఇబ్బంది పడుతున్నారు. విజయదశమిని కుటుంబసభ్యులతో కలిసి జరుపుకోవాలని భావించి చాలామంది ప్రజలు.. తెలుగు రాష్ట్రాల్లోని తమ స్వస్థలాలకు బయలుదేరి వెళ్లారు. పండగ ముగియడంతో ప్రస్తుతం అక్కడి నుంచి వచ్చేందుకు సరిపడా రైళ్లు, బస్సులు అందుబాటులో లేకపోవడంతో తిరుగు పయనానికి అవస్థలు పడుతున్నారు. నగరానికి తిరిగి వస్తున్న అన్ని రైళ్లలోనూ నిరీక్షణ జాబితాలు దర్శనమిస్తున్నాయి. విద్యా సంస్థలు మంగళవారం నుంచి ప్రారంభమవుతున్న నేపథ్యంలో.. ఆదివారం నుంచే నగరవాసుల రాక మొదలైంది.

రైళ్లలో దొరకని టికెట్లు

కాచిగూడ స్టేషన్‌కు తిరిగి వస్తున్న అన్ని రైళ్లలోనూ టికెట్లు దొరకని పరిస్థితి నెలకొంది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలు, పట్టణాల మీదుగా వచ్చే అన్ని ఎక్స్‌ప్రెస్‌లలో వెయిటింగ్ లిస్ట్‌లు ఉండటంతో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా విశాఖ, చెన్నై చెంగల్పట్టు, వెంకటాద్రి, మైసూర్, యెలహంకతో పాటు ఇతర రైళ్లలో ప్రయాణించి కాచిగూడకు చేరుకుంటున్నారు. ఇలా తిరిగి వచ్చే ప్రయాణికులతో ప్రతి రోజూ ఉదయం స్టేషన్‌లోని ప్లాట్‌ఫాంలు కిటకిటలాడుతున్నాయి. దక్షిణాది, ఉత్తరాది రాష్ట్రాల నుంచి కాచిగూడ స్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే అన్ని రైళ్లూ రద్దీగానే కనిపిస్తున్నాయి.

రోజుకు పది బస్సులే

నగరవాసుల డిమాండ్‌కు అనుగుణంగా ఆర్టీసీ కాచిగూడ బస్ డిపో నుంచి దసరా పండగకు ఎంజీబీఎస్ నుంచి జడ్చర్ల, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, ఆలంపూర్, కర్నూలు, ఖమ్మం, సూర్యాపేట, కోదాడ, విజయవాడకు ప్రతిరోజూ 20 నుంచి 30 బస్సులు వెళ్లాయి. ప్రస్తుతం తిరిగి రావడానికి ఆదివారం, సోమవారం 10 చొప్పున ఆర్టీసీ బస్సులు అచ్చంపేటకు వెళ్లాయి. దీంతో సంబంధిత బస్సులన్నీ ప్రయాణికులతో కిటకిటలాడుతూ నగరానికి వస్తున్నాయి.

రాంనగర్ న్యూస్‌టుడే:

? రాంనగర్ డివిజన్ బాకారం పద్మశాలి సంఘం ఎదుట మూడు రోజులుగా డ్రైనేజీ మ్యాన్‌హోల్ పొంగిపొర్లుతోంది. అపరిశుభ్రత, దుర్గంధంతో తీవ్ర అవస్థలు పడుతున్నాం. -లింగం, బాకారం

✓ సమస్య మా దృష్టికి వచ్చింది. సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయిస్తాం. -మోహన్‌రాజ్, డీజీఎం చిలకలగూడ జలమండలి

కేజీకేఎస్ వార్షికోత్సవ సభ 18న

బాగ్‌లింగంపల్లి: కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్) 67వ వార్షికోత్సవ సభను ఈ నెల 18న సుందరయ్య కళానిలయంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ తెలిపారు. సోమవారమిక్కడ కేజీకేఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్లుగీత వృత్తిలో ఉపాధి అవకాశాలు అనే అంశంపై ప్రధానంగా చర్చిస్తామన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, బీసీ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు హాజరవుతున్నట్లు తెలిపారు. కేజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, నేతలు వెంకటనరసయ్య, కృష్ణస్వామి, లింగంగౌడ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

నవరాత్రులు పూజించి.. ఘనంగా వీడ్కోలు పలికి



చాదర్‌ఘాట్‌లో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తదితరులు



శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, జైసింహ తదితరులు



దుర్గామాతను దర్శించుకున్న తొలుపునూరి కృష్ణాగౌడ్, చందు పటేల్, శ్రీమంత్‌గిరి

ముషీరాబాద్, కాచిగూడ, అంబర్‌పేట, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల పరిధిలో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాల నిమజ్జనోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ముషీరాబాద్ డివిజన్ గంగపుత్రకాలనీలో ఓం గంగాభవాని సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత విగ్రహాన్ని నిర్వాహకులు సోమవారం రాత్రి నిమజ్జనానికి తరలించారు. ఈ క్రమంలో నిర్వహించిన శోభాయాత్ర గంగపుత్రకాలనీ, పార్శిగుట్ట చౌరస్తా, రాంనగర్ కూడలి మీదుగా హుస్సేన్‌సాగర్ తీరం వరకు కొనసాగింది. తొలుత నిర్వాహకులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేయగా.. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్, భారాస నేత జైసింహలు ఊరేగింపును ప్రారంభించారు. నిర్వాహకులు అశోక్‌కుమార్, గోవింద్, బాబురావు, చందు, బిజ్జి రవి, టి.సోమసుందరం, గోరక్‌నాథ్, శ్రీకాంత్, టీఆర్.గోవింద్, కృష్ణచారి పాల్గొన్నారు. అంతకుముందు అమ్మవారి చీర, ముక్కుపుడకలకు వేలం వేయగా.. చీరను రూ.50 వేలకు వానపల్లి మధు, ముక్కుపుడకను రూ.48 వేలకు నిక్కి దక్కించుకున్నారు. నవరాత్రులపాటు అమ్మవారికి కప్పి పూజలు చేసిన ప్రత్యేక వస్త్రాన్ని రూ.28 వేలకు స్వాతి కుడు బిజ్జి రవి సొంతం చేసుకున్నారు. ★ ముషీరాబాద్ డివిజన్ కమలానెహ్రూనగర్‌లో ప్రజా సంక్షేమ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనానికి శామీర్‌పేట చెరువుకు తరలించారు. నిర్వాహకులు అరుణ్, శ్రీనివాస్, శ్రీకాంత్, శ్రీను, అరుణ్, సంతోష్ పాల్గొన్నారు.

నేతలకు దసరా శుభాకాంక్షలు



భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేక్, కాలేరు వెంకటేష్



అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్‌ను సన్మానించిన నేతలు లవంగు ఆంజనేయులు, భారాస మైనార్టీ నేతలు

దేశంలో చూపుకోల్పోతున్న వారి సంఖ్య పెరుగుతోంది: తీన్మార్ మల్లన్న

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: దేశంలో చూపు కోల్పోతున్నవారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందని శాసనమండలి సభ్యుడు తీన్మార్ మల్లన్న అన్నారు. కాబట్టి ఈ రంగంలో కృషి, సేవ చేసేవారి బాధ్యత కూడా పెరుగుతుందన్నారు. సోమవారం రవీంద్రభారతిలో ‘ఇట్రాప్ (ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రైనింగ్ రీసెర్చ్ రిహాబిలిటేషన్ ఆఫ్ డిసెబుల్డ్ డిస్‌ట్రెస్డ్ అండ్ డిస్‌హెరిటెడ్ చిల్డ్రన్) 29వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. మళ్లీ జన్మ లేదు.. పోయేటప్పుడు కట్టుకుపోయేది లేదు. కాబట్టి బతికున్నంత కాలం చరిత్రలో నిలిచిపోయేలా సేవ చేద్దామన్నారు. కేంద్రంలో అంధుడిని మంత్రిగా, అలాగే అంధుడిని అర్చకుడుగా చూడాలని ఉందన్నారు. చిలుకూరు బాలాజీ ప్రధానార్చకులు సీఎస్ రంగరాజన్ మాట్లాడుతూ.. ప్రజల్లో భక్తితో పాటు సామాజిక స్పృహను కూడా పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, ఎంఎల్ఆర్ విద్యా సంస్థల అధినేత మర్రి లక్ష్మణ్‌రెడ్డి, చిలుకూరు బాలాజీ ప్రధాన సేవకుడు పవన్‌కుమార్, సామాజిక కార్యకర్త కె.మాలతీ శ్రీనివాస్‌లు మాట్లాడారు. ముందుగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

సనాతన ధర్మంపై అవగాహన అవసరం



ప్రవచనాలు చెబుతున్న సామవేదం షణ్ముఖ శర్మ

నల్లకుంట, న్యూస్‌టుడే: సనాతన ధర్మంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖ శర్మ కోరారు. సోమవారం నల్లకుంటలోని శంకరమఠంలో ‘సువర్ణ భారతీ మహోత్సవం’ అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రవచనాలు చెప్పారు. శృంగేరీ పీఠం విశిష్టత, జగద్గురు భారతీ తీర్థ మహాస్వామి వైభవం గురించి భక్తులకు వివరించారు. శృంగేరీ పీఠం, ఆగమ బ్రాహ్మణ ఫౌండేషన్ ప్రతినిధులు ప్రవీణ్‌కులకర్ణి, గీతామూర్తి, మరుమాముల వెంకటరమణశర్మ, శంకరమఠం ప్రధానాధికారి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా హైడ్రా

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: రానున్న మూడు రోజుల పాటు నగరంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో హైడ్రా అప్రమత్తంగా ఉన్నట్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. వరద ముప్పు ఉన్న ప్రాంతాల్లో పరిస్థితిని డీఆర్ఎఫ్ బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. రాజ్‌భవన్ రోడ్డుతోపాటు వరద ముప్పు ఉన్న బేగంపేట, ప్రకాష్‌నగర్ ప్రాంతాల్లో డీఆర్ఎఫ్ బృందాలు తనిఖీలు నిర్వహించారు.

ఆధ్యాత్మికచింతనతో మానసిక ప్రశాంతత



అమ్మవారి సన్నిధిలో సాయి తదితరులు

గాంధీనగర్: ఆధ్యాత్మికచింతన ద్వారా మానసిక ప్రశాంతత చేకూరుతుందని సినీ నటుడు సాయి(‘గబ్బర్‌సింగ్’ ఫేం) అన్నారు. దేవీ శరన్నవరాత్రులు ముగిసిన నేపథ్యంలో.. సోమవారం రాత్రి చిక్కడపల్లిలోని కట్టమైసమ్మ దేవాలయంలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ కె.శ్యామ్, శివ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాతపుస్తకాల పంపిణీ నేడు

అంబర్‌పేట: అంబర్‌పేట సీపీఎల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.. ఈ నెల 15న రాతపుస్తకాలను పంపిణీ చేస్తారని భాజపా డివిజన్ అధ్యక్షుడు నాగభూషణంచారి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు భారత్ సేవాశ్రమ్ సంఘ్ ఆధ్వర్యంలో సంబంధిత కార్యక్రమం జరుగుతుందని వివరించారు.

మార్గం.. కంకర తేలి అధ్వానం



ఇందిరా పార్కు నుంచి రామకృష్ణ మఠానికి వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పోటెత్తిన వరదనీటితో పలుచోట్ల రోడ్డు కొట్టుకుపోవడంతో కంకర తేలి ప్రమాదకరంగా మారింది. నిత్యం ఇటుగా వందల సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. సంబంధిత అధికారులు తక్షణం స్పందించి మరమ్మతులు చేపట్టాలని వారంతా కోరుతున్నారు.

ప్రయాణం.. ప్రమాదకరం



ముషీరాబాద్ నియోజకవర్గంలోని రోడ్లు వాహనాల రాకపోకలతో నిత్యం రద్దీగా ఉంటాయి. కట్టెలను తరలిస్తున్న ఓ ట్రాలీ వాహనంపై ఏడుగురు యువకులు ఇలా ప్రయాణించారు. ఏ మాత్రం పట్టుతప్పినా ప్రమాదంబారిన పడే అవకాశం ఉన్నా.. వారు పట్టించుకోలేదు. సోమవారం మధ్యాహ్నం వేళ బాగ్‌లింగంపల్లి వద్ద ఈ దృశ్యం కనిపించింది.

ప్రయాణికుల రక్షణకు ఆర్పీఎఫ్ కృషి

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: ప్రయాణికుల భద్రతకు ఆర్పీఎఫ్ పోలీసులు కృషి చేస్తున్నారని సికింద్రాబాద్ డివిజనల్ సీనియర్ సెక్యూరిటీ కమిషనర్ దేబాష్మితా ఛటోపాధ్యాయ బెనర్జీ ఓ ప్రకటనలో తెలిపారు. ఆపరేషన్ జీవన్ రక్షలో భాగంగా రైల్వేస్టేషన్లలో తమ సిబ్బంది అప్రమత్తంగా ఉండటమే కాకుండా ఆపదలో ఉన్న ప్రయాణికులను రక్షిస్తున్నారని పేర్కొన్నారు. 2023లో ఆరుగురిని, 2024లో నలుగురు ప్రయాణికుల ప్రాణాలను ఆర్పీఎఫ్ సిబ్బంది కాపాడినట్లు తెలియజేశారు. లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ పి.రాజశేఖర్, కానిస్టేబుల్ విశ్వజిత్‌కుమార్‌లు ఈ నెల 13వ తేదీన లింగంపల్లి రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంపై విధులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్-పూర్ణ ఎక్స్‌ప్రెస్ రైలు లింగంపల్లి రైల్వేస్టేషన్‌లోని 1న నంబర్ ప్లాట్‌ఫాంకు చేరుకొని.. తిరిగి బయలుదేరే సమయంలో కదులుతున్న రైల్లో ఎక్కేందుకు ఓ మహిళా ప్రయత్నించింది. మెట్లమీద నుంచి కాలు జారడంతో కిందపడుతుండగా.. గుర్తించిన కానిస్టేబుళ్లు బయటకు లాగారు. దీంతో ఆమెకు ప్రమాదం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న సెక్యూరిటీ కమిషనర్ కానిస్టేబుళ్లతో మాట్లాడి అభినందించారు.

ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి అదృశ్యం

కాచిగూడ, న్యూస్‌టుడే: ఇంటి నుంచి బయటికెళ్లిన వ్యక్తి కనిపించకుండాపోయిన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్, అడ్మిన్ ఎస్సై సుభాష్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. చప్పల్‌బజార్ ప్రాంతానికి చెందిన ఓంప్రకాష్(57) ఈ నెల 11వ తేదీన ఉదయం ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. అనంతరం తిరిగిరాకపోవడంతో పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. సోమవారం బాధితుడి భార్య సృజన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

మానవతావాది అంబేడ్కర్

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: డా. బీఆర్ అంబేడ్కర్ బౌద్ధ దమ్మ దీక్ష పరివర్తన దివస్ సందర్భంగా దళిత బహుజన పార్టీ (డీబీపీ) అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ. . కరుణ, ప్రేమ,స్వేచ్ఛ, సమానత్వం, మానవీయతకు పునాది అయిన బౌద్ధ ధర్మంను అంబేడ్కర్ స్వీకరించారని, ఆయన చూపిన మార్గంలో పయనించడమే దళిత బహుజన జాతులకు తాత్విక విముక్తి అన్నారు. ఇటికాల గణేష్. రోజాలీల, అశోక్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనదారుడు

నారాయణగూడ, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి అదుపుతప్పి ఎన్టీఆర్ మార్గ్‌లో డివైడర్‌ను ఢీ కొట్టిన సంఘటన ఇది. సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనలో ద్విచక్ర వాహనదారుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికంగా ఉన్న కొందరు 108కు సమాచారాన్ని అందించగా సకాలంలో చేరుకున్న వైద్య సిబ్బంది క్షతగాత్రుడికి చికిత్సను అందించారు. సంఘటనా స్థలికి చేరుకున్న సైఫాబాద్ పెట్రో కార్ పోలీసులు క్షతగాత్రునికి సంబంధించిన వివరాలు కనుక్కునే ప్రయత్నం చేయగా అతను మద్యం మత్తులో ఉన్నాడని గమనించారు. తన పేరు రవి అని, కేపీహెచ్‌పీ కాలనీలో ఉంటానని చెప్పినట్లు పోలీసులు తెలిపారు.

పడకేసిన పారిశుద్ధ్యం.. దుర్గంధంతో సతమతం

ముషీరాబాద్, న్యూస్‌టుడే: ముషీరాబాద్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల పక్కన చెత్తచెదారం పేరుకుపోయి పరిసరాలు అధ్వానంగా మారాయి. దసరా పర్వదినానికి తోడు వరుస సెలవులూ రావడంతో పారిశుద్ధ్యం పడకేసింది. ప్రస్తుతం ఎక్కడ చూసినా కుప్పలుగా వ్యర్థాలు కనిపిస్తుండడంతో.. అపరిశుభ్రత రాజ్యమేలుతోంది. వాటి నుంచి తీవ్ర దుర్గంధం వెలువడుతుండడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఈ విషయమై ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారే కరవయ్యారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పర్యవేక్షణ లేక ఇష్టానుసారంగా..

స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల పర్యవేక్షణలోపం కారణంగానే బస్తీలు, కాలనీల్లో అపరిశుభ్రత నెలకొంటోంది. ముషీరాబాద్ డివిజన్ గంగపుత్రకాలనీ, పార్శిగుట్ట చౌరస్తా సమీపంలోని హిందూ శ్మశానవాటికల వద్ద రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారం పేరుకుపోయింది. సాగర్‌లాల్ ఆసుపత్రి సమీపంలో, వీఎస్టీ రోడ్డు, రాంనగర్ బ్రిడ్జి, భోలక్‌పూర్ ఇందిరానగర్, దేవునితోట వెనుక ప్రాంతం, గాంధీనగర్ జనప్రియ అపార్టుమెంట్ వెనుకభాగంలోని రోడ్డు తదితర ప్రాంతాల్లోనూ వ్యర్థాల కుప్పలు భారీగా దర్శనమిస్తున్నాయి. చెత్త సేకరణను సక్రమంగా చేపట్టకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని అక్కడి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాతావరణంలో మార్పులతో జలుబు, దగ్గు తదితర రుగ్మతలతో ఇబ్బందులు పడుతుండగా.. అపరిశుభ్రత వల్ల దోమలూ విజృంభిస్తున్నాయన్నారు. విషజ్వరాలు ప్రబలకముందే సంబంధిత అధికారులు స్పందించి.. చెత్తాచెదారాన్ని తరలించాలని కోరుతున్నారు.



గంగపుత్రకాలనీలో రోడ్డు పక్కన చెత్తాచెదారం



పార్శిగుట్ట చౌరస్తాలో వ్యర్థాలు

తక్షణం దృష్టి సారిస్తాం..

-డా.ప్రవీణ ఏఎంవోహెచ్, జీహెచ్ఎంసీ సర్కిల్-15

దసరా పండగ, వరుస సెలవుల కారణంగా సిబ్బంది సొంత ఊర్లకు వెళ్లడంతో వ్యర్థాల తరలింపులో తీవ్ర జాప్యం నెలకొంది. ఆయా ప్రాంతాల్లో పేరుకుపోయిన చెత్తచెదారాన్ని వెంటనే తొలగించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.



న్యూనల్లకుంట మదర్ డెయిరీ పార్కు వద్ద..

నాలుగైదు రోజులుగా నిలచిన తరలింపు

నల్లకుంట, న్యూస్‌టుడే: అంబర్‌పేట నియోజకవర్గం పరిధిలోని నల్లకుంట డివిజన్‌లోనూ పలుచోట్ల చెత్తాచెదారం పేరుకుపోయింది. వాటి తరలింపు నాలుగైదు రోజులుగా నిలిచిపోవడంతో.. స్థానికంగా పరిసరాలన్నీ అపరిశుభ్రంగా మారాయి. డివిజన్‌లోని తిలక్‌నగర్ బ్రిడ్జి, గోల్నాక కల్లు కాంపౌండ్, చర్చి లేన్, న్యూనల్లకుంట రైల్వే బ్రిడ్జి, మదర్ డెయిరీ పార్కు తదితర ప్రాంతాల్లో వ్యర్థాలు కుప్పలుగా పేరుకుపోయాయి. వాటిని సత్వరం తొలగించాలని అధికారులను ఆయాప్రాంతాల నివాసితులు కోరుతున్నారు.

విద్యుత్తు నియంత్రికలు.. కరవైన రక్షణ ఏర్పాట్లు



రోడ్డుపైకి వచ్చిన గంగబౌలిలోని ట్రాన్స్‌ఫార్మర్ తీగలు



సీఈ కాలనీలోని మీ-సేవా వద్ద..

విద్యానగర్, న్యూస్‌టుడే: బాగ్‌అంబర్‌పేట డివిజన్ పరిధిలో పలుచోట్ల రహదారులను ఆనుకుని ఉన్న విద్యుత్తు నియంత్రికలు నిర్వహణలేమితో ప్రమాదాలకు నిలయంగా మారాయి. వాటి చుట్టూ కనీస రక్షణ ఏర్పాట్లు చేపట్టకపోవడంతో..నిత్యం అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. ప్రాణాలకు ముప్పు పొంచి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎప్పటికప్పుడు విద్యుత్తు శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా స్పందన కరవైందని ఆరోపిస్తున్నారు. సీఈ కాలనీలోని మీ-సేవా కేంద్రం పక్కన ఉన్న కరెంటు ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ చెత్తాచెదారం, ఇతరత్రా వ్యర్థాలు పేరుకుపోవడంతో పాటు పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. గంగాబౌలి ప్రాంతంలో జనావాసాల మధ్య ఉన్న నియంత్రిక తీగలు రోడ్డుపైకి వచ్చి ప్రమాదకరంగా మారాయి. రోజులు గడుస్తున్నా సమస్యల పరిష్కారంపై అధికారులు దృష్టిసారించడంలేదంటూ ప్రజలు ఆవేదన చెందుతున్నారు. బాగ్ అంబర్‌పేట పరిధిలోని రోడ్లు అసలే ఇరుకుగా ఉంటాయని, వాటికి సమీపంలో ప్రమాదాలకు తావిచ్చేలా ఉన్న నియంత్రికల వల్ల నిత్యం బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగించాల్సి వస్తోందన్నారు. తక్షణం ఉన్నతాధికారులు స్పందించాలని వేడుకుంటున్నారు.

ఉప్పల్

•ఉప్పల్ •మేడ్చల్

మేమున్నాం.. మీకు తోడుగా..

ఉ. 10 నుంచి మ.1 గంట వరకు

(8008573370 ఉప్పల్) (80085 73372 కాప్రా), (80085 73288 బోడుప్పల్), (98485 99881 ఘట్‌కేసర్), (80960 04937 నాచారం).

న్యూస్‌టుడే-మేడ్చల్,ఏఎస్‌రావునగర్, కాప్రా, హబ్సిగూడ, కీసర, మేడ్చల్,బోడుప్పల్

? కెప్టోస్టు నుంచి శామీర్‌పేట వెళ్లేదారి ఏక్ మినార్ సమీపంలోని రోడ్డు మలుపువద్ద ప్రమాదాలు జరుగుతున్నాయి, సూచికలు ఏర్పాటు చేయగలరు.

-ఇస్మాయిల్, మేడ్చల్.

✓ సూచికలు ఏర్పాటు చేస్తాం.

-హనుమాన్‌గౌడ్, సీఐ మేడ్చల్ ట్రాఫిక్.

? పద్మశాలి టౌన్‌షిప్‌లో పట్టపగలే విద్యుత్ దీపాలు వెలుగుతున్నాయి.

- నరసింహులు, పద్మశాలి టౌన్‌షిప్

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం

-కాప్రా సర్కిల్ డీఈ రవీందర్

? సిబ్బంది వీధులను శుభ్రం చేయడం లేదు. ఎక్కడి చెత్త అక్కడే ఉంటోంది.

- శ్యామ్ సుందర్‌రాజ్, భాగ్యనగర్

✓ మెరుగైన పారిశుద్ధ్య పనుల నిర్వహణకు చర్యలు తీసుకుంటాం.

- సుదర్శన్, పారిశుద్ధ్య పర్యవేక్షణాధికారి

? వాసవీశివానగర్‌లో మంచినీటి సరఫరా సరిగా జరగడం లేదు. మేనేజర్‌కు స్పందించడం లేదు. - చంద్రశేఖర్, వాసవీశివానగర్

✓ మెరుగైన నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటాం.

- సతీష్, డీజీఎం, జలమండలి

? హబ్సిగూడ డివిజన్ రవీంద్రనగర్‌లో మ్యాన్‌హోల్ నుంచి మురుగు పారి రాకపోక లకు ఇబ్బందిగా మారింది.

-మహేష్, రవీంద్రనగర్

✓ సిబ్బందిని పంపించి మురుగు నివారణ చర్యలు తీసుకుంటాం.

-రజనీకాంత్‌రెడ్డి, జలమండలి అధికారి

? కీసరలో ప్రధాన రోడ్డు నుంచి మల్లికార్జున నగర్‌కాలనీలోకి వెళ్లే రోడ్డులో మురుగు రోడ్డుపై వస్తోంది. దుర్వాసనతో ఇబ్బందిగా ఉంది.

- శ్రీనివాస్, మల్లికార్జుననగర్‌కాలనీ కీసర

✓ సిబ్బందితో కాలువలో పేరుక పోయిన చెత్త తొలగించి మురుగు రోడ్డుపై రాకుండా చర్యలు తీసుకుంటాం.

- మహేందర్, శానిటేషన్ ఇన్‌ఛార్జి కీసర

? పర్వతాపూర్-మేడిపల్లి రోడ్డులో ఏర్పడిన గోతులు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వాటిని పూడ్చి ప్రమాదాలను నివారించాలి.

-నారాయణాచార్య, పంచవటికాలనీ, మేడిపల్లి.

✓ గోతులను పూడ్చివేసి ప్రమాదాలను నివారిస్తాం. -శ్రీనివాస్‌రెడ్డి, ఆర్వో, పీర్జాదిగూడ నగర పాలక సంస్థ.

? గుండ్లపోచంపల్లి నుంచి మైసమ్మగూడ వెళ్లదారిలో సీసీరోడ్డు వేశారు. మ్యాన్‌హోల్ పైకిలేపకుండా వదిలేయడంతో ప్రమాదక రంగా మారాయి.

- బాల్‌రాజ్, గుండ్లపోచంపల్లి.

✓ పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం.

-స్వామి, కమిషనర్ గుండ్లపోచంపల్లి

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం



ప్రాంతాలను పరిశీలిస్తున్న డీసీపీ, ఏసీపీ తదితరులు

నాచారం, న్యూస్‌టుడే: ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించడం ద్వారానే రోడ్డు ప్రమాదాలను శాశ్వతంగా నివారించవచ్చని రాచకొండ క్రైమ్ డీసీపీ అరవింద్ బాబు తెలిపారు. సోమవారం నాచారంలోని హెచ్‌ఎంటీ నగర్ చౌరస్తాలో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను పోలీస్, ట్రాఫిక్ అధికారులతో కలిసి సందర్శించారు. పాదచారుల ఆక్రమణ, ట్రాఫిక్ సిగ్నల్స్ మార్కింగ్, యూటర్న్, ఫ్రీ లెఫ్ట్, డివైడర్ల ఏర్పాటుపై స్థానికుల అభిప్రాయాలు సేకరించారు.

వెంకటేశ్వరస్వామి ఆలయానికి అంకురార్పణ



కార్యక్రమంలో ఎంపీ ఈటల, ఇతరులు

బోడుప్పల్: పర్వతాపూర్ సాయి ఐశ్వర్య కాలనీలో నిర్మించనున్న వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ శంకుస్థాపన చేశారు. దేవనాద జీయర్ స్వామి, డిప్యూటీ మేయర్ కుర్రశివకుమార్‌గౌడ్, సుదర్శన్‌రెడ్డి, పవన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

హారేరామ.. హారేకృష్ణ..!



భగవద్గీత పుస్తకాన్ని ఇస్తున్న వేదిక కమిటీ ప్రతినిధులు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్ ప్రధానవీధుల్లో సోమవారం హరే రామ.. హరే కృష్ణ నామస్మరణతో మార్మోగింది. ద్వైత సిద్ధాంత ప్రచార సేవాసమితి ఆధ్వర్యంలో వేదిక ఇంటింటికి భగవద్గీతలను పంపిణీ చేశారు.

అల్వాల్ ఐటీఐలో దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్ కలెక్టరేట్: ప్రభుత్వ ఐటీఐ అల్వాల్‌లో 2024-2025 అప్రెంటిస్ ట్రైనింగ్ సెంటర్ (ఏటీసీ) సంబంధించిన ప్రవేశాలకు ఆసక్తిగల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఐటీఐ కన్వీనర్ పి.శంకరయ్య కోరారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా హాజరై ప్రవేశం పొందాలని సూచించారు. ఇతర వివరాలకు 90596 85237, 98491 88346 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఈ నెలాఖరు దాకా తుది గడువు ఉందన్నారు.

వైద్య విద్యార్థినికి బాసట



చెక్కు ఇస్తున్న కేటీఆర్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డిలు

కాప్రా, న్యూస్‌టుడే: వైద్య విద్యను అభ్యసిస్తున్న పేద విద్యార్థినికి బీఆర్‌ఎస్ ట్రస్ట్ బాసటగా నిలిచింది. మౌలాలి నేరేడ్‌మెట్ కాలనీకి చెందిన లింగోజీ రమేష్, మంగమ్మల కుమార్తె తేజ కొత్తగూడెంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటును సాధించింది. ఆ విద్యార్థిని చదువులకు అయ్యే ఫీజులను సోమవారం రూ.29వేల చెక్కును ట్రస్ట్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ చేతుల మీదుగా అందజేశారు.

పర్యావరణానికి ఊపిరి

చెరువు పరిరక్షణకు 'కాప్రా లేక్ రివైవల్' గ్రూప్ కృషి

న్యూస్‌టుడే, కాప్రా

పర్యావరణ పరిరక్షణకు అడవులు, నీటి వనరులు, జీవ వైవిధ్యం ఉండాలి. పట్టణీకరణ జోరుతో నగరంలో చెరువులు, కుంటలు, నాలాలు కనుమరుగవుతున్నాయి. కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. మురుగు చేరడంతో చెరువులు కలుషితం అవుతున్నాయి. ఒకప్పుడు మంచినీటి వనరులుగా గుర్తింపు పొందిన అనేక చెరువులు ఇపుడు కాలుష్య కాసారాలుగా మారాయి. వీటి సంరక్షణకు 'కాప్రా లేక్ రివైవల్' గ్రూప్ సభ్యులు కృషి చేస్తున్నారు.

ఈ పరిస్థితులున్నాయి..

● చెరువు చుట్టూ అక్రమ నిర్మాణాలు

● వర్షపు నీరు రాకుండా అడ్డంకులు

● సమీప కాలనీల నుంచి మురుగు చేరిక

● ప్లాస్టిక్, గుర్రపుడెక్క, పీఓపీ వ్యర్థాలు, చెత్తా చెదారాల నిల్వ

చెరువులు, అడవుల సంరక్షణే లక్ష్యంగా..	
కాప్రా చెరువు	
విస్తీర్ణం ఎకరాలు	200
కబ్జా	173

సంస్థ లక్ష్యం ఇలా

● నగరంలో చెరువులు, అడవులు, పక్షిజాతులు, పర్యావరణ సంరక్షణ

● సామాజిక మాధ్యమాలు, సభలు, సమావేశాలతో ప్రజల్లో చైతన్యం

● చెరువుల్లో ప్లాస్టిక్, చెత్తాచెదారం తొలగింపు

భాగస్వాములు ఎక్కువగానే..

● 250 మందికి పైగా ప్రతినిధులు సభ్యులుగా ఉన్నారు. గ్రీన్ సైనిక్‌పురి, పేంకిమాత్ బెంచ్ వంటి అనేక స్వచ్ఛంద సంస్థలు, ఆక్సెంచర్, ఇన్ఫోసిస్, ఎల్అండ్‌టీ, కాగ్నిజెంట్, డెలాయిట్, అమెజాన్, గూగుల్ వంటి అనేక కార్పొరేట్, సాఫ్ట్‌వేర్ కంపెనీలు, పర్యావరణ ప్రేమికులు, సీనియర్ సిటిజన్స్, కాలేజీలు, పాఠశాలలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ బృందాలు

కాప్రా రివైవల్ గ్రూప్ స్థాపితం	14 జులై 2016
గ్రూప్ సభ్యులు	250
చెరువు శుద్ధికి చేపట్టిన కార్యక్రమాలు	110
పాల్గొన్న విద్యార్థులు	1,100
తొలగించిన చెత్త	20టన్నులు



కాప్రా లేక్ రివైవల్ బృందం సభ్యులు

సంస్థతో కలిసి పని చేస్తున్నాయి.

పర్యవేక్షణలో వీరు..!

● గుల్షన్ బంబోట్, విజయానాయుడు, మనోజ్ఞారెడ్డి, మీనారవీంద్రన్, అజితామారు, జేసెన్ విల్సన్, మేడా కోహిలీ, మేధా అకాగాషే, చంద్రశేఖర్, బాలకృష్ణ, బాలకిరణ్, సహస్రలు కీలకంగా ఉన్నారు.



చెరువుల సంరక్షణ ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తం చేస్తాం. జీవవైవిధ్యం, జలవనరుల సంరక్షణ 'ఫైటో రెమిడియేషన్' ప్రాజెక్టును చేపట్టనున్నాం. మురుగు, కలుషిత జలాలను శాస్త్రీయ పద్ధతిలో శుద్ధి చేసి మంచి నీటిగా మార్చేలా చర్యలు తీసుకుంటాం.

- దీప్తారెడ్డి, వ్యవస్థాపకురాలు, కాప్రా లేక్ రివైవల్ గ్రూప్



చెరువు రక్షణ కార్యక్రమంలో పాల్గొన్న సినీహీరో సునీల్

ఈఎంఆర్ఐలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కీసర, న్యూస్‌టుడే: ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ 108 కాల్ సెంటర్‌లో పని చేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ 'షేక్ జాన్ షాహిద్' తెలిపారు. ఇంటర్, డిగ్రీ చేసిన వారు అర్హులన్నారు. ఈనెల 15 నుంచి 19వరకు మేడ్చల్ గుండ్లపోచంపల్లిలోని కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఆసక్తిగలవారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ పత్రాలు వెంట తీసుకుని రావాలన్నారు.

ఆకస్మిక వర్షం.. విద్యుత్తుకు అంతరాయం



శామీర్‌పేటలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ చౌరస్తాలో

శామీర్‌పేట: శామీర్‌పేట మండల కేంద్రంలో సోమవారం ఆకస్మికంగా భారీ వర్షం కురిసింది. అరగంట పాటు కుండపోతగా కురవడంతో వీధుల్లో వరద పరుగులు తీసింది. మూడు గంటలపైగా విద్యుత్ సరఫరా లేక అంతరాయం కలిగింది.

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

● అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశం

● కలెక్టరేట్ ప్రజావాణికి 33 విజ్ఞాపనలు

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: మేడ్చల్ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణికి 33 ఫిర్యాదులు వచ్చాయి. దసరా పండగ ప్రభావంతో ప్రజావాణికి ఎక్కువ మంది ప్రజలు రాలేదు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, లాఆఫీసర్ చంద్రావతితో కలిసి అర్జీలను స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదుల్లో భూసమస్యలు, ధరణి, రెండు పడక గదులు, పింఛన్లు ఇతర సమస్యలపై ఉన్నాయి.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్

రెండేళ్లుగా తిరుగుతున్నా...



-ముప్పెనాలక్ష్మికాంతమ్మ బండ్లగూడ, కీసర

దివ్యాంగురాలిగా సదరం పత్రం పొంది రెండేళ్ల క్రితం పింఛన్‌కు దరఖాస్తు చేసుకుని తిరుగుతూనే ఉన్నా. ఇంకా మంజూరు కాలేదు. కలెక్టరేట్‌కు రావాలంటే ఆర్థికంగా భారమవుతోంది. అధికారులు పింఛన్ వచ్చేలా చేయాలని కోరుతున్నా.

నాలా కాదు... రహదారే



నాచారం, న్యూస్‌టుడే: మల్లాపూర్ అన్నపూర్ణ కాలనీలోని వీధి నంబర్- 7లో వరద నాలాలోని మురుగు, వ్యర్థాలు తొలగించి రోడ్డుపైనే పోశారు. కొన్ని మాసాలుగా తొలగించక పోవడంతో మ్యాన్‌హోల్ నుంచి మురుగు నిలిచి విపరీతమైన దుర్గంధం వస్తోంది. కాలనీ వాసులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా కన్నెత్తి చూడటం లేదు.

మల్లాపూర్ అన్నపూర్ణ కాలనీ వీధి నెంబర్- 7లో మురుగు నాలాను తలపిస్తున్న ప్రధాన రహదారి

వ్యర్థాలను వేస్తే.. నడిచేదెలా...



హబ్సిగూడ, న్యూస్‌టుడే: హబ్సిగూడ డివిజన్ గణేష్‌నగర్‌లో జీహెచ్‌ఎంసీ అధికారులు లక్షలు వెచ్చించి నిర్మించిన ఫుట్‌పాత్‌పై మట్టి, ఇతర వ్యర్థాలను కుప్పలుగా పోస్తున్నారు. రోజుల తరబడి వీటిని తొలగించకపోవడంతో నడవడానికి వీలు లేకుండా ఉంది.

చిన్న వ్యాపారులకు పెద్దశిక్ష

● మున్సిపల్ అధికారుల తీరు వివాదాస్పదం

ఉప్పల్, న్యూస్‌టుడే: రోడ్డు పక్కన, రెడ్ జోన్లలో చిరు వ్యాపారాలు చేస్తున్న వారిపై కొందరు మున్సిపల్ అధికారులు కఠినంగానే వ్యవహరిస్తున్నారు. ఏ చర్య తీసుకున్నా వ్యవస్థను సర్దుబాటు చేసేలా ఉండాలి. కానీ జీహెచ్‌ఎంసీ ఉప్పల్ సర్కిల్‌లో మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. చిన్న చిన్న కారణాలతో చిరు వ్యాపారులపై మున్సిపల్ అధికారులు ఉక్కుపాదమే మోపుతున్నారు. అంతిమంగా వారు ఉపాధి పొందే అవకాశం లేకుండా చేస్తున్నారు. కాల్వవెళ్ల పద్మ ఆ బండ్లను ఇవ్వడం లేదు.

తుప్పు పట్టిపోతున్నాయి..

ఉప్పల్ సర్కిల్‌లో ఉన్నతాధికారికి, కింది స్థాయి అధికారి, సిబ్బంది ఎవరికి కోపం వచ్చినా చిరు వ్యాపారుల మీదనే ప్రతాపం చూపుతున్నారు. చిరు వ్యాపారులు ఏదైనా తప్పు చేస్తే జరిమానాలు విధించడం, ఇతర కోణాలలో భయ పెట్టి సరి చేసే అధికారం మున్సిపల్ అధికారులకు ఉంటుంది. ఏ తోపుడు బండిని ఎందుకు తీసుకొచ్చారో, ఎవరు తెచ్చారో కారణం తెలియదు. వీటికి సంబంధించిన వివరాలు ఏ అధికారి దగ్గర ఉండవు. కానీ ఈ విధంగా తీసుకొచ్చిన తోపుడు బండ్లను సర్కిల్ కార్యాలయంలో డంపు చేస్తున్నారు. రోజులు, నెలలు, ఏళ్లు అయినా వాటిని వదలడం లేదు. చాలా తోపుడు బండ్లు తుప్పు పట్టిపోతున్నాయి.



ఉప్పల్ సర్కిల్ కార్యాలయం ప్రాంగణంలో తుప్పు పడుతున్న తోపుడు బండ్లు

జరిమానా విధించి వదిలేస్తున్నాం...

- అంజనేయులు, ఉప కమిషనర్

కావాలని ఎవరి తోపుడు బండ్లను కార్యాలయం వరకు తీసుకు రావాల్సి ఉండదు. ట్రాఫిక్కు ఆటంకం కలిగించేలా రోడ్లపైన, పక్కన బండ్లను పెట్టి వ్యాపారం చేసే సమయంలో ఒకటికి నాలుగు సార్లు హెచ్చరిస్తున్నాం. భయం ఉండాలని కొన్నింటిని తెస్తున్నాం. ఏదో కొంచెం జరిమానా విధించి వదిలేస్తున్నాం.

ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవల పరిశీలన



కుషాయిగూడ ఆస్పత్రిలో వైద్యులతో ప్రతినిధులు

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆరోగ్య కేంద్రాల్లో అందుతున్న వైద్య సేవలను జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పరిశీలన చేసేందుకు కేంద్ర ప్రతినిధుల బృందం జిల్లాకు వచ్చింది. సోమవారం కుషాయిగూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆ బృందానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి టి.రఘునాథస్వామి జిల్లాలో అమలవుతున్న ఆరోగ్య కార్యక్రమాలను వివరించారు. ఎంసీపీ కార్డుల టీకా ప్రగతిని చిన్నారుల తల్లులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రమాదాలను నివారించేలా చర్యలు

నాచారం, న్యూస్‌టుడే: హబ్సిగూడ - నాచారం ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదాలను నివారించాలని కోరుతూ బాబాసాహెబ్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేనావత్ రవి నాయక్ ఆధ్వర్యంలో పలువురు పార్టీ నేతలు సోమవారం నాచారం పోలీస్ స్టేషన్‌లో మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణిని కలిసి వినతి పత్రం అందజేశారు.

రైతుల సంక్షేమానికి కృషి

కాప్రా, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమానికి మార్కెట్ కమిటీ సభ్యులు కృషి చేయాలని మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ పేర్కొన్నారు. సోమవారం చర్లపల్లి డివిజన్‌లోని రెడ్డికాలనీలో జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బి.నరసింహులు, వైస్‌ఛైర్మన్ విరల్ నాయక్‌లు, సభ్యులు కలిశారు.

మురుగు కాలువ పనులు ప్రారంభం

బోడుప్పల్: బోడుప్పల్ ద్వారకానగర్‌లో రూ.29 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న భూగర్భ మురుగు కాలువ పనులను కార్పొరేటర్లు వెంకటేష్‌గౌడ్, లావణ్యలతో కలిసి నగర మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ ప్రారంభించారు.

కౌన్సిలర్ బైరా హిమ మృతి

ఘట్‌కేసర్, న్యూస్‌టుడే: పోచారం మున్సిపాలిటీ ఎనిమిదో వార్డు కౌన్సిలర్ బైరా హిమ(తొరసు) మృతి చెందారు. అనారోగ్యంతో సోమవారం మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఐటీఐ కొత్త కోర్సుల్లో చేరేందుకు గడువు 19 వరకు

మేడ్చల్, న్యూస్‌టుడే: మేడ్చల్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో నూతనంగా ప్రవేశపెట్టిన కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 19వరకు అవకాశం కల్పించినట్లు ప్రిన్సిపల్ ఎం.హనుమానాయక్ తెలిపారు.

మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలి

మేడ్చల్ రూరల్: మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని అత్వెల్లిలో 44వ జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా తొలగించిన మహనీయుల విగ్రహాలను తిరిగి ఏర్పాటు చేయాలని కోరుతూ కౌన్సిలర్ జకట దేవరాజు, పలువురు కాంగ్రెస్ నాయకులు సోమవారం కమిషనర్ నాగిరెడ్డికి పత్రం ఇచ్చారు.

ఎక్స్‌రే ల్యాబ్ సౌకర్యం

హబ్సిగూడ: రామంతాపూర్ ప్రభుత్వ హోమియోపతి వైద్యశాలలో కొత్తగా ఏర్పాటు చేసిన ఎక్స్‌రే ల్యాబ్‌ను ఆయుష్ అదనపు డైరెక్టర్, ప్రిన్సిపల్ డా.లింగరాజు ప్రారంభించారు. ఎక్స్‌రే ల్యాబ్‌తో రోగులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డా.విజయ, ఆర్ఎంవో డా.మోహన్ లాల్ పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలన అందరి బాధ్యత

ఉప్పల్, న్యూస్‌టుడే: అవినీతి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత కావాలని బెల్ జీఎం డా.విశ్వనాథ, ఏజీఎం ప్రకాశ్‌రావు, విజిలెన్స్ అధికారి రూత్ బెట్సీ పేర్కొన్నారు. దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక పురోగతికి అవినీతి ప్రధాన అవరోధంగా మారిందన్నారు. అన్ని రంగాలలోని పౌరులందరూ అవినీతి నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం బీహెచ్ఈఎల్(నాచారం) ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు అవినీతి అంశంపై వ్యాస రచన, క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, అధికారులు మహేందర్‌రెడ్డి, పద్మావతి, జి.రమేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి పత్రం ఇస్తున్న అధికారులు

విద్యుదాఘాతం కార్మికుని మృతి

కాప్రా, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి చెందిన సంఘటన చర్లపల్లి ఠాణా పరిధిలో జరిగింది. ఎస్సై హరీందర్ కథనం ప్రకారం.. మన్‌పూర్‌కు చెందిన శివానాయక్ (23)చర్లపల్లి పారిశ్రామికవాడలోని బయోపిల్స్ కంపెనీలో ఎలక్ట్రీషన్‌గా పని చేస్తున్నాడు. సోమవారం కంపెనీలో గోడకు డ్రిల్ చేస్తుండగా విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురై కింద పడిపోయాడు. కంపెనీ యాజమాన్యం ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.

దేశంలో చూపుకోల్పోతున్న వారి సంఖ్య పెరుగుతోంది: ఎమ్మెల్సీ

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: దేశంలో చూపు కోల్పోతున్నవారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందని శాసనమండలి సభ్యుడు తీన్మార్ మల్లన్న అన్నారు. ఈ రంగంలో కృషి సేవ చేయాలని బాధ్యత కూడా పెరుగుతుందన్నారు. సోమవారం రవీంద్రభారతిలో 'ఇట్రాడ్' (ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రైనింగ్ రిసెర్చ్ రిహాబిలిటేషన్ ఆఫ్ డిసెబుల్డ్స్)ట్రస్ట్ అండ్ డిసెన్‌హెరిటెడ్ చిల్డ్రన్ 29వ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ఓయూ రిజిస్ట్రార్ ఆచార్య సుకుమార్ బి.లక్ష్మణ్ ... సీఎస్ రంగరాజన్ మాట్లాడారు.. ప్రజల్లో భక్తితో పాటు సామాజిక స్పృహను కూడా పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీ: యువకుడి దుర్మరణం

ఘట్‌కేసర్,న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘట్‌కేసర్ ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన గట్టుసాయిఇంద్రనీల్‌గౌడ్(31) తొమ్మిదినెలల క్రితం జీవనోపాధికి ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్‌కు వచ్చాడు. ఓ హోటల్‌లో పని చేస్తున్నాడు. సోమవారం ద్విచక్రవాహనంపై ఘట్‌కేసర్‌కు వచ్చాడు. ఇండియన్ పెట్రోల్ బంక్ దగ్గర అతివేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్ర గాయాలతో అక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సాయిఇంద్రనీల్‌గౌడ్

పోలీసుల విధులకు ఆటంకం: కేసు నమోదు

ఘట్‌కేసర్: విధులకు ఆటంకం కలిగించారని హెడ్‌కానిస్టేబుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్‌లో పని చేస్తున్న హెడ్‌కానిస్టేబుల్ కె. మదుమోహన్, డ్రైవర్ నరేష్‌తో కలిసి ఈనెల 12న రాత్రి విధుల్లో ఉన్నారు. పోలీసు కంట్రోల్ నుంచి సమాచారం రావడంతో అంకుషాపూర్ టీ రోడ్డు వద్దకు వెళ్లారు. అక్కడ కొందరు ఉండటంతో అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించినా వెళ్లకుండా పోలీసులపైనే తిరగబడ్డారు. దీంతో రాము, అనిల్, శంకర్, కొండల్‌రెడ్డి, సుభాష్ తదితరులపైన సోమవారం కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు : నాచారం: ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వచ్చిన మినీ గూడ్స్ ఆటో ఢీ కొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం కొండ్య నగర్‌కు చెందిన శ్రీదత్త, మోహిత్ గాయపడ్డారు.

ఉప ముఖ్యమంత్రిని సత్కరించిన జెన్‌కో ఇంజినీర్లు


భట్టి విక్రమార్కతో ఇంజినీర్లు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: జెన్‌కో ఇంజినీర్లకు పదోన్నతులు ఇవ్వడంపై తెలంగాణ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపింది. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రత్నాకర్‌రావు, సదానందం నేతృత్వంలోని ఇంజినీర్ల బృందం సోమవారం ఉప ముఖ్యమంత్రిని సత్కరించింది. టీజీ జెన్‌కోలో ఎలక్ట్రికల్, మెకానికల్, టెలీ కమ్యూనికేషన్ విభాగాల్లోని 170 మంది ఏఈలు, 33 మంది ఏఏఈలకు ఏడీఈలుగా పదోన్నతి కల్పించినట్లు వివరించారు. అనంతరం ఇంధన కార్యదర్శి రోనాల్డ్ రాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బృందంలో అసోసియేషన్ సహ అధ్యక్షుడు వెంకటనారాయణరెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వేణు, అనిల్‌కుమార్ తదితరులున్నారు.

బల్దియా కార్యాలయానికి ఒడిశా శిక్షణ ఐఏఎస్‌ల బృందం


జీహెచ్‌ఎంసీ అధికారులతో శిక్షణలో ఉన్న ఐఏఎస్‌లు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: జీహెచ్‌ఎంసీలో అమలు చేస్తున్న పలు విధానాలపై అధ్యయనం చేయడానికి ఒడిశా 2023 బ్యాచ్‌కు చెందిన ప్రొబెషనరీ ఐఏఎస్ అధికారుల బృందం సోమవారం నగరానికి వచ్చింది. బల్దియా ప్రధాన కార్యాలయంలో ట్యాక్స్, ఫైనాన్స్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం, ప్రజలకు అందిస్తున్న ఆధునిక సేవలు, సాంకేతికతపై అధ్యయనం చేసింది. పారిశుద్ధ్య నిర్వహణ, మౌలిక సదుపాయాల కల్పనపై ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అదనపు కమిషనర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీలో ఆస్తిపన్ను చెల్లింపులకు ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు. జీఐఎస్ సర్వే ద్వారా జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆస్తులన్నింటినీ మ్యాపింగ్ చేశామన్నారు. శానిటేషన్ జాయింట్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. సేకరించిన చెత్తను ప్రాసెసింగ్ చేయడం వంటి వాటి గురించి వివరించారు. ప్రొబెషనరీ ఐఏఎస్‌లు అశ్విని.ఎ.ఎల్, కస్తూరి పాండ, తేజస్విని బెహెరా, దుధ్వల్ అభిషేక్ దిలీప్, ప్రణీతదాష్, ప్రేక్ష అగర్వాల్, సి.సనవనన్, ఎంసీహెచ్ ఆర్డీ ఫ్యాకల్టీ శ్రీనివాసరావు, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

'ప్రైవేటు డిగ్రీ కళాశాలల బంద్'పై ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి: పీడీఎస్‌యూ



సమావేశంలో మాట్లాడుతున్న మధు

నల్లకుంట, న్యూస్‌టుడే: ఫీజు రీయింబర్స్‌మెంటు బకాయిల చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ ప్రైవేటు డిగ్రీ కళాశాలలను బంద్ చేయాలని యాజమాన్యాలు నిర్ణయం తీసుకున్నందున.. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు బోనగిరి మధు, ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వం, ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు కలిసి విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దని కోరారు. సోమవారం విద్యానగర్‌లోని సీపీ భవన్‌లో జరిగిన సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. త్వరలో డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు జరగనున్నాయని, అదేసమయంలో ఉస్మానియా, కాకతీయ వర్సిటీల పరిధిలోని డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు బంద్‌కు పిలుపునివ్వడం తగదన్నారు. ఫీజు బకాయిలను సత్వరం చెల్లించాలని వారంతా కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు.

ఈవీ.. ఎప్పటికి ఉపయోగపడతాయో


ఇందిరా పార్కు రోడ్డు ఎన్టీఆర్ స్టేడియం వద్ద ఏడాది క్రితం ఏర్పాటు చేసిన ఈవీ ఛార్జింగ్ మిషన్ ప్రారంభానికి ముందే పాడవ్వడంతో 3 నెలల క్రితం మరోకటి ఏర్పాటు చేశారు. ఇది ఎప్పుడు ప్రారంభిస్తారో..

శుద్ధికయ్యే ఖర్చంతా వ్యర్థమే


హుస్సేన్‌సాగర్ ప్రక్షాళనకు రూ.కోట్లు ఖర్చుచేసినా ఫలితం శూన్యం. వరదలా వచ్చి చేరుతున్న ప్లాస్టిక్, రసాయన వ్యర్థాలతో సాగర్ కలుషితమవుతోంది. దుర్వాసనతో ముక్కుపుటాలు అదురుతున్నాయి.

దసరా ధమాకా..


ద్విచక్ర వాహనాల విక్రయాల జోరు

60-70 శాతం అమ్మకాలు గ్రేటర్‌లోనే

ఈనాడు, హైదరాబాద్

దసరా పండగ పురస్కరించుకొని ద్విచక్ర వాహనాల విక్రయాలు జోరు కొనసాగింది. గతేడాదితో పోల్చితే రాష్ట్ర వ్యాప్తంగా 9.81 శాతం వృద్ధి కనిపించింది. దీంతో రవాణాశాఖకు వచ్చే ఆదాయం 9.01 శాతం పెరిగింది. గతేడాది ద్విచక్ర వాహనాల విక్రయాల ద్వారా పన్నుల కింద రూ.37.92 కోట్లు వస్తే.. ఈసారి ఆ ఆదాయం రూ.41.43 కోట్లకు పెరిగింది. అదే సమయంలో కార్ల అమ్మకాలు మాత్రం ఈసారి చెప్పుకోదగ్గ స్థాయిలో జరగలేదు. గతేడాదితో పోల్చితే కార్ల విక్రయాలు 6.79శాతం తగ్గాయి. ఆదాయం కూడా 0.19 శాతం తగ్గింది. గతేడాది కార్ల అమ్మకాలు ద్వారా వివిధ పన్నుల కింద రూ.223.54 కోట్లు రాగా.. ప్రస్తుతం రూ. 223.12 కోట్లుకు తగ్గింది. దసరా పండగలో ఎక్కువ మంది కొత్త వాహనాలు కొనుగోలు చేసేందుకు ఆసక్తిగా చూపుతుంటారు. ముఖ్యంగా గ్రేటర్‌లోనే ఎక్కువ జోష్ కనిపిస్తుంది.

గతేడాది దసరాతో పోల్చితే వాహనాల అమ్మకాలు ఇలా..



మహానగరంలోనే ఎక్కువ..

రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం వాహనాల అమ్మకాల్లో 60-70 శాతం నగరంలోనే జరుగుతుంటాయి. గ్రేటర్ వ్యాప్తంగా 3 వేల కొత్త వాహనాలు రహదారులపైకి వస్తుంటాయి. సాధారణ రోజులతో పోల్చితే దసరా పండగకు కార్లు, ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేయడం ఆనవాయితీ. అయితే ఈసారి ద్విచక్రవాహనాల విక్రయాలు జోరు సాగినా కార్ల అమ్మకాల్లో పురోగతి కనిపించలేదు. గత దసరా కంటే రాష్ట్రవ్యాప్తంగా ఈసారి 738 కార్లు తక్కువగా అమ్ముడయ్యాయి. ముఖ్యంగా స్థిరాస్తి మార్కెట్ కార్ల అమ్మకాలపై ప్రభావం చూపుతుందని నిపుణుల అంచనా. కొంతకాలంగా పెద్దపెద్ద ప్రాజెక్టుల్లో స్తబ్ధత నెలకొనడం.. కొత్త ప్రాజెక్టులకు వేగంగా అడుగులు పడకపోవడం పరోక్షంగా వాహన విక్రయాలపై ప్రభావం పడుతోందని చెబుతున్నారు. దీపావళి నాటికి మార్కెట్ పుంజుకుంటుందని విశ్లేషిస్తున్నారు.

పౌష్టికాహారంలో నాణ్యత, శుభ్రతకు ప్రాధాన్యం


పారిశ్రామికవాడలోని తెలంగాణ ఫుడ్స్‌లో పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

కాప్రా, న్యూస్‌టుడే: గర్భిణులు, చిన్నారులకు అందించే పౌష్టికాహారంలో నాణ్యత, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. సోమవారం నాచారం పారిశ్రామికవాడలోని తెలంగాణ ఫుడ్స్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ముడి పదార్థాల నాణ్యత, పరిశుభ్రతను పరిశీలించారు. కంపెనీ సామర్థ్యం, యంత్రాల పనితీరు, శుద్ధి చేసిన ఆహార పదార్థాలను నిల్వ చేయడంలో తీసుకుంటున్న జాగ్రత్తల గురించి అధికారులు మంత్రికి వివరించారు. చిన్నారులకు అందించే బాలామృతం నాణ్యతను తనిఖీ చేశారు. ఆహార పదార్థాల నాణ్యతను తెలియజేసే ల్యాబ్ నివేదికలను తక్షణమే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కొత్త ప్లాంట్‌ను కూడా త్వరగా అందుబాటులోకి తీసుకొచ్చి సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో అవినీతికి తావు లేదని, అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి నాణ్యమైన ముడి పదార్థాలతో పౌష్టికాహారం ఇవ్వాలని ఆదేశించారు.

వికటించిన వ్యాక్సిన్

రెండుసార్లు శస్త్రచికిత్స చేయించుకున్నా మెరుగుపడని ఆరోగ్యం


వ్యాక్సిన్ వేసిన చోట ఏర్పడిన పుండు

కోరుట్ల, న్యూస్‌టుడే: గల్ఫ్ వెళ్లే క్రమంలో వైద్య పరీక్షల్లో భాగంగా వ్యాక్సిన్ వేయించుకోగా చేతికి గాయమై శస్త్రచికిత్స చేయించుకున్నా నయం కాని పరిస్థితి నెలకొందని బాధితులు ఆందోళన చెందుతున్నారు. బాధితుల వివరాల ప్రకారం.. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం సంగెం గ్రామానికి చెందిన రంజిత్‌కుమార్, చంద్రశేఖర్, మరో యువకుడు, మోహన్‌రావుపేట గ్రామానికి చెందిన రాకేశ్ సౌదీ అరేబియా, బెహ్రెయిన్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. చంద్రశేఖర్‌కు సౌదీ వీసా రావడంతో నాలుగు నెలల కిందట హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు మెడికల్ సెంటర్‌లో వైద్య పరీక్షల్లో భాగంగా కుడి చేతికి వ్యాక్సిన్ ఇచ్చారు. 20 రోజుల తర్వాత వ్యాక్సిన్ తీసుకున్న చోట గడ్డ ఏర్పడగా తగ్గిపోతుందని సౌదీ వెళ్లి ఓ ప్రైవేటు కంపెనీలో పనిలో చేరాడు. తర్వాత కొద్దిరోజులకు పుండు కావడంతో శస్త్రచికిత్స చేయించుకోవాలని సూచించారు. కానీ ఇండియాకు వెళ్లేందుకు అనుమతివ్వలేదు. కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని రాయబార కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నా పంపించలేదు. 5 వేల సౌదీ రియాల్‌లు తీసుకొని పంపించారు. 40 రోజుల కిందట సంగెంకు చేరుకున్న చంద్రశేఖర్ కోరుట్ల ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించుకున్నట్లు తెలిపాడు. సంగెంకు చెందిన రంజిత్‌కుమార్ బహ్రెయిన్‌కు, మోహన్‌రావుపేటకు చెందిన రాకేశ్ సౌదీ వెళ్లేందుకూ వ్యాక్సిన్ వేయించుకుంటే వారికీ అలాగే గడ్డలా అయింది. వెంటనే కోరుట్లలోని ఆసుపత్రిలో ఒకసారి, రెండు వారాల కిందట రెండోసారి సర్జరీ చేయించుకున్నారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు కోరుట్ల సీఐ సురేశ్‌బాబు తెలిపారు.

మొగిలయ్యకు కేటాయించిన స్థలాన్ని రక్షిస్తాం

రాచకొండ కమిషనర్ సుధీర్‌బాబు


మొగిలయ్యను సత్కరిస్తున్న సీపీ సుధీర్‌బాబు, ఏడీసీపీ మనోహర్, ఇన్‌స్పెక్టర్ నాగరాజు

ఈనాడు, హైదరాబాద్: పద్మశ్రీ పురస్కార గ్రహీత కిన్నెర మొగిలయ్యకు ప్రభుత్వం కేటాయించిన భూమి పరిరక్షణకు పూర్తి బాధ్యత తీసుకుంటామని రాచకొండ సీపీ జి.సుధీర్ బాబు హామీ ఇచ్చారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మొగిలయ్యకు హయత్‌నగర్ ఠాణా పరిధి బాగ్ హయత్‌నగర్‌లో 600 గజాల స్థలం కేటాయించింది. భూమి చుట్టూ నిర్మించిన తాత్కాలిక గోడను గుర్తుతెలియని వ్యక్తులు కూల్చేశారు. దీనిపై హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సోమవారం ఎల్బీనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో కమిషనర్‌ను కలిసిన మొగిలయ్య ఘటన గురించి వివరించారు. ట్రాఫిక్ అదనపు డీసీపీ మనోహర్, హయత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తదితరులున్నారు.

స్థల హద్దులను పరిశీలించిన తహసీల్దార్

హయత్‌నగర్ న్యూస్‌టుడే: మొగిలయ్య స్థలాన్ని సోమవారం తహసీల్దార్ జానకి, సీఐ నాగరాజుగౌడ్, రెవెన్యూ అధికారులు పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం అధికారులు స్థలానికి హద్దులు నిర్ణయించారు.

ఎన్నికల కోసమే నగదు మళ్లింపు

అడ్డదారిలో 'వాల్మీకి' సొమ్ము: ఈడీ

బెంగళూరు (శివాజీనగర), న్యూస్‌టుడే: మహర్షి వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌కు చెందిన నగదును దారి మళ్లించి అందులో కొంత మొత్తాన్ని బళ్లారి లోక్‌సభ ఎన్నికల్లో ఖర్చు చేశారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు తమ అభియోగపత్రంలో పేర్కొన్నారు. రూ.187 కోట్ల నిధుల నుంచి రూ.89.62 కోట్లను ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ఖాతాలకు అక్రమ మార్గంలో తరలించారని ఈడీ అధికారులు ఆరోపించారు. అక్రమాల్లో మాజీ మంత్రి బి.నాగేంద్రను ప్రధాన నిందితుడని అందులో నమోదు చేశారు. హైదరాబాద్‌లోని ఫస్ట్ క్రెడిట్ కో-ఆపరేటివ్ బ్యాంకు మేనేజింగ్ డైరెక్టర్ సత్యనారాయణ, బ్యాంకు అధ్యక్షుడు ఇటకారి సత్యనారాయణ, కార్పొరేషన్ ఎండీ జేజీ పద్మనాభ, వారి అనుచరులు నాగేశ్వరరావు, నెక్కంటి నాగరాజ్, విజయకుమార్ గౌడ తదితరులను నిందితులుగా చేర్చారు. గంగా కల్యాణ పథకానికి కేటాయించిన రూ.43.33 కోట్లను అక్రమ ఖాతాలకు మళ్లించగా, అందులో బళ్లారి ఎన్నికల కోసం రూ.20.19 కోట్లు దారి మళ్లించి ఖర్చు చేశారని దర్యాప్తులో గుర్తించారు.

నృత్య దర్శకుడు జానీ బెయిలు పిటిషన్ కొట్టివేత

రంగారెడ్డి జిల్లా కోర్టులు: నృత్య దర్శకుడు జానీ బెయిలు పిటిషన్‌ను రంగారెడ్డి జిల్లా ప్రధాన పోక్సో కోర్టు కొట్టివేసింది. సహాయ నృత్య దర్శకురాలు ఫిర్యాదుతో అత్యాచారం, బెదిరింపులు, పోక్సో కేసుల కింద అరెస్టు అయి, గత నెల 19 నుంచి జానీ చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో విచారణ ఖైదీగా ఉన్నారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు దశలో ఉన్నందున బెయిలు ఇవ్వడం కుదరదని న్యాయమూర్తి హరీశ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు.

వీధి కుక్కల దాడిలో తండ్రి, కుమారుడికి గాయాలు

దుండిగల్, న్యూస్‌టుడే: వీధి కుక్కల దాడిలో తండ్రి, కుమారుడికి గాయాలయ్యాయి. దుండిగల్ పురపాలిక పరిధి బౌరంపేటలో కుమ్మరి మల్లేష్(56), కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నాడు. ఆదివారం రాత్రి 9 గంటలకు అతడు, కుమారుడు నాగరాజు(30) సెంటర్ నుంచి ఇంటికి నడుచుకుంటూ వెళుతున్నారు. మార్గమధ్యలో మూడు శునకాలు వారిపై దాడి చేశాయి. వారి కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి.

చికెన్ ధరలు			
ఫాంరేటు	126–00	డ్రెస్డ్	215–00
రిటైల్	148–00	స్కిన్‌లెస్	244–00

ప్రార్థనా మందిరంలో విగ్రహం ధ్వంసం

- నిందితుడికి స్థానికుల దేహశుద్ధి.. పోలీసులకు అప్పగింత
- సికింద్రాబాద్ కుమ్మరిగూడలో ఉద్రిక్తత


గాంధీలో చికిత్స పొందుతున్న నిందితుడు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: సికింద్రాబాద్ పరిధిలోని ఓ ప్రార్థనామందిరంలో విగ్రహం ధ్వంసం కలకలం రేపింది. పెద్దఎత్తున ఆందోళనకారులు రావడంతో ఉద్రిక్తత నెలకొంది. సోమవారం తెల్లవారుజామున 4.30 గంటల ప్రాంతంలో నిందితుడు గుడి తలుపులు పగులగొట్టి లోపలకు వెళ్లి విగ్రహాన్ని ధ్వంసం చేశాడు. స్థానికులు గుర్తించి పట్టుకొని దేహశుద్ధి చేశారు. అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అనంతరం నిమ్స్‌లో చేర్చారు. సీపీ సీవీ ఆనంద్, అదనపు సీపీ చంద్రశేఖర్‌రెడ్డి, డీసీపీలు సాధన రష్మీ పెరుమాళ్, సుధీంద్ర పర్యవేక్షించారు. భాజపా నాయకురాలు మాధవీలత, చీకోటి ప్రవీణ్, భాజపా కార్పొరేటర్ శ్రవణ్ ప్రార్థనామందిరం బయట బైఠాయించారు.

సీఎం దృష్టికి తీసుకెళ్తా: కిషన్‌రెడ్డి

నగరంలో ప్రశాంత వాతావరణాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించేవారితో కఠినంగా వ్యవహరించాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కోరారు. దీన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.

ఎంతటి వారైనా శిక్షించాలి: తలసాని

విద్వేషాలను రెచ్చగొట్టి సామరస్యతను దెబ్బతీసేందుకు ప్రయత్నించే వారు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు.

పునర్నిర్మిస్తా: ఎమ్మెల్యే శ్రీగణేష్

సొంత నిధులతో మందిరాన్ని పునర్‌నిర్మిస్తానని ఎమ్మెల్యే శ్రీగణేష్ హామీ ఇచ్చారు.

మానసికపరిస్థితి సరిగా లేకనే?..

నిందితుడు(30) ముంబయికి చెందినవాడిగా పోలీసులు నిర్ధారించారు. విద్యావంతుల కుటుంబానికి చెందిన ఇతడు మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తిచేశాడు. మానసిక పరిస్థితి సరిగాలేకపోవడంతో ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించినట్టు తెలుస్తోంది. అతనిలో మార్పు తెచ్చేందుకు వ్యక్తిత్వ వికాస శిక్షణకు హైదరాబాద్ పంపినట్టు సమాచారం.

గృహ నిర్బంధంలో ఎమ్మెల్యే రాజాసింగ్

గోషామహల్, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే రాజాసింగ్‌లోధ్‌ను పోలీసులు గృహనిర్బంధం చేయడంతో ప్రార్థనా మందిరాన్ని సందర్శించే వీలు లేదా.. అంటూ మండిపడ్డారు.

పోలీసు వ్యవస్థపై నమ్మకం పోతుంది: బండి

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: ఈ కేసులో ప్రభుత్వం కఠినంగా వ్యవహరించకపోతే ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకం పోతుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు.

మార్కెట్ ఠాణాలో కేసు నమోదు

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని మార్కెట్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు. సోమవారం ఉదయం ప్రార్థనా మందిరంలోకి ఓ వ్యక్తి ప్రవేశించి విగ్రహం ధ్వంసం చేశాడని స్థానికుడు కిరణ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

ప్రజావాణి విజ్ఞప్తుల పరిష్కారానికి చొరవ చూపాలి

అదనపు కమిషనర్ నళిని పద్మావతి



అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: ప్రజావాణి విజ్ఞప్తుల పరిష్కారానికి చొరవ చూపాలని అడిషనల్ కమిషనర్ నళిని పద్మావతి సంబంధిత అధికారులను ఆదేశించారు. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వివిధ సమస్యల పరిష్కారాన్ని కోరుతూ అర్జీలు స్వీకరించారు. ఫోన్ ఇన్ ద్వారా 6 విన్నపాలు రాగా జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో 26 విన్నపాలు వచ్చాయన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఆరు జోన్లలో మొత్తం 52 అర్జీలు రాగా అందులో కూకట్‌పల్లి జోన్‌లో 25, సికింద్రాబాద్ జోన్‌లో 14, ఎల్బీనగర్ జోన్‌లో 05, చార్మినార్ జోన్‌లో 4, శేరిలింగంపల్లి జోన్‌లో 3, ఖైరతాబాద్ జోన్‌లో ఒక అర్జీ వచ్చాయని తెలిపారు. అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్ రెడ్డి, యాదగిరి రావు, వెటర్నరీ చీఫ్ అబ్దుల్ వకీల్ పాల్గొన్నారు.

విడాకులు తీసుకున్నా.. ఆగని మోసాల బంధం

ఈనాడు, హైదరాబాద్: ఇద్దరు భార్యాభర్తలు విడాకులు తీసుకున్నా మోసాల బంధాన్ని మాత్రం కొనసాగిస్తున్నారు. బహుళ జాతి సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ తెలంగాణ, కర్ణాటక, ఏపీ రాష్ట్రాలకు చెందిన నిరుద్యోగుల్ని నిండా ముంచేస్తున్నారు. మాజీ భర్త దర్శకత్వంలో నిరుద్యోగుల నుంచి రూ. లక్షలు వసూలు చేస్తున్న మహిళను సైబరాబాద్ సైబర్‌క్రైమ్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. 15 ఫోన్లు, ఒక ల్యాప్‌టాప్, 10 సిమ్‌కార్డులు, ఆరు చెక్‌బుక్‌లు, ఒక కారు, డెబిట్, క్రెడిట్‌కార్డుల్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితురాలిపై మూడు రాష్ట్రాల్లో 13 కేసులున్నాయి. సైబర్‌క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నరేంద్ర కేసు వివరాలు వెల్లడించారు.

కొనసాగుతోన్న బంధం.. కర్ణాటకలోని కలబురిగికి చెందిన మహ్మద్ అలీ, రేష్మ అలియాస్ స్వప్న(30)2009లో హైదరాబాద్‌కు వచ్చారు. ఇన్‌స్టాంట్ ఐటీ జాబ్స్ కన్సల్టెన్సీలో అలీ మేనేజర్‌గా రేష్మ టెలీ కాలర్‌గా పనిచేసేవారు. ఇద్దరూ 2013లో వివాహం చేసుకొని..2022లో విడాకులు తీసుకున్నారు. ఐటీ ఉద్యోగాల నియామక ప్రక్రియ మీద అవగాహన ఉన్న వీరిద్దరూ నిరుద్యోగుల్ని మోసం చేయాలని పథకం వేశారు. విడాకుల తర్వాత రేష్మ మరొకర్ని పెళ్లాడినా మాజీ భర్తతో సంబంధాలు కొనసాగిస్తోంది. కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ సంస్థలో మానవ వనరుల విభాగం మేనేజర్‌గా పనిచేస్తున్నానని.. బహుళ జాతి సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ వివిధ వెబ్‌సైట్లలో నమోదు చేసుకున్న నిరుద్యోగుల వివరాలు సేకరించి మోసం చేసేది. ఉద్యోగం కావాలనుకుంటే అడ్వాన్సు కింద కొంత మొత్తం ఇవ్వాలని వసూలు చేసి ప్రముఖ సంస్థల్లో ఉద్యోగం వచ్చినట్లు సంస్థ పేర్లతో ఉన్న మెయిల్ ద్వారా నియామకపత్రం పంపించి.. ఆ తర్వాత పత్తాలేకుండా పోతారు. నగరానికి చెందిన యువతికి రేష్మ కాల్ చేసి ఐబీఎం, కాగ్నిజెంట్‌లో భారీగా ఖాళీలు భర్తీ చేస్తున్నారని నమ్మించింది. నిజమేనని నమ్మిన యువతి తనకు తెలిసిన వారికి ఈ విషయం చెప్పింది. మొత్తం 10 మంది దగ్గర రూ.58.75 లక్షలు వసూలు చేసి నియామక పత్రాలు ఇచ్చింది. ఆ తర్వాత ఫోన్లకు స్పందించకపోవడంతో అనుమానమొచ్చి సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాంకేతిక ఆధారాలతో నిందితురాలు రేష్మను అరెస్టు చేసింది.

విజృంభించిన నితిన్

విజయానికి చేరువలో హైదరాబాద్

పాట్నా: యువ పేసర్ నితిన్ సాయి యాదవ్ విజృంభించడంతో కల్నల్ సీకే నాయుడు అండర్-23 టోర్నీలో బిహార్‌తో మ్యాచ్‌లో హైదరాబాద్ ఇన్నింగ్స్ విజయం ముంగిట నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో నితిన్ (6/54) ధాటికి బిహార్ 150 పరుగులకే కుప్పకూలింది. అనంతరం ఫాలోఆన్‌లోనూ నితిన్ (6/37) మరో ఆరు వికెట్లతో చెలరేగడంతో ప్రత్యర్థి జట్టు 131/8తో సోమవారం ఆట ముగించింది. ఆ జట్టు ఇంకా 68 పరుగులు వెనుకబడి ఉంది. మూడో రోజు మిగిలిన రెండు వికెట్లనూ త్వరగా పడగొడితే హైదరాబాద్‌కు ఇన్నింగ్స్ విజయం దక్కుతుంది. తొలి ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 349 పరుగులు చేసింది.

రాణించిన రేవంత్, సుమిత్

కోల్‌కతా: బెంగాల్‌తో కల్నల్ సీకే నాయుడు అండర్-23 టోర్నీ మ్యాచ్‌లో ఆంధ్ర ఆధిపత్యం ప్రదర్శిస్తోంది. సోమవారం తొలి ఇన్నింగ్స్‌లో బెంగాల్‌ను 244 పరుగులకు ఆలౌట్ చేసింది. అరంగేట్ర పేసర్ సుమిత్ (5/58) అయిదు వికెట్లతో విజృంభించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన ఆంధ్ర రెండో రోజు ఆట చివరకు 167/1తో నిలిచింది. కెప్టెన్ రేవంత్ రెడ్డి (100 బ్యాటింగ్; 116 బంతుల్లో 16x4, 1x6) అజేయ శతకంతో అదరగొట్టాడు.

భూ వివాదానికి నిండు ప్రాణం బలి


దుర్గేశ్‌సింగ్

ధూల్‌పేట, న్యూస్‌టుడే: భూ వివాదం నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. ఈ దుర్ఘటన మంగళ్‌హాట్ ఠాణా పరిధిలో జరిగింది. సీఐ మహేశ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. లోయర్ ధూల్‌పేట టక్కేర్‌వాడీలోని లాలా తాలీమ్ ప్రాంతంలో నివసించే దుర్గేశ్‌సింగ్(38) ప్రైవేటు ఉద్యోగి. అక్కడే ఉంటున్న సమీప బంధువులు భజరంగ్‌సింగ్, సత్యనారాయణ సింగ్, తుల్జారామ్‌సింగ్‌లతో వంశపారంపర్యంగా సంక్రమించిన ఆస్తికి సంబంధించి వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి బంధువులు దుర్గేశ్‌సింగ్ ఇంటికి వెళ్లి బయటకు పిలిచి దాడికి పాల్పడ్డారు. ముఖం, మెడ, శరీరంలోని ఇతర భాగాలపై పిడిగుద్దులతో దాడి చేయడంతో కుప్పకూలిపోయాడు. అనంతరం నిందితులు పారిపోగా.. మృతుని కుటుంబసభ్యులు గమనించి ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

గుత్తేదారుపై సీసీఎస్‌లో కేసు

ఈనాడు, హైదరాబాద్: నిర్మాణ పనులు సకాలంలో పూర్తిచేసినా సొమ్ము చెల్లించకుండా మోసం చేశారని గుత్తేదారుడిపై సబ్ కాంట్రాక్టర్ ఇచ్చిన ఫిర్యాదుతో నగర సీసీఎస్‌లో సోమవారం కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న సమాచారం మేరకు వివరాలు.. ఆసిఫ్‌నగర్‌కు చెందిన రూప, స్నేహ కాంట్రాక్టర్స్ యజమాని రామకృష్ణ. 2022 ఫిబ్రవరిలో పీవీఎన్ఆర్ మార్గ్‌లోని జలవిహార్ వద్ద స్కైవాక్, వాక్‌వే నిర్మాణం చేపట్టిన శ్రీహర్ష కన్‌స్ట్రక్షన్స్ ఎండీ శ్రీహర్ష నుంచి రామకృష్ణ సబ్‌కాంట్రాక్ట్ పనులు తీసుకున్నారు. 2 శాతం లాభం ఇచ్చేలా మధ్యవర్తి నసీర్ అలీఖాన్ సమక్షంలో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీనిలో భాగంగా బాధితుడి నుంచి ముందుగానే జీఎస్టీ ఇన్‌వాయిస్ తీసుకున్నారు. నిబంధన ప్రకారం సమయం మేరకు నిర్మాణ పనులు పూర్తి చేశాడు. ఒప్పందపత్రంలో లేని అదనపు నిర్మాణ పనులు రూ.1.60 కోట్లతో పూర్తిచేశారు. గతేడాది సెప్టెంబరులో అప్పటి ప్రజాప్రతినిధులు ప్రారంభోత్సవం చేశారు. దీనికి సంబంధించి అదనంగా ఖర్చుచేసిన రూ.2.30 కోట్ల నిధులను హెచ్ఎండీఏ విడుదల చేసినా తనకు రూ.1.60 కోట్ల బకాయిలు చెల్లించకుండా మోసగించినట్టు బాధితుడు న్యాయస్థానం ద్వారా మారేడుపల్లి ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసును నగర సీసీఎస్‌కు బదిలీ చేశారు.

విదేశీ నేరగాళ్లు.. నగరంలో మోసాలు

ఈనాడు– హైదరాబాద్



నల్ల కాగితాలను కరెన్సీ నోట్లుగా మారుస్తామని ఆఫ్రికన్లు.. అమెరికా డాలర్లను రూపాయలుగా మార్చుకోవచ్చని బంగ్లాదేశీయులు.. ఇళ్లల్లో పనులు చేస్తామంటూ గుల్ల చేసే నేపాలీలు.. ఇలా నగరంపై విదేశీ దొంగల కన్నుపడింది. పర్యాటకం, విద్య, ఉపాధి పేరుతో అడ్డదారుల్లో దేశంలోకి చొరబడుతున్న కొందరు నేరస్థులు అందినకాడికి దోచుకుంటున్నారు. దోపిడీలు, దొంగతనాలు చేసి సరిహద్దులు దాటుతున్నారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించేలోపు పారిపోతున్నారు. కొన్ని కేసులు ఏళ్లతరబడి పెండింగులో ఉంటున్నాయని పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. ఇటీవల బైకు చోరీలు, గ్యాంబ్లింగ్ వంటి నేరాల్లోనూ వీరి ప్రమేయం పెరుగుతోందంటున్నారు.

దృష్టి మళ్లించి చోరీలు: ఇటీవల బంగ్లాదేశ్‌లో చెలరేగిన అల్లర్లు స్థానికంగా పెద్ద అలజడి రేపాయి. దీంతో వేలాది మంది పశ్చిమ బెంగాల్ మీదుగా దేశంలోకి చొరబడుతున్నారు. వీరిలో కొందరు నగరానికి వచ్చి బాలానగర్, భోలక్‌పూర్ తదితర ప్రాంతాల్లోని రోహింగ్యాలకు తోడుగా అక్రమంగా ఉంటూ వారిలో కొందరు చిన్నాచితకా చోరీలు చేస్తున్నారు. ఇక్కడ చోరీ చేశాక మరో నగరానికి చేరుకుని అక్కడా మొదలుపెడుతున్నారు.

పట్టుకోవడం పెద్దసవాలే..: ఇలాంటి వారిపై నగరంలో 50 వరకూ కేసులు పెండింగులో ఉన్నట్లు సమాచారం. సాధారణంగా పాత నేరస్థులైతే పోలీసు రికార్డుల ఆధారంగా వివరాలు తెలుసుకునే ఆస్కారముంది. విదేశీయుల విషయంలో పరిస్థితి సంక్లిష్టంగా మారుతోంది. ఇంతకుముందెన్నడూ పోలీసు రికార్డుల్లో నమోదు కాకపోవడంతో ఆచూకీ గుర్తించలేరు. వేలిముద్రలు, సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా దర్యాప్తు చేసినా తెలుసుకోవడం పెద్ద సవాలు. ఈ వ్యవధిలో నేరగాళ్లు తేలిగ్గా దేశం దాటేస్తారు.

మాయమాటలతో నిలువుదోపిడీ



ఈనాడు, హైదరాబాద్: సాహితీ..ధన్వంతరి..డీకేజడ్..వీసా కన్సల్టెంట్స్.. హెల్త్‌క్లబ్‌లు.. వీటన్నింటి లక్ష్యం ఒక్కటే. జనం నమ్మకాన్ని సొమ్ము చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసినా కొల్లగొట్టిన సొమ్ముతో తేలికగా జైలు నుంచి బయటకు వస్తున్నారు. ఖరీదైన కార్లు..విలాసవంతమైన భవనాల్లో ఉంటూ బడా వ్యాపారులుగా చెలామణి అవుతున్న వీరి చేతిలో నష్టపోయిన వారిలో ఎక్కువ మంది తెలిసివాళ్లే ఉన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా కేవలం మాటలకు మురిసిపోయి కష్టార్జితాన్ని నష్టపోవద్దని పోలీసులు పదేపదే చెబుతున్నా సామాన్యులు అదే ఉచ్చులో చిక్కుతున్నారు. కొందరు బాధితులు అవతలి వారి మాటలపై గురికుదరకున్నా.. మోసమని తెలిసినా అన్నీ కలిసొస్తే తమ సొమ్ముకు ఢోకాఉండదనే అతివిశ్వాసంతో రూ.లక్షలుకుమ్మరిస్తున్నారని పోలీసుఅధికారులు చెబుతున్నారు.

మేమున్నామని.. మోసాల కహానీ

సొంత ఇల్లు.. ఇంటి ఖర్చులు.. పిల్లల ఫీజులు..భవిష్యత్తు అవసరాల కోసం పొదుపు చేయడం..అవకాశం దొరికితే పెట్టుబడి పెట్టేందుకు మధ్యతరగతి జీవులు ఆసక్తి చూపుతుంటారు. దీన్ని ఆసరా చేసుకుని కొందరు మాటలతో బురిడీ కొట్టించి నిండా ముంచుతున్నారు. రూ.వేల కోట్లు నష్టపోయామంటూ బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. వీరి సొమ్మును చట్ట ప్రకారం తిరిగి ఇప్పించేందుకు పోలీసులు చర్యలు చేపడుతున్నారు.

కేసుల తీరిది..

- ఈ ఏడాది 9 నెలల వ్యవధిలో నగర సీసీఎస్‌లో 220 కేసులు నమోదయ్యాయి.
- సుమారు రూ.7-8 వేల కోట్లు పోగొట్టుకున్నట్లు ఫిర్యాదుల్లో పేర్కొన్నారు.
- తాజాగా డీకేజడ్ టెక్నాలజీస్, డికాజో సొల్యూషన్స్ పేరిట పెట్టుబడిని రెట్టింపు చేస్తామంటూ వేలాది మందిని నిండాముంచిన ఘరానా మోసాల జంట సయ్యద్ అష్ఫఖ్ రాహిల్, సయీదా అయేషాను పోలీసులు అరెస్టు చేశారు.
- ప్రాథమిక దర్యాప్తులో 17,500 మంది నుంచి రూ.229 కోట్లు కాజేసినట్లు పోలీసులు తమ విచారణలో తేల్చారు.
- ఈ కేసుతో ప్రమేయం ఉన్న మరో 20 మందిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు.
- 2018లో డీకేజడ్ ఇన్వెస్టర్ పేరిట మొదలైన పెట్టుబడుల దందా ఈ ఏడాది జూన్ వరకూ కొనసాగింది.
- సామాన్యులను ఆకట్టుకునేందుకు సూపర్ మార్కెట్‌లో లక్కీ డ్రా నిర్వహించి విజేతలకు ద్విచక్ర వాహనాలు, కార్లు బహుమతులుగా అందజేశారు. ఇది నిజమని భావించిన ఎంతో మంది రూ.లక్ష నుంచి రూ.3 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టినట్లు పోలీసులు చెబుతున్నారు.
- దేశ, విదేశాల్లోని 4 వేల మందిని నమ్మించిన ధన్వంతరి ఫౌండేషన్ ఇంటర్నేషనల్ సంస్థ నిర్వాహకులు రూ.1,500 కోట్లు వసూలు చేశారు.

పేద బ్రాహ్మణ విద్యార్థులకు ఉచిత వసతి సదుపాయం

కాచిగూడ, న్యూస్‌టుడే: గ్రేటర్ పరిధిలోని పేద బ్రాహ్మణ విద్యార్థులకు తలసేవనం వసతిగృహంలో ఉచిత సదుపాయాన్ని కల్పిస్తున్నట్లు బ్రాహ్మణ సంక్షేమ భవన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గిరిప్రసాదశర్మ తెలిపారు. సోమవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో.. సంస్థ కార్యనిర్వాహణ అధికారిణి శ్రీపతి దుర్గారాణితో కలిసి ఆయన మాట్లాడారు. ఇంటర్ నుంచి పీజీ వరకు చదివే విద్యార్థులకు ఉచిత వసతితో పాటు కోచింగ్ సౌకర్యం కూడా కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఉచిత ప్రవేశాల కోసం www.indianbrahmins.com వెబ్‌సైట్ ద్వారా పేర్లు నమోదు చేయించుకోవాలని సూచించారు.



సాయిబాబాకు నేతల నివాళులు మౌలాలిలోని సాయిబాబా నివాసంలో ఆయన పార్థివదేహం వద్ద రోదిస్తున్న భార్య వసంత, కుమార్తె మంజీర ● నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, విమలక్క, ప్రజా గాయకుడు జయరాజు, ప్రొఫెసర్ ఖాసిం

రోడ్డెక్కిన ఎలక్ట్రిక్ సిటీ ఆర్డినరీ బస్సులు

మహాలక్ష్మి పథకం వర్తించడంతో విశేష స్పందన



ఈనాడు, హైదరాబాద్: కొత్తగా 85 సిటీ ఆర్డినరీ ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన గ్రేటర్ ఆర్టీసీ రద్దీ మార్గాల్లో వాటిని నడుపుతోంది. మరిన్ని బస్సులను విడతల వారీగా సమకూర్చుకునేందుకు అధికారులు ప్రణాళికలు వేస్తున్నారు. డొక్కు బస్సుల స్థానంలో సరికొత్త ఎలక్ట్రిక్ బస్సులు రావడం.. ఆర్డినరీ బస్సు ఛార్జీలు.. 'మహాలక్ష్మి' ఉచిత బస్సు పథకం వర్తిస్తుండడంతో ప్రయాణికుల నుంచి విశేష స్పందన వస్తోంది. తాజాగా తిరుగుతున్న ఎలక్ట్రిక్ ఆర్డినరీ బస్సులతో(ఏసీ, నాన్ ఏసీ) కలిపి నగరంలో 187 విద్యుత్తు బస్సులు నగరంలో తిరుగుతున్నాయి. మరో 353 సమకూరనున్నాయి.

విద్యుత్తు బస్సులు నడుపుతున్న మార్గాలివే.. ● ప్రస్తుతం ఉన్న 187 విద్యుత్తు బస్సుల్లో 77 ఏసీ, 110 నాన్ ఏసీవి ఉన్నాయి. 50 ఏసీ బస్సులను విమానాశ్రయ మార్గంలో తిప్పుతున్నారు. ఐటీ ఉద్యోగుల కోసం 10 నుంచి 15 నిమిషాలకొకటి చొప్పున బాచుపల్లి నుంచి వేవ్‌రాక్‌కు 7 ఏసీ బస్సులను ఆర్టీసీ నడుపుతోంది. కోఠి-కొండాపూర్ మార్గంలో 6, సికింద్రాబాద్-పటాన్‌చెరుకు 14 ఏసీ బస్సులను నడుపుతోంది. 25 నాన్ ఏసీ బస్సుల్లో పటాన్‌చెరు-సీబీఎస్ మార్గంలో 6, పటాన్‌చెరు-హైటెక్ సిటీ 5, సికింద్రాబాద్-మణికొండ 12, మియాపూర్-గండి మైసమ్మ మార్గంలో 2 బస్సులను నడుపుతోంది. ● తాజాగా రోడ్డెక్కిన 85 బస్సుల్లో 82 హెచ్‌సీయూ డిపో నుంచి.. మూడు కంటోన్మెంట్ డిపో నుంచి నడుస్తున్నాయి. ఈ రెండు డిపోల్లో ఛార్జింగ్ యూనిట్లు ఇటీవల పూర్తవడంతో ఛార్జింగ్‌కు, ప్రయాణవేళల మధ్య అనుసంధానం చేసుకుంటూ అధికారులు వేర్వేరు మార్గాల్లో నడుపుతున్నారు. ప్రధానంగా సికింద్రాబాద్-పటాన్‌చెరు, సికింద్రాబాద్-కొండాపూర్ వయా హైటెక్‌సిటీ, కోఠి -పటాన్‌చెరు వయా మెహదీపట్నం, సికింద్రాబాద-ఘట్‌కేసర్ వయా యాప్రాల్ మార్గాల్లో వీటిని నడుపుతున్నారు.

పొగలేని ప్రయాణం వైపుగా...

గ్రేటర్ పరిధిలో 2800లకుపైగా ఆర్టీసీ బస్సులున్నాయి. వీటిలో సుమారు 1000 బస్సులు డొక్కువే. వీటినుంచి వచ్చే పొగతో విపరీతమైన కర్బన ఉద్గారాలు విడుదలవుతున్నాయి. దీంతో సంస్థ డొక్కు బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను తెస్తోంది. 187 విద్యుత్తు బస్సులు సమకూరగా మిగిలినవి త్వరలోనే రోడ్డెక్కనున్నాయి. డీజిల్ బస్సుతో పోల్చితే విద్యుత్తు బస్సు ఏటా 70 శాతం(46 టన్నులు) కర్బన, 23 కిలోల నైట్రోజన్ ఆక్సైడ్స్ ఉద్గారాలను తగ్గిస్తుంది.

టీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీ సమస్యలు పరిష్కరించాలి



మల్లు భట్టివిక్రమార్కకు చిత్రపటాన్ని బహూకరిస్తున్న ముజీబ్ హుస్సేన్, సత్యనారాయణగౌడ్, మల్లారెడ్డి

గోల్నాక, న్యూస్‌టుడే: భాగ్యనగర్ టీఎన్జీవోస్‌కు సంబంధించి హైదరాబాద్ గచ్చిబౌలిలోని హౌసింగ్ సొసైటీ సమస్యలను పరిష్కరించాలని టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్, అసోసియేట్ అధ్యక్షుడు, బీటీఎన్జీవోస్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు డా.ముత్యాల సత్యనారాయణగౌడ్‌లు కోరారు. ఈ మేరకు సోమవారం ప్రతినిధుల బృందం.. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను కలిసి హౌసింగ్ సొసైటీ సమస్యలపై చర్చించారు. సొసైటీ అంశం ప్రభుత్వం దృష్టిలో ఉందని త్వరలోనే సమావేశాన్ని ఏర్పాటుచేసి సభ్యులందరికీ న్యాయం చేస్తామని తమకు ఉప ముఖ్యమంత్రి హామీనిచ్చినట్లు అనంతరం వారు వెల్లడించారు. టీఎన్జీవోస్ ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, హౌసింగ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి మల్లారెడ్డి, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రావు, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రతి జిల్లాలో పాలియేటివ్ కేర్ సెంటర్ల ఏర్పాటుకు కృషి



మాట్లాడుతున్న దామోదర్ రాజనర్సింహ

రాయదుర్గం: రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో ఒక పాలియేటివ్ కేర్ సెంటర్ (క్యాన్సర్ వ్యాధి ముదిరి జీవిత చరమాంకంలో ఉండే బాధితులకు ఉపశమన సేవలందించే కేంద్రం) ఏర్పాటుకు కృషి చేస్తానని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఖాజాగూడ స్పర్శ్ హాస్పిస్ పాలియేటివ్ కేర్ సెంటర్‌లో సోమవారం వరల్డ్ హాస్పిస్ అండ్ పాలియేటివ్ కేర్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి ముఖ్యఅతిథిగా హాజరూ మాట్లాడుతూ.. జీవితం చివరి ఘడియల్లో ఉన్న బాధితులకు సేవలందిస్తున్న స్పర్శ్ హాస్పిస్ వంటి కేంద్రాలు దేవాలయాల్లాంటివని పేర్కొన్నారు. సిబ్బంది అంకిత భావంతో చేస్తున్న సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. సంస్థ ట్రస్టీ సభ్యుడు డా.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. గార్డియన్ ఆఫ్ స్పర్శ్ పేరిట ఓ కార్యక్రమాన్ని ఆరంభించామని, ఇందులో భాగంగా దాతలు రూ.500 అంతకన్నా ఎక్కువ విరాళమందించవచ్చని తెలిపారు. గాయకుడు కారుణ్య, ప్రముఖ రోబోటిక్ సర్జికల్ ఆంకాలజిస్ట్ డా.చిన బాబు, రోటరీ క్లబ్ ప్రతినిధులు, బాధితుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల 'మహా ధర్నా' 16న

సుల్తాన్‌బజార్: జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)లోని ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల డిమాండ్లను పరిష్కరించాలని ఎన్‌హెచ్‌ఎం ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల సంఘం (ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామా రాజేశ్‌ఖన్నా డిమాండ్ చేశారు. క్యాడర్ ఫిక్స్ చేసి బేసిక్ వేతనం అమలు చేయాలన్నారు. డిమాండ్ల సాధనకు 16న కోఠి డీఎంహెచ్‌ఎస్ ఆవరణలోని రాష్ట్ర వైద్య, రోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ కార్యాలయం ఎదుట 'మహా ధర్నా' నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆన్‌లైన్‌లో కంప్యూటర్ శిక్షణ

అంబర్‌పేట: నేషనల్ స్కిల్ అకాడమీ ఆధ్వర్యంలో అర్హులకు ఆన్‌లైన్‌లో కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ శ్రీహరినాథ్ తెలిపారు. ఇంటర్, డిగ్రీ, పీజీ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ పూర్తిచేసిన వారు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, బిజినెస్ ఎనలిస్ట్, డేవోప్స్, ఫుల్ స్టాక్ డెవలపర్, పైథాన్, డేటా సైన్స్, బిగ్ డేటా, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్, ప్రాజెక్టు మేనేజ్‌మెంట్, బ్లాక్‌చైన్ టెక్నాలజీ, డిజిటల్ మార్కెటింగ్, జావా, ఒరాకిల్ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు. ఈ నెల 26 లోపు పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలకు www.national-skillacademy.in వెబ్‌సైట్ లేదా ఫోన్ 95058 00050.

పాత సైకిల్ ఇవ్వండి.. పేద విద్యార్థులకిస్తాం

ఈనాడు డిజిటల్,హైదరాబాద్: నిరుపయోగంగా ఉన్న పాత సైకిళ్లను తమకు అందిస్తే మరమ్మతులు చేసి నిరుపేద విద్యార్థులకు అందిస్తామని హైదరాబాద్‌కు చెందిన క్లబ్ ల్యాడ్ నెం.297 అధ్యక్షుడు రాధే శ్యామ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సంస్థ 30వ వార్షికోత్సవం సందర్భంగా 50 సైకిళ్లు రిపేర్ చేసి నిరుపేద పిల్లలకు ఇవ్వాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇందుకు అనేక సంస్థలు, ఎన్జీవోలు మద్దతు అందిస్తున్నాయన్నారు. పాత సైకిళ్లను ఇవ్వదలచిన వారు గోషామహల్ బదారి మసోనిక్ భవనంలో అందజేయాలని లేదా సమాచారం ఇస్తే తామే వచ్చి తీసుకుంటామని వివరించారు. పూర్తి వివరాలకు రాధేశ్యామ్ తివారీ 98480 50502, విజయ 92461 56496.

గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షలకు సన్నద్ధం

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న గ్రూప్-1 మెయిన్స్ రాత పరీక్షలు ఈనెల 21 నుంచి 27వరకు జిల్లాలో జరుగుతున్నాయి. వీటి నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని కలెక్టర్ గౌతమ్ ఓ ప్రకటనలో సోమవారం పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 27 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5వరకు పరీక్ష ఉంటుంది. మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు మాత్రమే కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. అభ్యర్థులు సమయ పాలన కచ్చితంగా పాటించాలని కోరారు.

పాదరక్షల రంగంలో అపార అవకాశాలు



పీజీ విద్యార్థిని నుపుర్‌కు పతకాన్ని ప్రదానం చేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఐటీ శాఖ ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, ఎఫ్‌డీడీఐ ఈడీ లోహిత్ రెడ్డి తదితరులు



కేరింతలు కొడుతున్న విద్యార్థినులు

రాయదుర్గం: లెదర్ టెక్నాలజీ, ఉత్పత్తులు, డిజైనింగ్ రంగంలో రాష్ట్రంలో అవకాశాలు ఎంతో మెరుగవుతున్నాయని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. రాయదుర్గంలోని ఫుట్ వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ స్నాతకోత్సవం సోమవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ మాట్లాడుతూ..సమాజంలో సగభాగం ఉన్న మహిళల సాధికారతతోనే వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోగలమన్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించి స్వావలంబన సాధించేలా ఎఫ్‌డీడీఐ తీర్చిదిద్దుతోందని, తద్వారా భారత్ ప్రపంచ విపణిలో ముందుండేలా చూస్తోందన్నారు. అనాదిగా మనదేశం సైన్స్, జ్ఞానాన్ని వేరుగా చూడలేదని, శాస్త్రీయ నృత్యాలు, సంగీతంలో కళ, సైన్స్ సమ్మిళితమై ఉంటాయన్నారు.

మెగా లెదర్ పార్కు ప్రతిపాదనలు.. రాష్ట్ర ఐటీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ..450మంది యువతకు ఎఫ్‌డీడీఐతోపాటు చెన్నైలోని సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లలో ప్రత్యేక శిక్షణ ఇప్పించామన్నారు. వరంగల్‌లో మెగా లెదర్ పార్కుకు స్థలం కేటాయించామని, ఏర్పాటు కోసం కేంద్రానికి ప్రతిపాదనలు పంపామన్నారు.

108 మందికి పట్టాల ప్రదానం.. ఎఫ్‌డీడీఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా.నరసింహుగారి తేజ్ లోహిత్ రెడ్డి, వాకరూ ఫుట్‌వేర్ సీఈఓ వి.నౌషాద్, ఎఫ్‌డీడీఐ లెదర్ గుడ్స్ హెచ్‌ఓడీ మహ్మద్ గుఫ్రాన్ తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ విద్యార్థినులు నవ్యశ్రీ కంచం రెడ్డి, నుపుర్ గర్గ్‌లకు బంగారు, వెండి పతకాలు ప్రదానం చేశారు. వివిధ విభాగాల్లో యూజీ, పీజీలో 108 మందికి పట్టాలు అందజేశారు.

ఆకట్టుకున్న ప్రదర్శన.. విద్యార్థినులు సృజనాత్మకంగా తయారు చేసిన పాదరక్షలు, బ్యాగుల వంటి ఉత్పత్తుల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది.

తండ్రి వ్యాపారం మరింత వృద్ధి..

-నుపుర్ గర్గ్, ఎంబీఏ, రిటైల్ అండ్ ఫ్యాషన్ మర్చండైల్స్

ఉత్తమ విద్యార్థినిగా ఎంపికవడం ఆనందంగా ఉంది. మాది హరియాణా. మా తండ్రికి టెక్స్‌టైల్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ఆ వ్యాపారాన్ని ఆన్‌లైన్‌లోకి తీసుకెళ్లి మరింత వృద్ధి చేయాలని అనుకుంటున్నాను.

పోటీ అధికం..

-నవ్యశ్రీ కంచం రెడ్డి, గ్రాడ్యుకేషన్, ఎఫ్‌డీపీ

ఏపీలోని కావలికి చెందిన నేను ఎఫ్‌డీపీ (ఫుట్ వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్) గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాను. మా విభాగంలో పోటీ అధికంగా ఉంటుంది. శ్రమించి లక్ష్యాలను సాధించాలి.

డీఎన్‌ఏలో బ్యాక్టీరియాను గుర్తించే సూక్ష్మ పరికరం

ఈనాడు, హైదరాబాద్ : అనారోగ్యం ఉన్న వారి శరీరంలో హానికరమైన బ్యాక్టీరియాను గుర్తించే పరికరాన్ని బిట్స్ హైదరాబాద్ పరిశోధకులు కనిపెట్టారు. నత్రికామ్లం(డీఎన్‌ఏ)లోని బ్యాక్టీరియాను దీనిద్వారా పరీక్షిస్తే 15 నిముషాల్లో బ్యాక్టీరియాను గుర్తిస్తుందని బిట్స్ పరిశోధన, సృజన విభాగం డీన్ డా.సంకేత్ గోయల్ తెలిపారు. బ్యాక్టీరియా ఇన్‌ఫెక్షన్‌తో బాధపడుతున్న న్యూమోనియా రోగులకు ఇది వరప్రదాయనిగా పనిచేస్తోందన్నారు. అంతర్జాతీయ జర్నల్ ఐఈఈఈకి పరిశోధన పత్రాన్ని పంపించగా ఇటీవలే ప్రచురించిందన్నారు. పరిశోధక విద్యార్థి పి.రమ్యప్రియ సూక్ష్మపరికరం ఆకృతిని తయారు చేశారు. పేటెంట్‌కు దరఖాస్తు చేశామని రెండేళ్లలో వాణిజ్యపరంగా అందుబాటులోకి రానుందన్నారు. ఎల్వీ ప్రసాద్ నేత్రవైద్యవిజ్ఞాన సంస్థ సహకారంతో కొందరు రోగుల కళ్లలోని ద్రవాలను పరీక్షించామన్నారు.సంతృప్తికర ఫలితాలొచ్చాయన్నారు.

నూతన ఆవిష్కరణలే లక్ష్యం

సంగారెడ్డి టౌన్: కెన్యా నేషనల్ ఇన్నోవేషన్ ఏజెన్సీ బృందం రెండు రోజుల పర్యటనలో భాగంగా ఐఐటీహెచ్‌ను సోమవారం సందర్శించింది. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణలే లక్ష్యంగా ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన టెక్నాలజీ ఇంక్యుబేషన్ సెంటర్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇండియా-కెన్యా ఇన్నోవేషన్ నెక్సస్ పేరుతో రూపొందించిన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కెన్యా పార్లమెంట్ సభ్యులు ఎదిత్ వెతి నైన్జ్, అమినా దికా అబ్దుల్లాహితోపాటు 11 విశ్వవిద్యాలయాల ప్రతినిధులు బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.ఎస్.మూర్తి మాట్లాడుతూ తాజాగా కుదుర్చుకున్న ఒప్పందంతో ఇరు దేశాలకు ప్రయోజనం చేకూరనుందన్నారు. సాంకేతిక, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ రంగాల్లో సంయుక్త పరిశోధనలకు మార్గం సుగమం కానుందన్నారు.

ఎల్.బి.నగర్

•ఎల్.బి.నగర్ • మలక్‌పేట

అండగా ఉంటా.. ఆందోళన అవసరం లేదు: ఎమ్మెల్యే


ఫణిగిరి కాలనీ వాసులతో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

నాగోలు, న్యూస్‌టుడే: చైతన్యపురి డివిజన్ మూసీ పరీవాహక ప్రదేశంలోని ఫణిగిరి కాలనీవాసులకు అన్నివిధాలా అండగా ఉంటానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఫణిగిరి కాలనీవాసులు ఎమ్మెల్యేతో సమావేశమయ్యారు. మూసీ పరీవాహక ప్రాంతాల్లోని కట్టడాలను కూల్చుతారంటూ జరుగుతున్న ప్రచారాలతో భయభ్రాంతులకు గురవుతున్నామని కాలనీవాసులు ఎమ్మెల్యేతో విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్నివేళలా అండగా ఉంటానని, ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా కల్పించారు. మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డి, పవన్, కడియం మోహన్‌రాజ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మూడు నెలల చిన్నారి మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ బాధితుల ఆందోళన

సైదాబాద్: మూడు నెలల బాలుడు.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఘటన మలక్‌పేట ఠాణా పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆస్మాన్‌గఢ్ పరిధిలోని ఓ ప్రైవేటు పిల్లల ఆసుపత్రికి మహబూబ్‌నగర్ జిల్లా అక్కారం గ్రామానికి చెందిన కేతావత్ హనుమంతు.. నిమోనియాతో బాధపడుతున్న తన కుమారుడిని ఈ నెల 9న తీసుకొచ్చాడు. మూడు రోజులు ఐసీయూలో చికిత్స అందించిన అనంతరం ఆదివారం జనరల్ వార్డుకు మార్చారు. సోమవారం మధ్యాహ్నం ఓ నర్స్.. ఇంజక్షన్ ఇచ్చి వెళ్లిన 10 నిమిషాల్లోనే బాబు చనిపోయాడు. వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ కుటుంబసభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న ఏసీపీ జి.శ్యాంసుందర్, ఇన్‌స్పెక్టర్లు నరేశ్, నానునాయక్ ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించారు. సెక్టార్ ఎస్సై నవీన్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

డబీర్‌పుర సీఐ నాను నాయక్ బాధ్యతల స్వీకరణ



చంచల్‌గూడ: డబీర్‌పుర నూతన సీఐగా నియమితులైన ధరావత్ నాను నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2007 బ్యాచ్‌కు చెందిన ఆయన గతంలో మలక్‌పేటలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా, స్పెషల్ బ్రాంచ్‌లో పని చేశారు. స్పెషల్ బ్రాంచ్ నుంచి డబీర్‌పుర ఠాణా సీఐగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తానని తెలిపారు.

జువెనైల్ హోమ్‌కు మంత్రి సీతక్క రాక నేడు

సైదాబాద్, న్యూస్‌టుడే: మంత్రి సీతక్క మంగళవారం సైదాబాద్‌లో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 1 గంట నుంచి 2.30 వరకు సైదాబాద్ జైల్ గార్డెన్‌లోని చిల్డ్రన్ హోమ్ ఫర్ బాయ్స్‌ను సందర్శిస్తారని తెలంగాణ జువెనైల్ వెల్ఫేర్, కరెక్షనల్ సర్వీసెస్, వెల్ఫేర్ ఆఫ్ స్ట్రీట్ చిల్డ్రన్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ మిర్జా రజా అలీబేగ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చిల్డ్రన్ హోమ్ క్యాంపస్, ఆర్చరీ అకాడమీని పరిశీలిస్తారు. అనంతరం బాలలతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తారని పేర్కొన్నారు.

ఎంపీ ఈటలకు అభినందనలు

ఎల్బీనగర్: లోక్‌సభ జాయింట్ కమిటీ ఆన్ ఆఫీసర్స్ ఆఫ్ ప్రాఫిట్ ఛైర్‌పర్సన్‌గా నియమితులైన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను సోమవారం పలువురు అభినందించారు. దిల్లీలో పార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గిరి వర్ధన్‌రెడ్డి తదితరులు దిల్లీలో ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

బాధిత కుటుంబసభ్యులకు పరామర్శ

బండ్లగూడ: అనారోగ్యంతో మృతి చెందిన బండ్లగూడకు చెందిన భారాస నేత అనరాసి శ్రీరాములు మృతదేహానికి సోమవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నివాళులర్పించారు. మృతుడి కుమారుడు, కుమార్తెలు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. నాయకులు అనంతుల రాజిరెడ్డి, తూర్పాటి చిరంజీవి, సుదర్శన్, కాటేపాక రవి తదితరులు పాల్గొన్నారు.

ఆ మార్గాల్లో.. అధిక ప్రమాదాలు

• చంచల్‌గూడ, నల్గొండ చౌరస్తా దారుల్లో తరచూ ఘటనలు

చంచల్‌గూడ, న్యూస్‌టుడే: చంచల్‌గూడ, నల్గొండ చౌరస్తా మార్గాలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ఆయా రహదారులపై ప్రయాణించాలంటే, ప్రాణాలు అరచేత పట్టుకోవాల్సిందేనని వాహనదారులు వాపోతున్నారు. మలక్‌పేట, చాదర్‌ఘాట్, డబీర్‌పుర, సైదాబాద్ ఠాణాల పరిధుల్లో ఏడాదికి సగటున 50 రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చంచల్‌గూడ చౌరస్తా నుంచి నల్గొండ చౌరస్తా వరకు, నల్గొండ చౌరస్తా నుంచి అక్బర్‌బాగ్ అగ్నిమాపక కేంద్రం వరకు.. ఈ రెండు మార్గాలు నిత్యం రోడ్డు ప్రమాదాలతో రక్తసిక్తం అవుతున్నాయి. నెలలో సగటున ముగ్గురు, నలుగురు మృత్యువాతపడుతున్నారు.


జైళ్ల డీజీ కార్యాలయం పక్కన హోటల్ ఎదుట వాహన పార్కింగ్


ఏరియా ఆసుపత్రి- నల్గొండ చౌరస్తా మార్గంలో రద్దీ

ఇటీవల ప్రధాన ఘటనలివిలా..

మలక్‌పేట రైల్వే వంతెన వద్ద ఫిబ్రవరిలో ద్విచక్ర వాహనాన్ని వెనక నుంచి డీసీఎం ఢీకొట్టడంతో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రాణాలు కోల్పోయాడు. ◆ ఏప్రిల్ నెలలో చాదర్‌ఘాట్ చమన్ మలుపులో ఓ రౌడీషీటర్ ద్విచక్ర వాహనంపై వేగంగా వెళ్తూ లారీ చక్రాల కింద పడి ప్రాణాలు కోల్పోయాడు. ◆ మే నెలలో నల్గొండ చౌరస్తా నుంచి అక్బర్‌బాగ్ వెళ్లే మార్గంలో రోడ్డుపై గుంతల కారణంగా ఆటో.. విద్యుత్తు స్తంభానికి ఢీకొనడంతో డ్రైవర్ మృతిచెందారు.

◆ వారం కిందట నల్గొండ చౌరస్తా పైవంతెన పక్కన ఒక కళాశాల ఎదుట ద్విచక్ర వాహనం నడుపుతున్న 35 ఏళ్ల యువకుడు ఆర్టీసీ బస్సు చక్రాల కింద పడి అక్కడికక్కడే చనిపోయాడు.

చాదర్‌ఘాట్, మలక్‌పేట, సైదాబాద్, డబీర్‌పుర ఠాణాల పరిధిలో ప్రమాదాలివిలా..

సం.	ప్రమాదాలు
2019	51
2020	38
2021	42
2022	35
2023	38
2024	35

(అక్టోబరు 10 వరకు)

అక్రమ పార్కింగ్.. గుంతలు

రోడ్లపై గుంతలు లేదా రహదారులపై పార్కింగ్ సమస్య కారణంగా రాత్రిపూట ఈ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జైళ్ల డీజీ కార్యాలయం ముందు నుంచి నల్గొండ చౌరస్తా వరకు నిత్యం రోడ్డుపైనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. ఈ మార్గంలో రెండు కళాశాలలు, ఓ కంటి ఆసుపత్రి, ఓ వేడుకల మందిరం, రెండు హోటళ్లు ఉండటంతో నిత్యం రద్దీ నెలకొంటుంది. పైవంతెన కింద ఖాళీ స్థలాన్ని స్థానిక వ్యాపార సంస్థలు వాహన పార్కింగ్ కేంద్రంగా వాడుకుంటున్నాయి. ఈ కారణాలతో తరచూ ప్రమాదాలు, ట్రాఫిక్ జామ్‌లతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కార చర్యలు చేపట్టడంలో జలమండలి, జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, శాంతిభద్రతల పోలీసుల మధ్య సమన్వయం కొరవడింది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.


ద్వాదశ ఆరాధన పూజల్లో కమిటీ సభ్యులు, భక్తులు

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు

వనస్థలిపురం, న్యూస్‌టుడే: సచివాలయనగర్‌లోని పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి. భక్తిశ్రద్ధలతో ఆదివారం ద్వాదశ ఆరాధన, ద్వాదశ ప్రదక్షిణలు, పండిత సన్మానం, దేవస్థానం కమిటీ ముగింపు సందేశం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఛైర్మన్ లక్ష్మయ్య, సత్యనారాయణ, గణపతి, జగదీశ్‌కుమార్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్ ఐటీఐలో దరఖాస్తుల ఆహ్వానం

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఐటీఐ అల్వాల్‌లో 2024-2025 అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌కి (ఏటీసీ) సంబంధించిన ప్రవేశాలకు ఆసక్తిగల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఐటీఐ కన్వీనర్ పి.శంకరయ్య కోరారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా హాజరై ప్రవేశం పొందాలని సూచించారు. ఇతర వివరాలకు 90596 85237, 98491 88346 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వికసిత్ భారత్‌లో భాగస్వాములు కావాలి


సభ్యత్వం అందజేస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్, న్యూస్‌టుడే: వికసిత్ భారత్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు పిలుపునిచ్చారు. హయత్‌నగర్ డివిజన్ పద్మావతి కాలనీలో సోమవారం కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎల్బీనగర్ నియోజక వర్గంలో భాజపా సభ్యత్వ నమోదుకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందన్నారు. మహిళలు, యువత, వృద్ధుల నుంచి విశేష స్పందన లభిస్తుందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే 30 వేల మందికిపైగా సభ్యత్వాలు తీసుకున్నారన్నారు. రానున్న రోజుల్లో సభ్యత్వ నమోదును మరింత వేగవంతం చేయనున్నట్లు తెలిపారు. మన్సూరాబాద్ కార్పొరేటర్ నర్సింహారెడ్డి, భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీందర్ రెడ్డి, ఓబీసీ మల్కాజిగిరి కన్వీనర్ భాస్కర్, ఎల్బీనగర్ కన్వీనర్ కొత్త రవీందర్, రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిలువెత్తు నిర్లక్ష్యం!



సైదాబాద్ ఆంధ్రాబ్యాంక్ కాలనీలో ఓవర్ హెడ్ ట్యాంక్ శిథిలావస్థకు చేరింది. పదేళ్ల క్రితమే పరిశీలించిన జలమండలి అధికారులు తొలగించకుండా వదిలేశారు. నివాసాల మధ్య ఉండటంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదం సంభవించకముందే ట్యాంక్‌ను కూల్చేయాలని స్థానికులు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, సైదాబాద్

గుర్తు తెలియని వాహనం ఢీ: యువకుడి దుర్మరణం

ఘట్‌కేసర్,న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ యువకుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘట్‌కేసర్ ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన గట్టుసాయిఇంద్రనీల్‌గౌడ్(31) తొమ్మిదినెలల క్రితం జీవనోపాధికి ఘట్‌కేసర్ మండలం అవుషాపూర్‌కు వచ్చాడు. ఓ హోటల్‌లో పని చేస్తున్నారు. సోమవారం ద్విచక్రవాహనంపై ఘట్‌కేసర్‌కు వచ్చాడు. ఇండియన్ పెట్రోల్ బంక్ దగ్గర అతివేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. తీవ్ర గాయాలతో అక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

సైదాబాద్, న్యూస్‌టుడే: ఇంటికి వేసిన తాళం పగలకొట్టి రూ.70వేల విలువ చేసే వస్తువులు అపహరించిన ఘటన సైదాబాద్ ఠాణా పరిధిలో జరిగింది. ఎస్సై ఎన్.శివకుమార్ కథనం ప్రకారం.. ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణి కాలనీ గుడిసెల ప్రాంతం సర్వీస్ సెంటర్ వెనుక వీధిలో రమావత్ అంజలి కుటుంబ నివసిస్తోంది. ఈ నెల 13న ఆమె తాతయ్య మరణించడంతో భర్త భాస్కర్‌తో కలిసి నాగార్జున సాగర్ సమీపంలోని ముల్ల తండాకు వెళ్లింది. మరుసటి రోజు ఉదయం ఇంటికి రాగా, తాళం పగులకొట్టి ఉంది. రూ.15 వేల నగదు, అర తులం బంగారు ఆభరణాలు, 25 తులాల వెండి ఆభరణాలు, చరవాణి ఎత్తుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చూపు కోల్పోతున్నవారి సంఖ్య పెరుగుతోంది: తీన్మార్ మల్లన్న


వేడుకను ప్రారంభిస్తున్న రంగరాజన్, తీన్మార్ మల్లన్న, బంగారు శ్రుతి, మధుకర్‌రెడ్డి

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: దేశంలో చూపు కోల్పోతున్నవారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. ఈ క్రమంలో ఈ రంగంలో కృషి, సేవ చేసేవారి బాధ్యత కూడా పెరుగుతుందన్నారు. సోమవారం రవీంద్రభారతిలో 'ఇట్రాడ్' (ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రైనింగ్ రిలీఫ్ రిహాబిలిటేషన్ ఆఫ్ డిసేబుల్డ్ డిస్‌ట్రెస్డ్ అండ్ డిస్‌ఇన్‌హెరిటెడ్ చిల్డ్రన్) 29వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మల్లన్న మాట్లాడుతూ.. మళ్లీ జన్మ లేదు.. పోయేటప్పుడు కట్టుకుపోయేది లేదు. కాబట్టి బతికున్నంత కాలం చరిత్రలో నిలిచిపోయేలా సేవ చేద్దామన్నారు. కేంద్రంలో అంధుడిని మంత్రిగా, అలాగే అంధుడిని అర్చకుడుగా చూడాలని ఉందన్నారు. చిలుకూరు బాలాజీ ప్రధానార్చకులు సీఎస్ రంగరాజన్ మాట్లాడుతూ.. ప్రజల్లో భక్తితో పాటు సామాజిక స్పృహను కూడా పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి, ఎంఎల్ఆర్ విద్యా సంస్థల అధినేత మర్రి లక్ష్మణ్ రెడ్డి, చిలుకూరు బాలాజీ ప్రధాన సేవకుడు పవన్ కుమార్, సామాజిక కార్యకర్త కె.మాలతీ శ్రీనివాస్‌లు మాట్లాడారు. నిర్వాహకుడు మధుకర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈసందర్భంగా 'ఆచార్య దేవో భవ' పురస్కారాలతో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అధినేతలను సత్కరించారు.

పద్యనాటకాల పరిరక్షణకు కృషి చేయాలి


కళాకారులతో ఎంకే రాము, లక్ష్మీనారాయణ, కృష్ణయ్య

గాంధీనగర్, న్యూస్‌టుడే: పౌరాణిక పద్యనాటకాలు తెలుగు భాషా సంపద అని సాహితీవేత్త ఎంకే రాము అన్నారు. ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో పద్యనాటకోత్సవాలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. రోజురోజుకూ కనుమరుగవుతున్న నాటకాల పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిది అని అన్నారు. ఈ సందర్భంగా ద్వారక మయసభల ఘట్టాన్ని ప్రేక్షకరంజకంగా ప్రదర్శించారు. దుర్యోధనుడిగా ఎం.సాళ్వాచారి, శ్రీకృష్ణుడిగా టి.బాబురాజు, అర్జునుడిగా నారాయణస్వాములు ప్రదర్శనను రక్తికట్టించారు. నిర్వహణ సంస్థ అధ్యక్షుడు లోకం కృష్ణయ్య, ఇతర ప్రముఖులు లంకా లక్ష్మీనారాయణ, వీరభోగ వసంతరాయలు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలూ పెంపొందించుకోవాలి


విద్యార్థులతో కోనసీమ ద్రవిడ సంఘం ప్రతినిధులు

గాంధీనగర్: చదువుతోపాటు నైపుణ్యాలనూ విద్యార్థులు పెంపొందించుకోవాలని కోనసీమ ద్రవిడ సంఘం ప్రతినిధులు వడ్లమాని బాలమణి, ఆదిభట్ల కామేశ్వరరావు కోరారు. విజయదశమిని పురస్కరించుకుని సంఘం ఆధ్వర్యంలో.. గతేడాది ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలు సహా స్కాలర్‌షిప్‌లు, ధ్రువపత్రాలను ప్రదానం చేసి మాట్లాడారు. బండి శ్రీనివాస్, కందాల భాస్కర రామచంద్ర, మంతా నరసింహశాస్త్రి, దక్షిణామూర్తి, అనంతలక్ష్మి, త్రిమూర్తి, డీఎల్‌వీ సత్యనారాయణ, కర్ర లక్ష్మీనారాయణ, భీమశంకరం పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలన అందరి బాధ్యత


విద్యార్థికి ధ్రువపత్రమిస్తున్న అధికారులు

ఉప్పల్, న్యూస్‌టుడే: అవినీతి నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత కావాలని బెల్ జీఎం డా. విశ్వనాథం, ఏజీఎం ప్రకాశ్‌రావు, విజిలెన్స్ అధికారి రూత్ బెక్కం పేర్కొన్నారు. దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక పురోగతికి అవినీతినే ప్రధాన అవరోధంగా మారిందన్నారు. అన్ని రంగాలలోని పౌరులందరూ అవినీతి నిర్మూలనకు కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం బీహెచ్ఈఎల్ (నాచారం) ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు అవినీతి నిర్మూలన అంశంపై వ్యాస రచన, క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ విజయ్‌కుమార్, అధికారులు మహేందర్‌రెడ్డి, ఫణిమాధురి, జి.రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడి విద్యార్థులకు రాగి జావ


సైదాబాద్, న్యూస్‌టుడే: సైదాబాద్ జోన్ పరిధి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇందుకు సంబంధించిన స్పష్టమైన ఆదేశాలు విడుదలైనప్పటికీ, పంపిణీ మార్గదర్శకాలు వెల్లడి కావాల్సి ఉంది. సైదాబాద్ జోన్‌లో 38 పాఠశాలల్లో 5,072 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఉదయం వేళల్లో పాఠశాలలకు వచ్చే విద్యార్థుల ఆకలి తీర్చడంతో పాటు పోషకాహారం అందించేందుకు జావ పంపిణీ చేస్తున్నారు. గత విద్యాసంవత్సరంలో అప్పటి ప్రభుత్వం విద్యార్థులకు సాయంత్రం రాగి జావ అందించింది. ప్రస్తుత ఏడాదిలోనూ ఎంపిక చేసిన ఏజెన్సీ ద్వారా జూన్ వరకు పంపిణీ చేశారు. జులై, ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో సరఫరా ఆగింది. దసరా సెలవుల అనంతరం ప్రారంభించాలని నిర్ణయించారు.

విద్యార్థులకు ప్రయోజనం..

సైదాబాద్ జోన్ పరిధిలోని పలు ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులంతా నిరుపేదలే. వారంతా ఉదయం ఏవిధమైన ఆహారం తీసుకోకుండా పాఠశాలలకు వస్తుంటారు. గత ప్రభుత్వం మలక్‌పేట ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు డబీర్‌పురా రైల్వే స్టేషన్ ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న 730 మంది విద్యార్థులకు పైలెట్ ప్రాజెక్టు కింద ''సీఎం బ్రేక్ ఫాస్ట్' పథకం అమలు చేసింది. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత బ్రేక్ ఫాస్ట్‌ను నిలిపేసి, రాగి జావ పంపిణీని కొనసాగించింది. వారంలో మూడు రోజులు 1 నుంచి 10వ తరగతి వరకు.. విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

పథకం అమలుకు తగిన చర్యలు..

- రాధాకృష్ణ, డిప్యూటీ డీఈవో, సైదాబాద్



ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేసేందుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. అయితే పంపిణీ కార్యక్రమంపై పూర్తి స్పష్టత రాలేదు. హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధికారి సూచనల మేరకు పాఠశాలల్లో పంపిణీకి తగిన చర్యలు తీసుకుంటాం.

'ఎన్నికల హామీలను అమలు చేయాలి'

బాగ్‌లింగంపల్లి: ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రకటించిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని కోరుతూ భారాసతో కలిసి పోరాటాలను చేపడతామని ధర్మసేన ఫౌండేషన్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు దినకర్ తెలిపారు. సోమవారం ఆయన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఎర్రవెల్లిలోని ప్రగతిభవనలో కలిశారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలో మాట్లాడుతూ..తమ ఫౌండేషన్ చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలను కేసీఆర్ అభినందించారని తెలిపారు.

కేజీకేఎస్ వార్షికోత్సవ సభ 18న

బాగ్‌లింగంపల్లి: కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్) 67వ వార్షికోత్సవ సభను ఈ నెల 18న సుందరయ్య కళానిలయంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ తెలిపారు. సోమవారమిక్కడ కేజీకేఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్లుగీత వృత్తిలో ఉపాధి అవకాశాలు అనే అంశంపై ప్రధానంగా చర్చిస్తామన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, బీసీ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు హాజరవుతున్నట్లు తెలిపారు. కేజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లం కొండ వెంకటేశ్వర్లు, నేతలు వెంకటనరసయ్య, కృష్ణస్వామి, లింగంగౌడ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

దిల్లీ భవిష్యత్తుకు లెఫ్టినెంట్ గవర్నర్ కృషి భేష్

గన్‌ఫౌండ్రి: దిల్లీ ఉజ్వల భవిష్యత్తుకు లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్‌కుమార్ సక్సేనా చేస్తున్న కృషి విశేషమని ఇంక్విలాబ్ సేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జానీ ఓమర్, ప్రధాన కార్యదర్శి హుస్సేన్ కొనియాడారు. ఆబిడ్స్‌లో వినయ్‌కుమార్ సక్సేనా చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి, మాట్లాడారు. దిల్లీని అభివృద్ధిపథంలో నడిపిస్తూ అన్ని రంగాల్లో పురోగతి సాధించేందుకు చేపడుతున్న చర్యలు అభినందనీయమని చెప్పారు.

సనాతన ధర్మంపై అవగాహన అవసరం

నల్లకుంట, న్యూస్‌టుడే: సనాతన ధర్మంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖశర్మ కోరారు. సోమవారం నల్లకుంటలోని శంకరమఠంలో 'సువర్ణ భారతీ మహోత్సవం' అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రవచనాలు చెప్పారు. శృంగేరీ పీఠం విశిష్టత, జగద్గురు భారతీ తీర్థ మహాస్వామి వైభవం గురించి భక్తులకు వివరించారు. శృంగేరీ పీఠం, అహం బ్రహ్మాస్మి ఫౌండేషన్ ప్రతినిధులు ప్రవీణ్‌కులకర్ణి, గీతామూర్తి, మరుమాముల వెంకటరమణశర్మ, శంకరమఠం ప్రధానాధికారి కృష్ణారావు పాల్గొన్నారు.

13 డివిజన్లు.. ముగ్గురే అధికారులు

పట్టణ ప్రణాళికా విభాగంలో సిబ్బంది కొరత

ఎల్బీనగర్, న్యూస్‌టుడే:

ఎల్బీనగర్ పట్టణ ప్రణాళికా విభాగంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. నియోజకవర్గ పరిధిలో ఎల్బీనగర్, హయత్‌నగర్, సరూర్‌నగర్ సర్కిళ్లు ఉన్నాయి. ఎల్బీనగర్ పరిధిలో నాలుగు, సరూర్‌నగర్‌లో ఐదు, హయత్‌నగర్‌లో నాలుగు.. మొత్తం 13 డివిజన్లు ఉన్నాయి. మూడు సర్కిళ్లకు వేర్వేరుగా పట్టణ ప్రణాళికా విభాగం ఉంది. ప్రతి డివిజన్‌కు ఒక సెక్షన్ అధికారి, ప్రతి సర్కిల్‌కు ఒక ఏసీపీ ఉండాలి. అయితే కొన్నేళ్లుగా పట్టణ ప్రణాళికా విభాగంలో సరిపడా సిబ్బంది లేక, ఇబ్బందులు తప్పడం లేదు.

ఇదీ పరిస్థితి.. గత నెలలో సర్కిల్ పట్టణ ప్రణాళిక విభాగంలో బదిలీలు జరిగాయి. బదిలీ ప్రక్రియ అనంతరం హయత్‌నగర్ సర్కిల్‌కు ఏసీపీ, ఒక సెక్షన్ అధికారి వచ్చారు. ఎల్బీనగర్‌కు ఒక ఏసీపీ మాత్రమే వచ్చారు. సెక్షన్ అధికారి రాలేదు. సరూర్‌నగర్‌లో ఇద్దరు సెక్షన్ అధికారులు, ఏసీపీ బదిలీ కాగా, ఒక్కరూ రాలేదు. మొత్తంగా ముగ్గురు ఏసీపీలు, 13 మంది టౌన్‌ప్లానింగ్ సెక్షన్ అధికారులు ఉండాల్సి ఉండగా, ఇద్దరు ఏసీపీలు, ఒక సెక్షన్ అధికారి మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. కింది స్థాయి సిబ్బంది విషయానికొస్తే.. ప్రతి డివిజన్‌కు ఒక చైన్‌మెన్‌తో పాటు న్యాక్ ఇంజినీరు ఉండాలి. కానీ హయత్‌నగర్ సర్కిల్‌లో ఒక న్యాక్ ఇంజినీరు, ఇద్దరు చైన్‌మెన్లు, ఎల్బీనగర్, సరూర్‌నగర్‌లో ఇద్దరు చొప్పున చైన్‌మెన్లు, ఒక న్యాక్ ఇంజినీరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు.


సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయం

నిర్మాణ అనుమతుల్లో జాప్యం..

జీహెచ్ఎంసీ పరిధిలో ఇంటి నిర్మాణానికి టౌన్ ప్లానింగ్ విభాగం అనుమతి తప్పనిసరి. సదరు యజమాని ఇంటి నిర్మాణ అనుమతి కోసం టీఎస్ బీపాస్‌లో దరఖాస్తు చేసుకోవాలి. సంబంధిత దరఖాస్తును టౌన్‌ప్లానింగ్ విభాగం సెక్షన్ అధికారి పరిశీలించి, అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. హయత్‌నగర్ సర్కిల్ పరిధిలో నెలకు 100కు పైగా ఇళ్ల అనుమతులకు దరఖాస్తులు వస్తుంటాయి. ఒక్కరే అధికారి ఉండటంతో నిర్మాణ అనుమతుల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించి చర్యలు తీసుకునేందుకు సైతం సమస్యలు తప్పడం లేదు. ప్రజా సమస్యల పరిష్కారానికి జీహెచ్ఎంసీ నిర్వహిస్తున్న ప్రజావాణికి అత్యధికంగా టౌన్‌ప్లానింగ్ విభాగం నుంచే ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ ఫిర్యాదులను పరిష్కరించాలంటే క్షేత్రస్థాయి పరిశీలన చేయాలి. టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారి ఒక్కరే ఉండటంతో సరైన చర్యలు తీసుకోలేకపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే సిబ్బందిని నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

చార్మినార్

• చార్మినార్ • కార్వాన్ • నాంపల్లి • గోషామహల్ • చాంద్రాయణగుట్ట • యాకుత్‌పుర • బహదూర్‌పుర

పనిచేయని ఫెంగ్విన్ ఫౌంటెయిన్



మెహిదీపట్నం, న్యూస్‌టుడే: మాసబ్‌ట్యాంక్ చౌరస్తాలోని ఫెంగ్విన్ ఫౌంటెయిన్ పనిచేయడం లేదు. కెనరాబ్యాంక్ అహ్మద్‌నగర్ శాఖ సమాజిక బాధ్యత కింద రూ.14లక్షలతో గతంలో ఈ ఫౌంటెయిన్‌ను నిర్మించింది. మూడు పక్షుల నోటి నుంచి ఎప్పుడూ నీరు వచ్చి వాహనదారులను ఆకట్టుకునేది. గత కొన్ని రోజులుగా ఆ ఫౌంటేన్ పనిచేయడం లేదు. నీరంతా నాచుపట్టి పోయింది. విద్యుత్ కేబుల్ వైర్లు తెగిపోయాయి.

రాష్ట్ర షియా సివిల్ కౌన్సిల్ అధ్యక్షుడి నియామకం



ముస్తాక్ హుస్సేన్‌కు నియామక పత్రాన్ని ఇస్తున్న హిదాయత్‌అలీ మీర్జా

దూద్‌బౌలి, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని ముస్లింల సమస్యలను పరిష్కరించడానికి కొత్తగా రాష్ట్ర షియా సివిల్ కౌన్సిల్ కమిటీని ఏర్పాటు చేసినట్లు అఖిల భారత షియా సివిల్ కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ అధ్యక్షుడు హిదాయత్‌అలీ మీర్జా పేర్కొన్నారు. సోమవారం నగరంలో నిర్వహించిన సమావేశంలోని ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర షియా సివిల్ కౌన్సిల్ అధ్యక్షుడిగా నియమితుడైన ముస్తాక్ హుస్సేన్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. షియా ముస్లిం సమాజం సమస్యల పరిష్కారానికి అంకిత భావంతో కృషి చేస్తానని ముస్తాక్ ఈ సందర్భంగా వివరించాడు.

కుల గణనలో తెలంగాణను దిక్సూచిగా నిలబెట్టాలి: వీహెచ్

హైదరాబాద్: మొట్ట మొదట కుల గణన అమలు చేసి తెలంగాణను దిక్సూచిగా నిలబెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు కోరారు. ఆయన సోమవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తొందరగా కుల గణన చేయడం వల్ల స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కలిసొస్తుందన్నారు. బీసీ వర్గానికి చెందిన ప్రధాని మోదీ పదేళ్ల అధికారంలో ఉండి బీసీలను పట్టించుకోలేదని విమర్శించారు. తన జీవితంపై ఓ పాత్రికేయుడు రాసిన పుస్తకం (వీహెచ్‌ఆర్)ను ఈనెల 26న సాయంత్రం 5 గంటలకు దిల్లీలోని ఏపీ భవన్ అంబేడ్కర్ ఆడిటోరియంలో లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్ ఆవిష్కరిస్తారని వీహెచ్ చెప్పారు.

పడకేసిన పారిశుద్ధ్యం

● స్వచ్ఛభారత్ స్ఫూర్తికి విఘాతం



కార్వాన్ జీహెచ్‌ఎంసీ కార్యాలయం

కార్వాన్, న్యూస్‌టుడే: "ఓ ఉపాధ్యాయుడు చమత్కారంగా పాఠం చెబుతూ పిల్లలూ మీలో బద్ధకం ఉన్న వారు చేతులెత్తండి అన్నాడు. ఓ పిల్లాడుతప్ప అందరు విద్యార్థులు చేతులెత్తారట.. ఆహా నీకు బద్ధకం లేదటరా.. వెరీగుడ్ అన్నాడు గురువుగారు. దానికా విద్యార్థి బద్ధకంతో చెయ్యిఎత్తలేదు సార్" అని బదులిచ్చాడు విద్యార్థి. అచ్చం ఇలానే ఉంది కార్వాన్‌లోని బల్దియా కార్యాలయం. ఒకరికి ఫిర్యాదు చేయటానికి బద్ధకమైతే మరొకరికి చెత్త ఎత్తటానికి అంటూ జీహెచ్‌ఎంసీ కార్యాలయానికి వచ్చే జనం వాపోతున్నారు. కార్యాలయ ప్రాంగణంలో ఉన్న మరుగుదొడ్లతోపాటు మూలమూలనా చెత్తకు నిలయంగా మారింది. దుర్వాసన, ఈగలు, దోమలతో ప్రజలే కాదు ఉద్యోగులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చినప్పుడు సామగ్రి గదిలో కురుస్తుండటంతో సిమెంట్ బస్తాలు ఇతర సామగ్రి తడిసి నిరుపయోగంగా మారుతున్నాయి. స్వచ్ఛభారత్ స్ఫూర్తిని ప్రజల్లో నింపాల్సిన బల్దియా ప్రాంగణాలు దానికి విరుద్ధంగా ఉంటున్నాయని అక్కడికి వచ్చే జనాలు చెబుతున్నారు. నాలుగు నెలలుగా శానిటరీ సూపర్‌వైజర్ పోస్టు ఖాళీగా ఉండటంతో పర్యవేక్షణ లేక సమస్య తీవ్రమైందని అంటున్నారు. మరోవైపు కార్వాన్ సర్కిల్ పరిధిలోని దరయాబాగ్, కార్గిల్‌నగర్, సబ్జిమండి, తాళ్లగడ్డ, లేబర్ అడ్డా, రాంసింగ్‌పురా, గణేశ్‌ఘాట్, గిర్కపల్లి, జవహర్‌నగర్, ఆంధ్రానీకార్వాన్ తదితర ప్రాంతాల్లో పర్యవేక్షణ లోపంతో పారిశుద్ధ్యం పడకేసింది. సమస్య తీవ్రంగా ఉన్నా అధికారులు మీనమేషాలు లెక్కబెడుతున్నారని జనం అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కార్యాలయాల ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని, అధికారిని నియమించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

చాంద్రాయణగుట్ట-8008573324, కార్వాన్-8008573341, నాంపల్లి-8008573338, గోషామహల్-8008573334, యాకుత్‌పుర-8008573307, చార్మినార్-9100581018

సుల్తాన్‌బజార్, కేశవగిరి, న్యూస్‌టుడే:

? కోఠిలోని సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వారు తమ వాహనాలు బయట ప్రధాన రహదారి పక్కన నిలుపుతుండటంతో స్థానికంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. **– రాజేంద్రకుమార్ వ్యాపారీ, సుల్తాన్‌బజార్**

✓ ఆసుపత్రి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. **– రాంబాబు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్**

? చాంద్రాయణగుట్ట దాస్ స్కూలు బస్తీలో వీధిదీపాలు వెలగడం లేదు. **– పాషా, చాంద్రాయణగుట్ట**

✓ సిబ్బందిని పంపి సమస్యను పరిష్కరిస్తాం.

– సత్యనారాయణరెడ్డి, డీఈ, ఎలక్ట్రికల్ విభాగం

వైభవంగా అమ్మవారి నిమజ్జన ఊరేగింపు



నయాపూల్: పూజల్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్

కేశవగిరి, న్యూస్‌టుడే: చాంద్రాయణగుట్టలో దుర్గామాత అమ్మవారి నిమజ్జన ఊరేగింపు వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన ప్రతిమలను ఆదివారం రాత్రి భారీ ట్రాలీలపై ఉంచి రంగురంగుల విద్యుత్ దీపాలంకరణలు, డప్పు వాయిద్యాలు, యువకుల నృత్యాల మధ్య ఊరేగించారు. కేశవగిరి మాతా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో గాంధీవిగ్రహం వద్ద అమ్మవారి చీర, చున్నీలను వేలం వేశారు. అమ్మవారి చీరను రూ.68 వేలకు ఆషల తేజమిది రాజ్ సొంతం చేసుకున్నారు. దుర్గామాత చున్నీని సందీప్ సూర్యవంశీ రూ.23 వేలకు పాడుకున్నారు.

చార్మినార్: చార్మినార్ పరిసర బస్తీలోని మండపాల్లో దుర్గామాత పూజలు వైభవంగా కొనసాగాయి. నయాపూల్, ఘాన్సిబజార్, చేలాపురాలో బెంగాలీల దేవీశరన్నవరాత్రోత్సవాలు ముగింపు దశగా ప్రత్యేక పూజలు సంప్రదాయంగా నిర్వహించారు. సోమవారం ట్యాంక్‌బండ్‌లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

జియాగూడ: పురానాపూల్ మూసీ నది ఒడ్డున సిమ్లాలంబు దసరా ఉత్సవ సమితి ఆధ్వర్యంలో దసరా మిలాప్ వేడుకలను వైభవంగా నిర్వహించారు. జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్, లాల్‌సింగ్, మాజీ కార్పొరేటర్లు, కుల్సుంపురా సీఐ సునీల్ తదితరులు పాల్గొని ఉత్సవ నిర్వాహకులను సన్మానించారు.

కార్వాన్: కార్వాన్‌లో ఆదివారం రాత్రి దసరా సమ్మేళన్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్వాన్ కాచి సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.పురుషోత్తంసింగ్, బి.తిలక్‌సింగ్ పాల్గొని మాట్లాడారు. తరతరాలుగా తమ సామాజిక వర్గం అమ్మవారిని దసరా వేడుకల్లో ప్రత్యేకంగా పూజిస్తామని చెప్పారు.



బెంగాలీల సంప్రదాయ ఆటాపాటలు



పూజలో రాష్ట్ర బెంగాలీ సమితి అధ్యక్షుడు రవిదీపాంకర్‌పాల్

ధ్రువపత్రాల దరఖాస్తులను 21 లోగా పరిష్కరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: మీ సేవ ద్వారా వివిధ ధ్రువ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వాటన్నింటిని 21లోగా పరిష్కరించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తహసీల్దార్లను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన 156 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. మీ సేవ ఆపరేటర్లతో ప్రతినెలా తహసీల్దార్లు సమావేశం ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేయాలని కోరారు. అదనపు కలెక్టర్లు కదిరవన్, ఇ.వెంకటాచారి, ఆర్డీఓ మహిపాల్, దశరత్‌సింగ్, జి.ఆశన్న, పెరిక యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

దిల్లీ ఉజ్వల భవిష్యత్తుకు లెఫ్టినెంట్ గవర్నర్ కృషి భేష్



వినయ్‌కుమార్ సక్సేనా చిత్రాలతో నేతలు

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: దేశ రాజధాని దిల్లీ ఉజ్వల భవిష్యత్తుకు అక్కడి లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్‌కుమార్ సక్సేనా చేస్తున్న కృషి విశేషమని ఇంక్విలాబ్ సేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జానీ ఓమర్, ప్రధాన కార్యదర్శి ఎంఎం హుస్సేన్ కొనియాడారు. ఈ మేరకు ఆబిడ్స్‌లో వినయ్‌కుమార్ సక్సేనా చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దిల్లీని అభివృద్ధిపథంలో నడిపిస్తూ అన్ని రంగాల్లో పురోగతి సాధించేందుకు చేపడుతున్న చర్యలు అభినందనీయమని చెప్పారు. ఆరోగ్యం, రవాణా, ఇందన సదుపాయాలలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకురావడంలో ఆయన ఆదర్శమన్నారు.

ఫాంహౌస్ నిర్వాహకులు బాధ్యతగా మెలగాలి

మొయినాబాద్, న్యూస్‌టుడే: ఫాంహౌస్ నిర్వాహకులు బాధ్యతగా మెలగాలని రాజేంద్రనగర్ జోన్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ సూచించారు. గ్రామపంచాయతీల నుంచి నిర్వాహకులు ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలన్నారు. మొయినాబాద్ మండలంలోని ఫాంహౌస్ నిర్వాహకులతో సోమవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ఫాంహౌస్‌ల్లో ఈవెంట్‌లు నిర్వహించే వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, సౌండ్‌సిస్టం, మద్యం వినియోగానికి ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలన్నారు. ఈవెంట్‌కు సంబంధించిన పూర్తి వివరాలను స్థానిక పోలీసులకు ఇవ్వాలని ఆదేశించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఫాంహౌస్‌కు వచ్చే ప్రతి ఒక్కరి వివరాలను సేకరించాలని సూచించారు. సమావేశంలో చేవెళ్ల ఏసీపీ కిషన్, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ జి.పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్సైలు నర్సింహారావు, ముజాఫర్‌అలీ, నహీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు.. రోగుల అవస్థలు



సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: సుల్తాన్‌బజార్ ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రధాన ప్రవేశ ద్వారం ముందున్న రోడ్డు పరిస్థితి అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. రహదారిపై గుంతలు పడి అధ్వానంగా మారింది. అధికారులు, ఆసుపత్రి వర్గాలు పట్టించుకోకపోవడంతో చికిత్స కోసం వచ్చే గర్భిణీలు, బాలింతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

సనాతన ధర్మంపై అవగాహన అవసరం



ప్రవచనాలు చెప్తున్న సామవేదం షణ్ముఖశర్మ

నల్లకుంట, న్యూస్‌టుడే: సనాతన ధర్మంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖశర్మ కోరారు. సోమవారం నల్లకుంటలోని శంకరమఠంలో 'సువర్ణ భారతీ మహోత్సవం' అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రవచనాలు చెప్పారు. శృంగేరీ పీఠం విశిష్టత, జగద్గురు భారతీ తీర్థ మహాస్వామి వైభవం గురించి భక్తులకు వివరించారు. శృంగేరీ పీఠం, అహం బ్రహ్మాస్మీ ఫౌండేషన్ ప్రతినిధులు ప్రవీణ్‌కు లకర్ణి, గీతామూర్తి, మరుమాముల వెంకటరమణశర్మ, శంకరమఠం ప్రధానాధికారి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'సిందూర్ ఖేలా' వేడుక



మెహిదీపట్నం, న్యూస్‌టుడే: బెంగాలీ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1లోని బంజారా ఫంక్షన్‌హాల్‌లో జరుగుతున్న దసరా నవరాత్రి వేడుకలు ముగిశాయి. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు సోమవారం జగన్మాతకు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా జరిగిన 'సిందూర్ ఖేలా' వేడుకలో సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు ఉత్సాహంగా పాల్గొని సందడి చేశారు నిర్వహించారు. ప్రేమ, ఐక్యత, స్త్రీ శక్తికి ప్రతీకగా దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని వారు చెప్పారు.

దేశంలో చూపుకోల్పోతున్న వారి సంఖ్య పెరుగుతోంది



వేడుక ప్రారంభిస్తున్న రంగరాజన్, తీన్మార్ మల్లన్న, బంగారు శృతి, మధుకర్‌రెడ్డి

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: దేశంలో చూపుకోల్పోతున్నవారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందని శాసనమండలి సభ్యుడు తీన్మార్ మల్లన్న అన్నారు. కాబట్టి ఈ రంగంలో కృషి, సేవ చేసే వారి బాధ్యత కూడా పెరుగుతుందన్నారు. సోమవారం రాత్రి రవీంద్రభారతిలో 'ఇట్రాడ్' (ఇనిస్టిట్యూట్ ఫర్ ట్రైనింగ్ రిలీఫ్ రిహాబిలిటేషన్ ఆఫ్ డిసెబుల్డ్ డిస్ట్రెస్డ్ అండ్ డిస్ఇన్‌హెరిటెడ్ చిల్డ్రన్) 29వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. మళ్లీ జన్మ లేదు.. పోయేటప్పుడు కట్టుకుపోయేది లేదు. కాబట్టి బతికున్నంత కాలం చరిత్రలో నిలిచిపోయేలా సేవ చేద్దామన్నారు. కేంద్రంలో అంధుడిని మంత్రిగా, అలాగే అంధుడిని అర్చకుడుగా చూడాలని ఉందన్నారు. చిలుకూరు బాలాజీ ప్రధానార్చకులు సీఎస్ రంగరాజన్ మాట్లాడుతూ.. ప్రజల్లో భక్తితో పాటు సామాజిక స్పృహను కూడా పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, ఎంఎల్‌ఆర్ విద్యా సంస్థల అధినేత మర్రి లక్ష్మణ్‌రెడ్డి, చిలుకూరు బాలాజీ ప్రధాన సేవకుడు పవన్‌కుమార్, సామాజిక కార్యకర్త కె.మాలతీ శ్రీనివాస్‌లు మాట్లాడారు. నిర్వాహకుడు మధుకర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా 'ఆచార్య దేవో భవ' పురస్కారాలతో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అధినేతలు నేమాని బాలత్రిపుర సుందరి, మల్లంపాటి విజయలక్ష్మీ, పి.స్నేహలత, తుకమ్మ కస్తూరిరెడ్డి, మంద అన్నపూర్ణ, చిమ్ముల జైపాల్‌రెడ్డి, చిమ్ముల పుష్పలత దంపతులు, వి.ఉమామహేశ్వరి, వి.సుధాహరికృష్ణన్, కె.దుర్గాకుమార్‌రెడ్డి తదితరులకు సత్కరించారు. ముందుగా విద్యార్థుల సాంస్కృతిక అంశాలు ఆకట్టుకున్నాయి.

కారుణ్య నియామకాల సమస్య పరిష్కరించాలని వినతి



కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో భేటీ అయిన ఎంపీ ఈటల

కంటోన్మెంట్, న్యూస్‌టుడే: కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో సోమవారం ఎంపీ ఈటల రాజేందర్ దిల్లీలో భేటీ అయినట్లు ఆయన కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కారుణ్య నియామకాల విషయంలో అయిదు శాతం సీలింగ్‌ను ఎత్తివేసి సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో మృతిచెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులను నియమించేలా చర్యలు తీసుకోవాలని ఈటల మంత్రిని కోరినట్లు తెలిపారు.

'హిందూ దేవాలయాల ధ్వంసం వెనుక కుట్ర'

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: భాగ్యనగరంలోని హిందూ దేవాలయాల ధ్వంసం వెనక భారీ కుట్ర దాగి ఉందని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) అధికార ప్రతినిధి పి.బాలస్వామి అనుమానం వ్యక్తం చేశారు. గత కొద్ది రోజులుగా భాగ్యనగరంలోని హిందూ ఆలయాలను కొందరు దుండగులు ధ్వంసం చేస్తున్నారని, మతసామరస్యాన్ని దెబ్బతీయడానికి ఇలాంటి కుట్రలు పన్నుతున్నారని సోమవారం ఆయన ఓ ప్రకటనలో ఆరోపించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో దుర్గామాత విగ్రహం పగులగొట్టిన వ్యక్తికి మతిస్థిమితం లేదని పోలీసులు చెప్పారని పేర్కొన్నాడు. సికింద్రాబాద్ కుమ్మరి వాడలోని అమ్మవారి దేవాలయం ధ్వంసం లాంటి ఘటనలు చూస్తే వీటి వెనుక పెద్ద కుట్ర జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని బాలస్వామి డిమాండ్ చేశారు.

విగ్రహాల ధ్వంసం ఘటనలపై విచారణ జరిపించాలి

చాంద్రాయణగుట్ట, న్యూస్‌టుడే: నగరంలో వరుసగా జరుగుతున్న విగ్రహాల ధ్వంసం సంఘటనలపై సమగ్ర విచారణ జరిపించాలని మాజీ కార్పొరేటర్ పాశం సురేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలో రక్షపురం, ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ప్రాంతాల్లో, తాజాగా సికింద్రాబాద్ కుమ్మరి గూడలో అమ్మవారి విగ్రహాలను దుండగులు ధ్వంసం చేశారని పేర్కొన్నారు. నగరంలో ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు కొన్ని శక్తులు విగ్రహాల విధ్వంసానికి పాల్పడుతున్నాయని ఆరోపించారు.

ఫీజుల బకాయిలు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్

గన్‌ఫౌండ్రి, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు బకాయిలు, ఉపకార వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పెండింగ్ బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తుందని, దీని వల్ల పేద విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితులు తలెత్తాయని ఆందోళన వ్యక్తం చేశారు.

రాజేంద్రప్రసాద్‌కు సినీ, రాజకీయ నాయకుల ఓదార్పు



గాయత్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేటీఆర్

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కుమార్తెను కోల్పోయిన సినీనటుడు రాజేంద్రప్రసాద్‌ను సోమవారం పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఓదార్చారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, వివేకానంద్‌గౌడ్, కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, నటులు శ్రీకాంత్, జీవిత, రాజశేఖర్, దర్శకుడు అనిల్ రావిపూడి కేపీహెచ్‌బీ 13వ ఫేజ్‌లోని ఇందూ విల్లాస్‌లోని రాజేంద్రప్రసాద్ నివాసంలో ఆయనతోపాటు ఆయన కటుంబసభ్యులను పరామర్శించారు. కేటీఆర్ మాట్లాడుతూ..ఎన్నో వినోదాత్మక చిత్రాల్లో ప్రేక్షకులను తన నటనతో నవ్వించిన రాజేంద్రప్రసాద్ కుమార్తె గాయత్రి అకాల మరణం కలచివేసిందన్నారు. తమ కుటుంబం, పార్టీ తరపున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు తెలిపారు.

ప్రయాణికుల రక్షణకు ఆర్పీఎఫ్ పోలీసుల కృషి

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: ప్రయాణికుల భద్రతకు ఆర్పీఎఫ్ పోలీసులు కృషి చేస్తున్నారని సికింద్రాబాద్ డివిజనల్ సీనియర్ సెక్యూరిటీ కమిషనర్ దేబాష్మితా ఛటోపాధ్యాయ బెనర్జీ ఓ ప్రకటనలో తెలిపారు. ఆపరేషన్ జీవన్ రక్షలో భాగంగా రైల్వేస్టేషన్లలో తమ సిబ్బంది అప్రమత్తంగా ఉండటమే కాకుండా ఆపదలో ఉన్న ప్రయాణికులను రక్షిస్తున్నారని పేర్కొన్నారు. 2023లో ఆరుగురిని, 2024లో నలుగురు ప్రయాణికుల ప్రాణాలను ఆర్పీఎఫ్ సిబ్బంది కాపాడినట్లు తెలియజేశారు. లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ పి.రాజశేఖర్, కానిస్టేబుల్ విశ్వజిత్‌కుమార్‌లు ఈ నెల 13న లింగంపల్లి రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫాంపై విధులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్-పూర్ణ ఎక్స్‌ప్రెస్ రైలు లింగంపల్లి రైల్వేస్టేషన్‌లోని 1వ నంబర్ ప్లాట్‌ఫాంకు చేరుకొని.. తిరిగి బయలుదేరే సమయంలో కదులుతున్న రైల్లో ఎక్కేందుకు ఓ మహిళా ప్రయత్నించింది. మెట్ల మీద నుంచి కాలు జారడంతో కిందపడుతుండగా.. గుర్తించిన కానిస్టేబుళ్లు బయటకు లాగారు. దీంతో ఆమెకు ప్రమాదం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న సెక్యూరిటీ కమిషనర్ కానిస్టేబుళ్లతో మాట్లాడి అభినందించారు.

కోడలిపై వేడి నీళ్లు పోసిన అత్త

మాదన్నపేట, న్యూస్‌టుడే: కోడలితో గొడవపడి వేడి నీరు పోసిన అత్తా, ఆడబిడ్డలపై సంతోష్‌నగర్ ఠాణాలో సోమవారం కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన నజియా బేగం(33)కు సంతోష్‌నగర్‌కు చెందిన వ్యక్తితో వివాహమైంది. భర్త ప్రస్తుతం దుబాయ్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అత్తతో సయోధ్య కుదరక కోడలు అక్కడే మరో అద్దె ఇంట్లో ఉంటోంది. అయితే పిల్లలు నానమ్మ దగ్గరికి వెళ్లడంతో వారిని తీసుకొచ్చేందుకు ఆదివారం నజీయా వెళ్లింది. అక్కడ అత్త, ఆడబిడ్డలతో ఘర్షణ జరగడంతో బాధితురాలిపై వారిద్దరు వేడి నీరు పోశారు. 40 శాతం కాలిన గాయాలతో ప్రస్తుతం కోడలు ఓవైసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. బాధితురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

కేజీకేఎస్ వార్షికోత్సవ సభ 18న

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్) 67వ వార్షికోత్సవ సభను ఈ నెల 18న సుందరయ్య కళానిలయంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ తెలిపారు. సోమవారం ఇక్కడ కేజీకేఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్లుగీత వృత్తిలో ఉపాధి అవకాశాలు అనే అంశంపై ప్రధానంగా చర్చిస్తామన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, బీసీ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు హాజరవుతున్నట్లు తెలిపారు. కేజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, నేతలు వెంకట నరసయ్య, కృష్ణస్వామి, లింగంగౌడ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త కుప్పలు.. ప్రజలకు తిప్పలు



విజయనగర్‌కాలనీ ఇందిరానగర్‌లో..

ఆసిఫ్‌నగర్, న్యూస్‌టుడే: రహదారుల వెంట పెద్ద ఎత్తున చెత్త కుప్పలు పేరుకుపోతున్నాయి. చెత్తను శుభ్రం చేస్తున్నామని బల్దియా పారిశుద్ధ్య విభాగం అధికారులు చెబుతున్నారు.. కానీ క్షేత్ర స్థాయిలో మాత్రం అది కనిపించడం లేదు. గత వారం రోజులుగా ప్రధాన రహదారుల్లో చెత్త గుట్టలు కనిపిస్తున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం గ్రేటర్ మెహిదీపట్నం సర్కిల్ పరిధిలో 86 గార్బేజీ వర్నబుల్ పాయింట్లు(జీవీపీ) ఉన్నటు తెలుస్తోంది. దాదాపు 350-400 మెట్రిక్ టన్నుల చెత్త ప్రతి రోజు వెలువడుతోంది. చెత్త తరలించేందుకు సరిపడా వాహనాలు, తగినన్ని స్వచ్ఛ ఆటోలు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని సిబ్బంది చెబుతున్నారు. గుడిమల్కాపూర్, మెహిదీపట్నం, విజయనగర్‌కాలనీ, ఆసిఫ్‌నగర్-జిర్రా రోడ్డు, మల్లేపల్లి, సీతారాంబాగ్, ఆగాపురా, నాంపల్లి ఆస్పత్రి ప్రాంతాల్లోని జీవీపీ పాయింట్ల వద్ద చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు, పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను ఎప్పటికప్పుడు తరలించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మెహిదీపట్నంలో దేవుని కుంట వద్ద..

పద్యనాటకాల పరిరక్షణ బాధ్యత అందరిది



కళాకారులతో ఎంకే రాము, లక్ష్మీనారాయణ, కృష్ణయ్య

గాంధీనగర్, న్యూస్‌టుడే: పౌరాణిక పద్యనాటకాలు తెలుగు భాషా సంపద అని సాహితీవేత్త ఎంకే రాము అన్నారు. ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో.. సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో పద్యనాటకోత్సవాలను ఆయన ముఖ్యఅతిథిగా ప్రారంభించి మాట్లాడారు. రోజురోజుకూ కనుమరుగవుతున్న నాటకాల పరిరక్షణ బాధ్యత ప్రతిఒక్కరిదీ అన్నారు. ఈ సందర్భంగా ద్వారక మయసభల ఘట్టాన్ని ప్రేక్షకరంజకంగా ప్రదర్శించారు. దుర్యోధనుడిగా ఎం.సాళ్వాచారి, శ్రీకృష్ణుడిగా టి.బాబురాజు, అర్జునుడిగా నారాయణస్వామిలు ప్రదర్శనను రక్తికట్టించారు. నిర్వహణ సంస్థ అధ్యక్షుడు లోకం కృష్ణయ్య, ప్రముఖులు లంకా లక్ష్మీనారాయణ, వీరభోగ వసంతరాయలు తదితరులు పాల్గొన్నారు.

పార్శిల్‌లో నిషేధిత వస్తువులని బెదిరించి రూ.20 లక్షలు స్వాహా

నారాయణగూడ, న్యూస్‌టుడే: నిషేధిత వస్తువులతో పార్శిల్ వచ్చిందని బెదిరించి రూ.20 లక్షలు దోచేశారంటూ ఓ బాధితురాలు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన ప్రైవేటు ఉద్యోగినికి ఓ వ్యక్తి స్కైప్ వీడియో కాల్ చేసి మీ ఆధార్ కార్డు సాయంతో ముంబయి నుంచి ఇరాన్‌కు ఫెడెక్స్‌లో పార్శిల్ పంపించారని, అందులో నిషేధిత వస్తువులున్నాయని, ఆమెపై కేసు నమోదు అయిందని బెదిరించాడు. ఆతర్వాత ఆమె బ్యాంకు వివరాలు తెలుసుకున్నాడు. బాధితురాలు తన ఖాతాలో డబ్బు లేవని చెప్పింది. దాంతో ఉద్యోగినికి వ్యక్తిరుణం కింద రూ.20 లక్షలు ఇప్పించాడు. ఆ మొత్తాన్ని తన ఖాతాకు బదిలీ చేయించుకొని అందుబాటులో లేకుండా పోయాడు. మోసపోయినట్లు గ్రహించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

రాజేంద్రనగర్

•రాజేంద్రనగర్ • షాద్‌నగర్ • చేవెళ్ల

మహిళా సమాఖ్యకు భవనం మంజూరు చేయాలని విజ్ఞప్తి



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న బుగ్గోనిగూడ గ్రామస్థులు

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ మండలం బుగ్గోనిగూడలో మహిళల సౌకర్యార్థం మహిళా సమాఖ్య భవనాన్ని మంజూరు చేయాలని గ్రామస్థులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం వారు వీర్లపల్లి శంకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో 10 మహిళా సంఘాలుండగా 118 మంది అందులో సభ్యులుగా ఉన్నారని వివరించారు. ప్రతి నెలా సమావేశం నిర్వహించేందుకు ఇబ్బందిగా ఉందని చెప్పారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో శ్రావణ్‌కుమార్, నర్సింహులు, సాలయ్య, శ్రీనివాస్, ప్రభాకర్ తదితరులున్నారు.

బుద్ధిబలంతో ఏదైనా సాధించవచ్చు: సబితా రెడ్డి



మూడు చక్రాల సైకిల్‌ను కృష్ణకు అందజేస్తున్న సబితాఇంద్రారెడ్డి

మొయినాబాద్, న్యూస్‌టుడే: అంగవైకల్యం కేవలం శరీరానికి మాత్రమేనని, బుద్ధిబలంతో ఏదైనా సాధించవచ్చని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. మొయినాబాద్ మండలం నక్కలపల్లికి చెందిన మంగళారం కృష్ణకు మధుమేహం తీవ్రత కారణంగా వైద్యులు రెండు కాళ్లను తొలగించారు. సమస్య తెలుసుకున్న సబితారెడ్డి మానవత్వంతో స్పందించి కృష్ణతో పాటు మరో దివ్యాంగురాలికి మూడు చక్రాల ఛార్జింగ్ సైకిల్‌ను సొంత ఖర్చుతో కొనుగోలు చేసి అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆనంద్, శాపూరం కృష్ణాగౌడ్, అంజయ్యగౌడ్, సుదర్శన్‌రెడ్డి, బాలరాజు, రాజు, షేక్ నయీం, సలీం, శ్రీకాంత్, జైపాల్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన భాజపా నాయకులు



విశ్వేశ్వర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైభవ్‌రెడ్డి

చేవెళ్ల, న్యూస్‌టుడే: ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భాజపా యువనాయకుడు డా.వైభవ్ రెడ్డి, నాయకులు మాణిక్య రెడ్డి, శ్రీశైలంయాదవ్, శ్రీనివాస్, రామకృష్ణ తదితరులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి దసరా శుభాకాంక్షలు తెలిపారు.

చలామణిలోనే పది నాణేలు

కొందుర్గు: పది రూపాయల నాణేలు చలామణిలోనే ఉన్నాయని, చెల్లుబాటు కావని జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని యూనియన్ బ్యాంక్ కొందుర్గు శాఖ మేనేజర్ వెంకటేశ్ స్పష్టం చేశారు. పది నాణేలు చెల్లుతాయని సూచికలను సోమవారం మండల కేంద్రంలోని పలు వ్యాపార సముదాయాల వద్ద ఏర్పాటు చేయించారు. రూ. పది నాణేలను తిరస్కరించిన వారిపై ఆర్బీఐ ఆదేశాల మేరకు చట్టప్రకారం చర్యలు చేపడతామని ఆయన హెచ్చరించారు.

నేటి నుంచి పశువైద్య శిబిరాలు

కొత్తూరు: పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు ఈ నెల 15 నుంచి నవంబర్ 14 వరకు ఆయా గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు పశు వైద్యాధికారి స్వర్ణ సోమవారం తెలిపారు. పాడి రైతులు పశువులను సీజనల్ వ్యాధులు రాకుండా ఈ శిబిరాల్లో టీకాలు వేయించాలని ఆమె సూచించారు.


మొయినాబాద్: నవంబరు 11వరకు మొయినాబాద్ మండలంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు మొయినాబాద్, అజీజ్‌నగర్ వైద్యాధికారులు డాక్టర్ అహ్మద్, డాక్టర్ దేవిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా తేదీల్లో గ్రామాల్లో ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు చేసి టీకాలు వేయనున్నట్లు వెల్లడించారు.

కాసం బంపర్ డ్రా విజేతల ప్రకటన

షాద్‌నగర్, న్యూస్‌టుడే: కాసం ఫ్యాషన్ షాద్‌నగర్ దసరా మహోత్సవంలో భాగంగా ప్రకటించిన 'ప్రతి ఊరికి ఒక బైక్ బంపర్ డ్రా విజేతలను సోమవారం ప్రకటించారు. కొడంగల్‌కు చెందిన లావణ్య కూపన్ నంబర్ సీఎ33032159/24-1 విజేతగా నిలిచారు.

శంకర్‌పల్లి: కాసం ఫ్యాషన్ శంకర్‌పల్లి దసరా మహోత్సవంలో భాగంగా ప్రకటించిన 'ప్రతి ఊరికి ఒక బైక్ బంపర్ డ్రా విజేతలను సోమవారం ప్రకటించారు. కొత్తపల్లికి చెందిన మహమ్మద్ రఫీక్ కూపన్ నంబర్ సీఏ4709447/10/24 విజేతగా నిలిచారు.

చెట్టు కాదు.. పొదు



ఈ చిత్రంలోని చెట్టును చూసి క్రిస్మస్ ట్రీ అనుకుంటే పొరపాటే. మైలార్‌దేవ్‌పల్లి పల్లెచెరువు హరిజనబస్తీలోని అమెజాన్ టవర్‌కు తీగజాతి మొక్క అల్లుకుని ఏపుగా పెరిగింది. దూరం నుంచి చూస్తే అది చెట్టులా కనిపిస్తోంది. స్థానికులతో పాటు ఈ మార్గంలో శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే వారిని ఈ చెట్టు ఆకర్షిస్తోంది.

–న్యూస్‌టుడే, కాటేదాన్

నిద్దరోతున్న నిఘా నేత్రాలు

● నిర్వహణ లేక పనిచేయని సీసీ కెమెరాలు ● పోలీసులకు సవాలుగా కేసుల విచారణ



అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు

చేవెళ్ల గ్రామీణం, న్యూస్‌టుడే:

★ చేవెళ్ల బస్టాండులో ఇటీవల పట్టపగలే నగదు, బంగారం, ఫోన్ చోరీ జరిగింది. ప్రయాణికులు బస్సెక్కేటపుడు గుంపులుగా ఉన్న సమయంలో దొంగలు చోరీలకు పాల్పడుతున్నారు. బాధితులు వెంటనే గుర్తించినప్పటికీ సీసీ కెమెరాలు పనిచేయక పోవడంతో దొంగలను పట్టుకోలేక బస్సు ఆపి ప్రతి ఒక్కరిని తనిఖీ చేయాల్సి వచ్చింది.

★ కమ్మెట గ్రామంలో ఒకే రోజు మూడిళ్లలో చోరీ జరిగింది. గ్రామంలో సీసీ కెమెరాలు పనిచేసి ఉండటంతో దొంగలు ఆచూకీ దొరకలేదు. రోడ్డుపైన గుర్తు తెలియని వాహనాలు ఢీకొన్న ప్రమాదాల్లో పలువురు మృతి చెందిన సందర్భాల్లోనూ ఆ వాహనాల వివరాలు తెలియక పోలీసులు కేసులను త్వరగా ఛేదించలేక పోతున్నారు.

ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమనేది నానుడి. ఎన్నో అంతుచిక్కని కేసులను సీసీ కెమెరా ఫుటేజీలతో పరిష్కరించిన సందర్భాలున్నాయి. దాతల సహకారంతో పలు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినప్పటికీ వాటి నిర్వహణ సరిగా లేకపోవడంతో అవి పనిచేయడం లేదు. ఈ క్రమంలోనే గ్రామాల్లో జరుగుతున్న నేరాల్లో నిందితులను పట్టుకోవడానికి పోలీసులకు సమయం పడుతోంది. 2018లో చేవెళ్ల మండలంలోని 37 గ్రామ పంచాయతీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అప్పట్లో ఎన్నికల సమయం కావడంతో ఏ గ్రామంలో ఎక్కడ ఏ సంఘటన జరిగినా తమకు సమాచారం ఉండాలని పోలీసులు సీసీ కెమెరాల ఏర్పాటుపై దృష్టి పెట్టారు. పోలీసుశాఖ ప్రోత్సాహం, దాతల సహకారంతో గ్రామాల్లోని కూడళ్లు, దేవాలయాల వద్ద వాటిని ఏర్పాటు చేసి పోలీస్‌స్టేషన్లకు అనుసంధానం చేశారు. ఎన్నికల తర్వాత పోలీసులు, అధికారులు సీసీ కెమెరాల నిర్వహణను పట్టించుకోకపోవడంతో అవి పనిచేయడం లేదు. గ్రామాల్లో చోరీలు జరుగుతున్నా నిందితుల జాడ తెలియడం లేదని, వెలుగులోకి రాని చిన్న చిన్న దొంగతనాలు చాలా ఉంటాయని ప్రజలు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించి సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించడం గానీ, కొత్త వాటిని గానీ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి

– భూపాల్ శ్రీధర్, సీఐ, చేవెళ్ల

గ్రామాల్లో అవగాహన కల్పించి దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటాం. ఇవి ఏర్పాటు చేసుకుంటే నేరాలు జరిగినపుడు త్వరగా నిందితులను పట్టుకోవడానికి అవకాశం ఉంటుంది. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ వాటి నిర్వహణ సరిగా లేక చాలా చోట్ల పనిచేయడం లేదు. అలాకాకుండా జాగ్రత్తలు తీసుకునేలా చూస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

రాజేంద్రనగర్:	8008573330
శంకర్‌పల్లి:	8008573266
షాద్‌నగర్:	8008573907
శంషాబాద్:	9963096353

శంషాబాద్, కొందుర్గు, న్యూస్‌టుడే:

? శంషాబాద్‌లోని సంజయ్‌వాడ, పోచమ్మగడ్డ, బృందావన్ టౌన్‌షిప్ బస్తీల్లో వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉంది. అవి గుంపులుగా సంచరిస్తూ ఆ మార్గాల్లో వచ్చిపోయేవారిపై దాడికి యత్నిస్తుండడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు. – సిద్దేశ్వర్, సంజయ్‌వాడ

✓ శంషాబాద్ మున్సిపల్ పరిధిలో రెండు వేలకు పైగా వీధి కుక్కలు సంచరిస్తున్నాయి ఇప్పటికే వెయ్యికిపైగా శునకాలను పట్టుకుని శస్త్ర చికిత్సలు, వ్యాక్సిన్ చేశాం. వీటి శునకాల సంతానం పెరగకుండా చర్యలు తీసుకుంటున్నాం. – వి.లక్ష్మయ్య, పారిశుద్ధ్యవిభాగం ఇన్‌స్పెక్టర్, శంషాబాద్

? కొందుర్గు మండలం శ్రీరంగాపూర్ గ్రామం మధ్యలో పల్లె ప్రకృతి వనం ఉంది. అందులో మొక్కలు ఏపుగా పెరగడంతో విషసర్పాలు వస్తున్నాయి. దీంతో చుట్టుపక్కల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

–సయ్యద్ సాదిక్, శ్రీరంగాపూర్

✓ పల్లె ప్రకృతి వనం నుంచి పాములు వస్తున్న విషయం మా దృష్టికి వచ్చింది. దాని చుట్టూ ప్రహరీ నిర్మించేందుకు కృషి చేస్తాం.

– వి.ఎల్.అనురాధ, ఎంపీడీవో, కొందుర్గు

చూపు కోల్పోతున్నవారి సంఖ్య పెరుగుతోంది: తీన్మార్ మల్లన్న



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రంగరాజన్, తీన్మార్ మల్లన్న, బంగారు శృతి, మధుకర్‌రెడ్డి

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: దేశంలో చూపు కోల్పోతున్నవారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. ఈ క్రమంలో ఈ రంగంలో కృషి, సేవ చేసేవారి బాధ్యత కూడా పెరుగుతుందన్నారు. సోమవారం రవీంద్రభారతిలో 'ఇట్రాడ్' (ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రైనింగ్ రీసెర్చ్ రిహాబిలిటేషన్ ఆఫ్ డిసెబుల్డ్ డెవలప్‌మెంట్ అండ్ డిసేబ్‌హెరిటేజ్ చిల్డ్రన్) 29వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మల్లన్న మాట్లాడుతూ.. మళ్లీ జన్మ లేదు.. పోయేటప్పుడు కట్టుకుపోయేది లేదు. కాబట్టి బతికున్నంత కాలం చరిత్రలో నిలిచిపోయేలా సేవ చేద్దామన్నారు. కేంద్రంలో అందరిని మంత్రిగా, అలాగే అందరిని అర్హుడనుగా చూడాలని ఉందన్నారు. చిలుకూరు బాలాజీ ప్రధాన అర్చకులు సీఎస్ రంగరాజన్ మాట్లాడుతూ.. ప్రజల్లో భక్తితో పాటు సామాజిక స్పృహను కూడా పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, ఎంఎల్ఆర్ విద్యా సంస్థల అధినేత మర్రి లక్ష్మణ్ రెడ్డి, చిలుకూరు బాలాజీ ప్రధాన సేవకుడు పవన్ కుమార్, సామాజిక కార్యకర్త కె.మాలతీ శ్రీనివాస్‌లు మాట్లాడారు. నిర్వాహకుడు మధుకర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా 'ఆదర్శ దేవో భవ' పురస్కారంతో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అధినేతలను సత్కరించారు.

నిర్వహణ నాస్తి.. ఓపెన్ జిమ్‌కు సుస్తీ



చేవెళ్లలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ సమీపంలోని పల్లె ప్రకృతి వనంలో ఏడాది క్రితం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ఇది. మొదట్లో యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో దీన్ని ఉపయోగించారు. ఇటీవల కురిసిన వర్షాలకు మైదానంలో పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. దీంతో కొన్ని రోజులుగా ఎవరూ రావడం లేదు. సరైన నిర్వహణ లేకపోవడంతో ఓపెన్ జిమ్ నిరుపయోగంగా మారింది. పిచ్చి మొక్కలు తొలగించి వాడుకలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, చేవెళ్ల

ఫాంహౌస్ నిర్వాహకులు బాధ్యతగా మెలగాలి



మాట్లాడుతున్న డీసీపీ శ్రీనివాస్

మొయినాబాద్, న్యూస్‌టుడే: ఫాంహౌస్ నిర్వాహకులు బాధ్యతగా మెలగాలని రాజేంద్రనగర్ జోన్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ సూచించారు. గ్రామపంచాయతీల నుంచి నిర్వాహకులు ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలన్నారు. మొయినాబాద్ మండలంలోని ఫాంహౌస్ నిర్వాహకులతో సోమవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. ఫాంహౌస్‌లో ఈవెంట్లు నిర్వహించే వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని, సౌండ్‌సిస్టం, మద్యం వినియోగానికి ఆన్‌లైన్‌లో అనుమతులు పొందాలన్నారు. ఈవెంట్‌కు సంబంధించిన పూర్తి వివరాలను స్థానిక పోలీసులకు ఇవ్వాలని ఆదేశించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఫాంహౌస్‌కు వచ్చే ప్రతి ఒక్కరి వివరాలను సేకరించాలని సూచించారు. సమావేశంలో చేవెళ్ల ఏసీపీ కిషన్, మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ జి.పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్సైలు నర్సింహారావు, ముజాఫర్‌అలీ, నహీముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటాం: డీసీ



ఉపకమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న గగన్‌పహాడ్ వాసులు

రాజేంద్రనగర్, న్యూస్‌టుడే: ప్రజావాణిలో వచ్చే ప్రతి ఫిర్యాదును పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని రాజేంద్రనగర్ ఉపకమిషనర్(డీసీ) రవికుమార్ తెలిపారు. సోమవారం సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ... సర్కిల్ పరిధిలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణికి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. తాజాగా గగన్‌పహాడ్ బస్తీలో రహదారులు లేక ఇబ్బందులు పడుతున్నామని బీజేవైఎం నాయకుడు వినయ్‌రెడ్డి నేతృత్వంలో, మహమూద్‌నగర్‌లో రహదారులపై ఆక్రమణలు తొలగించాలని స్థానిక కాలనీ వాసులు ఫిర్యాదు చేశారని వివరించారు.

కేజీకేఎస్ వార్షికోత్సవ సభ 18న

బాగ్‌లింగంపల్లి: కల్లుగీత కార్మిక సంఘం(కేజీకేఎస్) 67వ వార్షికోత్సవ సభను ఈ నెల 18న సుందరయ్య కళానిలయంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ తెలిపారు. సోమవారం మిర్యాల కేజీకేఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కల్లుగీత వృత్తిలో ఉపాధి అవకాశాలు అనే అంశంపై ప్రధానంగా చర్చిస్తామన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, బీసీ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, మాజీ ఎమ్మెల్సీ ప్రొ.కె.నాగేశ్వర్ హాజరవుతున్నట్లు తెలిపారు.

గురుకులం విద్యార్థికి తైక్వాండోలో కాంస్య పతకం

మొయినాబాద్: మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ చౌరస్తాలోని స్వామినారాయణ గురుకులానికి చెందిన విద్యార్థి తైక్వాండో చాంపియన్‌షిప్‌లో కాంస్య పతకం దక్కించుకున్నారు. ఉత్తరాఖండ్‌లోని మదర్ ఇండియా పబ్లిక్ పాఠశాలలో జరిగిన జాతీయస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్‌లో గురుకులానికి చెందిన ఏడో తరగతి చదువుతున్న మణికంఠేశ్వర్‌రెడ్డి అండర్-14 విభాగం 23 కిలోల విభాగంలో పాల్గొని ద్వితీయస్థానం సాధించారు. పాఠశాల పరమపూజ్య సుశీలభూషణ్‌స్వామీజీ, ప్రిన్సిపల్ అశోక్ ప్రవీణ్‌కుమార్ విద్యార్థి మణికంఠేశ్వర్‌రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు.

ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్ న్యూటౌన్: గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాల షాద్‌నగర్‌లో ఈ విద్యాసంవత్సరంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ డా.నీత ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఈ కళాశాల షాద్‌నగర్ పురపాలిక సోలీపూర్ శివారులోని నూర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థినిలు తమ అసలు ధ్రువపత్రాలతో నేరుగా కళాశాలకు వచ్చి కోర్సులో చేరవచ్చని చెప్పారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి

కేశంపేట: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో చేపడుతున్న పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఐదవార్ ఎంపీడీవో రవిచంద్రకుమార్‌రెడ్డి సూచించారు. పనుల గుర్తింపుకోసం సోమవారం ఆల్వాల గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చేపట్టాల్సిన పనులు, బడ్జెట్ అంచనా ప్రణాళిక తయారీపై కూలీలతో చర్చించి వివరాలను నమోదు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ ప్రత్యేకాధికారి గీత, కార్యదర్శి మహమ్మద్ గౌస్, టీఏ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాటు కాలువపై ప్రహరీ నిర్మాణం



వీర్లపల్లి, ఈదులపల్లి శివారులోని పాటు కాలువపై వెంచర్ నిర్వాహకులు నిర్మించిన ప్రహరీ

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ మండలంలోని ఈదులపల్లి, మొదళ్లగూడ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఓ వెంచర్ నిర్వాహకులు వీర్లపల్లి శివారు నుంచి ఈదులపల్లి చెరువుకు వెళ్లే పాటు కాలువపై ప్రహరీ నిర్మించారు. దీంతో పాటు కాలువ ఉనికి కోల్పోవడంతో పాటు చెరువులకు వర్షపు నీరు చేరడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పలుమార్లు నీటి పారుదలశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పాటు కాలువపై నిర్మించిన గోడను తొలగించాలని కోరుతున్నారు.

కొనసాగిన దుర్గామాత నిమజ్జనాలు



కన్యకాపరమేశ్వరి ఆలయ ఆధ్వర్యంలో అమ్మవారి ఊరేగింపు



గాంధీనగర్‌కాలనీలో ఏర్పాటు చేసిన మండపం నుంచి అమ్మవారిని నిమజ్జనానికి తరలిస్తున్న నిర్వాహకులు

షాద్‌నగర్ న్యూటౌన్, కొందుర్గు, న్యూస్‌టుడే: తొమ్మిది రోజులుగా నిర్వహించిన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ముగిశాయి. అమ్మవారి విగ్రహాలను భక్తులు డప్పు వాద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి గంగమ్మ ఒడికి చేర్చారు. షాద్‌నగర్ పట్టణంలోని శివమారుతీగీతామందిరం, కన్యకాపరమేశ్వరి దేవాలయంతోపాటు గాంధీనగర్‌కాలనీ, శివాజీచౌక్, వినాయకగంజ్, చటాన్‌పల్లిలో ఏర్పాటు చేసిన మండపాలలో దుర్గామాతకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్‌కాంతుల మధ్య సంప్రదాయంగా కోలాటాలు, భజనలు, బతుకమ్మలతో పాటు యువకుల నృత్యాలు, బాణసంచా మోత, డప్పులదరువుతో షాద్‌నగర్ పురపాలిక ప్రధాన రహదారి, పరిగి రోడ్డు మార్మోగిపోయింది. కన్యకాపరమేశ్వరి దేవాలయంలో లడ్డూ వేలం పాట నిర్వహించగా వాసవి మాత లడ్డూను రూ.39 వేలకు నీల నర్సింహులు, లక్ష్మీదేవి లడ్డూను మలిపెద్ది శ్రీనివాస్ రూ.21 వేలకు, సరస్వతి లడ్డూను రూ.21 వేలకు తాటి రామచంద్రుడు తీసుకున్నారు. ఆయా మండపాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహాలను పురపాలిక శివారులోని చెరువుల్లో నిమజ్జనం చేశారు. కొందుర్గులోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఆవరణలో ప్రతిష్ఠించిన దుర్గామాత నవరాత్రుల వేడుకలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా అందమైన బతుకమ్మలు తయారు చేసిన వారికి, వేలంలో అమ్మవారి చీరలు దక్కించుకున్న మహిళలకు భాజాపా నాయకుడు రాజేశ్ పటేల్ కానుకలు అందజేశారు.



కొందుర్గులో అమ్మవారి చీరలు అందజేస్తున్న రాజేశ్ పటేల్

హిందువుల మనోభావాలను దెబ్బతీసే వారిపై చర్యలకు డిమాండ్



షాద్‌నగర్ రాణాలో పోలీసుల అదుపులో బజరంగ్ దళ్ నాయకులు

షాద్‌నగర్ న్యూటౌన్, న్యూస్‌టుడే: హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా దేవాలయాలు, విగ్రహాలను ధ్వంసం చేస్తున్న వారిని గుర్తించి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని బజరంగ్‌దళ్ షాద్‌నగర్ విభాగ్ కన్వీనర్ గూడెం రమేష్ డిమాండ్ చేశారు. సికింద్రాబాద్‌లోని ఓ ప్రార్థనాలయంలో విగ్రహం ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ బజరంగ్‌దళ్ షాద్‌నగర్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని పాత జాతీయ రహదారిపై సోమవారం రాస్తారోకో చేపట్టి సికింద్రాబాద్ వెళ్లేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో వంశీ, సందీప్, గిరి, వినయ్, భాను, శ్రీకాంత్, సంతోష్, శ్రీకాంత్, అనిల్, గణేష్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం ప్రజల్లో ఉండాలి: కార్తీక్‌రెడ్డి



బండ్లగూడజాగీర్ భాజాపా కార్యకర్తలతో కార్తీక్‌రెడ్డి

బండ్లగూడజాగీర్, న్యూస్‌టుడే: నిత్యం ప్రజల్లో ఉంటూ వారి కష్ట సుఖాలను తెలుసుకోవాలని రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం భాజాపా ఇన్‌ఛార్జి పి.కార్తీక్‌రెడ్డి అన్నారు. ప్రజాసమస్యలను గాలికి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి గట్టిగా బుద్ధిచెప్పే రోజులు సమీపించాయన్నారు. సోమవారం బండ్లగూడజాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ భాజాపా అధ్యక్షుడు రాఘవేందర్ నాగరాజు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు కార్తీక్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజాపాలనలో ప్రజలకు కష్టాలు పెరిగాయన్నారు. ప్రభుత్వం ప్రజల పట్ల కర్కశంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. కార్యకర్తలు, నాయకులు ప్రజల్లో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

ముగిసిన దసరా తంతు.. ఇక దీపావళి వంతు





తోటలో విరగబూసిన బంతి, చామంతి పూలు

షాద్‌నగర్, న్యూస్‌టుడే: పూల తోటలు సాగు చేసిన రైతులు దసరా పండగ నేపథ్యంలో లాభాలు గడించారు. అమ్మవారి పూజల కోసం పెద్ద ఎత్తున బంతి, చామంతి పూలు అమ్ముడుబోవడమే దీనికి కారణం. సహజంగా విజయదశమి, దీపావళి పండగల దృష్టిలో ఉంచుకుని షాద్‌నగర్ ప్రాంత రైతులు పూల తోటలు సాగుచేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది సుమారు 4 వేల ఎకరాల్లో పూలపంటలు సాగుచేశారు. షాద్‌నగర్‌తో పాటు, రాజధానికి వీటిని తరలిస్తున్నారు. బంతులు గతంలో కన్నా అధికంగా కిలో రూ.200 వరకు, చామంతులు రూ.100 నుంచి 150 మధ్యన విక్రయం జరిగాయి. దసరా పండగ ముగియడంతో ఇక దీపావళి అమ్మకాల కోసం రైతులు ఎదురుచూస్తున్నారు. వ్యాపార కేంద్రం కావడంతో ఇక్కడ లక్ష్మీపూజలు పెద్ద ఎత్తున జరుగుతాయి. వ్యాపార సంస్థలు వ్యాపారులు రకరకాల పూలతో అలంకరిస్తారు. ఈ నేపథ్యంలో వీటికి మరింత గిరాకీ ఉంటుంది.

అనుమానాస్పద స్థితిలో వలస కార్మికుడి మృతి

శంషాబాద్, న్యూస్‌టుడే: అనుమానాస్పద స్థితిలో ఓ వలస కార్మికుడు మృతి చెందిన సంఘటన శంషాబాద్ మండలంలో సోమవారం చోటుచేసుకుంది. శంషాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా కొందుర్గు మండలం రామచంద్రాపురానికి చెందిన సురేష్(26)-శిరీష దంపతులు రోజువారీ కూలీలు. వీరు ఉపాధి కోసం ఇటీవల శంకరాపురానికి వచ్చి ఓ వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తున్నారు. వ్యవసాయ క్షేత్రంలోని ఓ బావిలో సురేష్ విగతజీవిగా కనిపించాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం

శంషాబాద్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పాలమాకులలో సోమవారం చోటు చేసుకుంది. శంషాబాద్ పోలీసుల వివరాల ప్రకారం.. మదనపల్లికి చెందిన తుల్స(51) రైతు. రోజూ మాదిరిగా వ్యవసాయ పనులు ముగించుకుని తన ద్విచక్ర వాహనంపై కొత్తూరుకు బయల్దేరాడు. ఈ క్రమంలో పాలమాకుల వద్ద జాతీయ రహదారిని దాటుతుండగా శంషాబాద్ నుంచి వేగంగా వస్తున్న ఓ ట్రక్కు తుల్స ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన తుల్స అక్కడికక్కడే మృతి చెందాడు. మృత దేహాన్ని ఉస్మానియా శవాగారానికి తరలించారు. మృతుడికి భార్య సోని, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మనోవేదనతో వృద్ధుడి బలవన్మరణం

క్రైమ్ కార్నర్

చేవెళ్ల గ్రామీణం, న్యూస్‌టుడే: భార్య మృతి చెందడంతో ఒంటరి జీవితం గడుపుతున్న భర్త మనోవేదన చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగుచూసింది. పోలీసుల వివరాల ప్రకారం.. చేవెళ్లకు చెందిన మల్లారం మోహన్‌రెడ్డి(61) భార్య మల్లమ్మ గతేడాది గుండెపోటుతో మృతి చెందింది. అప్పటినుంచి ఒంటరిగా బావిని తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి ఇంట్లో అందరూ భోజనం చేశాక గదిలోకి వెళ్లి ఫ్యానుకు ఉరేసుకున్నాడు. సోమవారం ఉదయం గమనించిన బయటకు రాకపోవడంతో కుమారుడు వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఊరేగింపులో రెండు మండపాల కమిటీ సభ్యుల ఘర్షణ

కొత్తూరు, న్యూస్‌టుడే: దుర్గామాత ఊరేగింపులో రెండు మండపాల కమిటీ సభ్యుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ సంఘటన కొత్తూరు పురపాలిక పరిధిలోని అర్బన్ ప్రాంతంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. పురపాలికలో మొత్తం మూడు దుర్గామాత మండపాలను ఏర్పాటు చేశారు. ఇందులో రెండు మండపాల విగ్రహాలు ఆదివారం సాయంత్రం నిమజ్జనానికి తరలాయి. ఇందులో ఓ కమిటీ ఊరేగింపు మరో మండపం ముందు నుంచి వెళ్తుండగా చిన్నపాటి గొడవ చెలరేగింది. అది పెద్దగా మారడంతో ఇరువర్గాలు పరస్పరం దాడులకు దిగాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వారిని చెదరగొట్టారు. అనంతరం పరస్పర ఫిర్యాదులు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.శ్రీనివాస్ వివరించారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ..

మొయినాబాద్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ గుర్తు తెలియని మహిళ మృత్యువాతపడింది. మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి వివరాల ప్రకారం.. ఈ నెల 11న వేకువజామున మొయినాబాద్ కేంద్రంలోని మున్సిఫ్‌కోర్ట్ వద్ద రోడ్డుపై వెళ్తున్న మహిళ(50)ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఆ ప్రమాదంలో తీవ్ర గాయాలు కావడంతో పోలీసులు ఆమెను ఉస్మానియా దవాఖానాకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం ఆమె మృతిచెందింది.

వెంచర్‌లో కరెంటు తీగల చోరీ

నందిగామ, న్యూస్‌టుడే: నందిగామ మండల కేంద్రంలోని వేణుగోపాల్ నగర్ వెంచర్‌లో శనివారం రాత్రి ఇద్దరు దొంగలు కరెంటు తీగల చోరీకి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం కాపలాదారుడు శ్రావణ్‌కుమార్ చోరీని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సీసీ ఫుటేజీని పరిశీలించగా ఇద్దరు దొంగలు ముసుగులు వేసుకుని 14 స్తంభాలకు విద్యుత్ వైర్లను కత్తిరించి ఎత్తుకెళ్లారని గుర్తించారు. దీనిపై విద్యుత్ ఏఈ శ్రీధర్‌కు సోమవారం ఫిర్యాదు చేసినట్లు శ్రావణ్‌కుమార్ తెలిపారు.

మహేశ్వరం

•మహేశ్వరం •ఇబ్రహీంపట్నం •కల్వకుర్తి

ప్రజావాణిలో 40 వినతులు

ఆదిభట్ల, న్యూస్‌టుడే: ప్రజావాణిలో వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక ఆదేశించారు. సోమవారం కొంగరకలాన్‌లోని రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి 40 మంది వచ్చి వినతులు ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

దివ్యాంగులకు అండగా నిలుస్తా : ఎమ్మెల్యే

మీర్‌పేట న్యూస్‌టుడే: దివ్యాంగులకు ఆయుతం టానని మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి హామీ ఇచ్చారు. మీర్‌పేట కార్పొరేషన్‌లోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు దివ్యాంగులకు మూడు చక్రాల బ్యాటరీ సైకిళ్లను వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌తో కలిసి సబితాఇంద్రారెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మీర్‌పేట భారాస అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మీర్‌పేటలో సైకిళ్లు పంపిణీ చేసిన సబితాఇంద్రారెడ్డి

మాజీ వైస్‌ఎంపీపీని పరామర్శించిన ఎమ్మెల్యే



యశోదలో కొలన్ శ్రీధర్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే: నాలుగు రోజులుగా మలక్‌పేటలోని యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అబ్దుల్లాపూర్‌మెట్ మండల మాజీ వైస్‌ఎంపీపీ కొలన్ శ్రీధర్‌రెడ్డిని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సోమవారం పరామర్శించారు. శ్రీధర్‌రెడ్డిని పరామర్శించిన వారిలో మార్కెట్ కమిటీ వైస్‌ఛైర్మన్ సీహెచ్ భాస్కర్‌రావు, మాజీ సర్పంచ్ చిత్తారి, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు సాధించిన వారికి సత్కారం

ఆరుట్ల (మంచాల): ఆరుట్ల గ్రామంలో 16 మంది ఉపాధ్యాయ కొలువులకు ఎంపికయ్యారు. వీరిని కాంగ్రెస్, భారాస నాయకులు వేర్వేరుగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు విష్ణు, జంగయ్య, భారాస నేతలు పాల్గొన్నారు.

ఆశయం ఘనం.. ప్రయోజనం శూన్యం

30 ఏళ్లుగా నిరుపయోగంగా మాల్ బస్టాండ్

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

యాచారం, న్యూస్‌టుడే: వ్యాపార కేంద్రమైన మాల్ మార్కెట్.. రంగారెడ్డి, నల్గొండ జిల్లాల పరిధిలో ఉంటుంది. రంగారెడ్డిలోని భాగం మాల్, నల్గొండలోని ప్రాంతం వెంకటేశ్వరనగర్ గ్రామ పంచాయతీలుగా ఉంటాయి. మొత్తం ప్రాంతం మాల్ మార్కెట్ పేరుతో వాడుకలో ఉంది. 1994లో మాల్ సర్పంచిగా ఉన్న లక్ష్మి జంగారెడ్డి బస్టాండును నిర్మించాలన్న ఉద్దేశంతో దాతల నుంచి భూమి సేకరించారు. అప్పటి ఎమ్మెల్యే కొడిగారి రాములు, మాజీ ఎమ్మెల్యే కొండల్‌రెడ్డి సహకారంతో ఈ మేరకు కృషి చేశారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీ నిధులతో బస్టాండు నిర్మాణాన్ని చేపట్టారు. నల్గొండ జిల్లా పరిధిలో కిలోమీటరు దూరంలో ఉన్న భూమిని కొనుగోలు చేసి బస్టాండు నిర్మించారు. అయితే, దీనిని వినియోగంలోకి తేలేదు. నిరుపయోగంగా ఉంది.

ఇప్పుడేం చేయాలి: అప్పట్లో ఆర్టీసీ అధికారులు ముందుకు రాకపోవడంతో గ్రామ పంచాయతీ పేరున రిజిస్ట్రేషన్ చేసిన భూమిని ఆర్టీసీకి మార్పిడి చేసి బస్టాండును ప్రారంభించాలి. గ్రామ పంచాయతీ నిధులతో నిర్మించిన 20 దుకాణాలను అద్దెకు ఇవ్వడం ద్వారా ఆదాయం పొందొచ్చు.



వినియోగించని దుకాణ సముదాయం

అంశం	మాల్ బస్టాండ్
దాతల నుంచి సేకరించిన భూమి	1.21 ఎకరాలు
ప్రస్తుతం దీని విలువ	రూ.4 కోట్లపైనే
భూమి కేటాయించిన దాతలు	నర్సిరెడ్డి, నారాయణగౌడ్, ఊరి శ్రీనివాస్, జగన్, పాప
ఎప్పుడు కేటాయించారు	1994లో

భూమిని ఆర్టీసీకి బదలాయిస్తేనే ముందుకు..


–వెంకటనర్సప్ప, డీఎం, ఇబ్రహీంపట్నం

మాల్‌లోని ఈ స్థలం బస్టాండ్‌కు అనువుగా ఉంది. ఆర్టీసీ పేరున భూమిని మార్పిడి చేస్తేనే బస్టాండ్‌ను వినియోగంలోకి తేవడం సాధ్యమవుతుంది. దీని కోసం గ్రామ పంచాయతీ అధికారులు ప్రయత్నించాలి.



మాల్‌లో నిర్మానుష్యంగా బస్టాండు

ఇప్పటికైనా న్యాయం చేయాలి..



– లక్ష్మి జంగారెడ్డి మాజీ సర్పంచి

బస్టాండ్‌కు మోక్షం కలిగించాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఇటీవల కలిసి పరిస్థితిని వివరించాం. ఆయన ఆదేశాల మేరకు డీఎం ఇక్కడకు వచ్చి బస్టాండ్‌ను పరిశీలించారు. భూమిని ఇచ్చిన దాతల ఆశయాన్ని నెరవేర్చడానికి ఇప్పటికైనా బస్టాండ్‌ను ప్రారంభించాలి. దీనివల్ల ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. చిరు వ్యాపారులకు ఉపాధి లభిస్తుంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

మహేశ్వరం	80085 73290
ఇబ్రహీంపట్నం	80085 73295
ఆమనగల్, కల్వాల్	98481 98888

ఉ.10 నుంచి మధ్యాహ్నం 1 గంట మధ్య మాత్రమే

ఆర్కేపురం, మీర్‌పేట, న్యూస్‌టుడే:

? ఆర్కేపురంలోని మార్గదర్శి కాలనీలో దోమల బెడద ఎక్కువగా ఉంది. – ఉమేష్, మార్గదర్శి కాలనీ

✓ వెంటనే ఫాగింగ్ చేయిస్తాం. – సుజాత, సరూర్‌నగర్ సర్కిల్ డీసీ

? మీర్‌పేట తిరుమలహిల్స్ మెయిన్‌రోడ్డు పక్కన వ్యర్థాలు పేరుకుపోయాయి. – ఎస్.ప్రసాద్, రాఘవేంద్రనగర్, మీర్‌పేట.

✓ వ్యర్థాల తొలగింపు చర్యలు తీసుకుంటాం. – చంద్రశేఖర్, కమిషనర్, మీర్‌పేట

భక్తిశ్రద్ధలతో మహా సత్సంగం

ఆర్కేపురం, న్యూస్‌టుడే: ఆర్కేపురంలో సోమవారం ఇస్కాన్ ఆధ్వర్యంలో అష్టలక్ష్మి ఆలయం నుంచి ఎస్.ఆర్కేపురం వరకు మహాసత్సంగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి ఇస్కాన్ ప్రతినిధి ప్రణవానంద దాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ నగర సంకీర్తనలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధులు శ్రీనివాస్ అతిప్రియ దాస్, మాయ నర్సింగరావు, అష్టలక్ష్మి ఆలయ ట్రస్ట్ ఫౌండర్ ఛైర్మన్ గౌరిశెట్టి చంద్ర శేఖర్‌గుప్తా, చిలుక ఉపేందర్‌రెడ్డి, రామారావు, రమేష్ బాబు, శ్రీకాంత్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో ఇస్కాన్ ప్రతినిధి ప్రణవానంద దాస్ తదితరులు

వైభవంగా బతుకమ్మ వేడుక

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లి మండలం ఖానాపూర్ గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకను సోమవారం మహిళలు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాలుగా బతుకమ్మలను ప్రత్యేకంగా తయారు చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకుడు గార్లపాటి సరితాగణేశ్ గుప్తా ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ వేడుక జరిగింది.



బతుకమ్మలతో మహిళలు, నాయకులు

ప్రో కబడ్డీలో లార్డ్స్ విద్యార్థుల ప్రతిభ

మీర్‌పేట న్యూస్‌టుడే: గచ్చిబౌలి స్టేడియంలో జూనియర్ ప్రో కబడ్డీ సీజన్5 పోటీలో మీర్‌పేటలోని లార్డ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఫైనల్స్‌కు క్వాలిఫై అయినట్లు ఛైర్మన్ సిద్ధాల బీరప్ప తెలిపారు. జూనియర్ ప్రో కబడ్డీలో క్వాలిఫై అయిన విద్యార్థులను సోమవారం పాఠశాల ఛైర్మన్ బీరప్ప, వైస్‌ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీలత, డీన్ సతీష్, ప్రిన్సిపల్ సంతోష్ తదితరులు అభినందించారు.



విద్యార్థులతో లార్డ్స్ పాఠశాల యాజమాన్యం

పద్మశాలీ కార్యవర్గం ఎన్నిక




చుక్కాపూర్‌లో కొత్త కార్యవర్గాన్ని సన్మానిస్తున్న స్థానికులు

తలకొండపల్లి, న్యూస్‌టుడే: తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామంలో మార్కండేయ పద్మశాలీ సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.మల్లేశ్, ఉపాధ్యక్షులుగా రమేశ్, మధు, రాజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా నరేశ్, కోశాధికారిగా గణేశ్, సహాయ కార్యదర్శులుగా రాకేశ్, శివకుమార్, గౌరవ అధ్యక్షుడిగా చంద్రకుమార్, సలహాదారులుగా మాకం పాండయ్య, వీరేశలింగం, జనార్దన్ ఎన్నికయ్యారు.

సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

మీర్‌పేట, న్యూస్‌టుడే: మీర్‌పేటలో సాయిబాబా పీఠాన్ని జస్టిస్ బి. చంద్రకుమార్ సందర్శించారు. విజయదశమి సందర్భంగా పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామీజీ ఆధ్వర్యంలో సాయిబాబా పీఠంలో బాబా మహాసమాధి ఉత్సవాలు, దసరా పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చంద్రకుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయనను పీఠాధిపతి సత్కరించారు.



జస్టిస్ చంద్రకుమార్‌ను సత్కరిస్తున్న పీఠాధిపతి గోపాలకృష్ణానంద స్వామి

● మీర్‌పేట కార్పొరేషన్‌లోని ప్రశాంతిహిల్స్‌కాలనీ ఫేజ్2 అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత శోభాయాత్ర ఘనంగా జరిగింది. శోభాయాత్ర అనంతరం దుర్గామాతను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



మీర్‌పేట ప్రశాంతిహిల్స్‌లో

పనులు ముగిసినా.. తొలగని సూచిక బోర్డులు

తుర్కయంజాల్ పురపాలిక, న్యూస్‌టుడే: తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్ నుంచి బ్రాహ్మణపల్లి వెళ్లే రోడ్డులో కల్వర్టు పనులను ఆర్‌అండ్‌బీ అధికారులు చేపట్టారు. వాహనాలను దారి మళ్లించేందుకు సూచికబోర్డులు ఏర్పాటుచేశారు. పనులు ముగిసి నెల రోజులవుతున్నా ఆ సూచికబోర్డులను ఇంకా తొలగించలేదు. వీటితో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.



'ఎర్ర జెండా నీడలోనే పేదలకు భద్రత'

యాచారం: పేదల బతుకులు ఎర్ర జెండా నీడలోనే బాగుంటాయని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. యాచారం మండలం మాల్‌లో సోమవారం నిర్వహించిన సీపీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. ధరణి సమస్యలు పరిష్కరించాలని, పేదలకు ఇళ్లు, స్థలాలు పంపిణీ చేయాలని కోరారు. మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ, సీఐటీయూ మండల కన్వీనర్ చందునాయక్, యాదయ్య, సాయికుమార్ తదిరులు పాల్గొన్నారు. అంతకుముందు సీనియర్ నాయకుడు కానమోని యాదయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

● రిజర్వేషన్ హక్కుల రక్షణకు మాలలంతా ఏకతాటిపైకి రావాలని మాలల హక్కుల ఐక్యవేదిక ఇబ్రహీంపట్నం కన్వీనర్ మారయ్య పిలుపునిచ్చారు. నందివనపర్తిలో ఆదివారం రాత్రి జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, బుగ్గరాములు, మల్లేశ, జైభీం యువజన సంఘం అధ్యక్షుడు వివేక్, రాఘవేందర్, గౌతమ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



నందివనపర్తిలో మాలల ఐక్యవేదిక నాయకులు

నేటి నుంచి గాలికుంటు నివారణ టీకాలు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: అక్టోబర్ 15 నుంచి నవంబర్ 14వరకు పాడి పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తామని ఇబ్రహీంపట్నం సహాయ సంచాలకులు డాక్టర్ వసంతకుమారి చెప్పారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు ఆనందరెడ్డి, సరిత పాల్గొన్నారు.

అనాథలకు రూ.50వేల విరాళం

ఆర్కేపురం, న్యూస్‌టుడే: ఆర్కేపురంలోని అనాథ విద్యార్థి గృహానికి మన్సూరాబాద్ డివిజన్ విజయశ్రీ కాలనీ అధ్యక్షుడు జొన్నాడ మోహన్‌రెడ్డి రూ.50వేలు విరాళం ప్రకటించారు. ఆయన తల్లిదండ్రులు నాగమణి, నారాయణరెడ్డిల జ్ఞాపకార్థం సోమవారం అనాథ విద్యార్థులకు గృహం అధ్యక్షుడు మార్గం రాజేశ్ సమక్షంలో నగదు అందజేశారు. కార్యక్రమంలో మోహన్‌రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పల్లె నుంచి పట్టణానికి ప్రయాణం



తలకొండపల్లిలో బస్సు వద్ద ప్రయాణికులు

తలకొండపల్లి, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలు పూర్తికావడంతో పల్లె నుంచి ప్రజలు నగరబాట పట్టారు. సోమవారం తలకొండపల్లి మండలంలోని పలుప్రాంతాల్లో నగరానికి వెళ్లేవారితో బస్టాండ్లు కిటకిటలాడాయి. బస్సుల వద్ద ప్రయాణికులు బారులుతీరారు.

చెలామణిలోనే పది నాణేలు

కొందుర్గు: పది రూపాయల నాణేలు చెలామణిలోనే ఉన్నాయని, చెల్లుబాటు కావని జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని యూనియన్ బ్యాంక్ కొందుర్గు శాఖ మేనేజర్ వెంకటేశ్ స్పష్టం చేశారు. పది నాణేలు చెల్లుతాయనే సూచికలను సోమవారం మండల కేంద్రంలోని పలు వ్యాపార సముదాయాల వద్ద ఏర్పాటు చేయించారు. రూ.పది నాణేలు నిరాకరించిన వారిపై ఆర్బీఐ ఆదేశాల మేరకు చట్టప్రకారం చర్యలు చేపడగామని ఆయన హెచ్చరించారు.

రద్దీగా పార్టీ కార్యాలయాలు

కందుకూరు, న్యూస్‌టుడే: మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డిని కందుకూరు మండల భారాస నాయకులు కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేను క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాద పూర్వకంగా కలిసేందుకు ఆయా గ్రామాల నేతలు పోటెత్తారు.

కందుకూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గ కాంగ్రెస్ బాధ్యులు, మాజీ ఎమ్మెల్యే కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి(కేఎల్ఆర్)ని కందుకూరు మండల కాంగ్రెస్ శ్రేణులు కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. తుక్కుగూడలో పార్టీ కార్యాలయానికి సోమవారం ఉదయం నుంచి నాయకులు, కార్యకర్తలు రావడం ప్రారంభించారు. రోజంతా రద్దీగా దర్శనమిచ్చింది. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీఛైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, పార్టీ నేతలు పాల్గొన్నారు.



కేఎల్ఆర్‌తో మహేశ్వరం, కందుకూరు కాంగ్రెస్ నేతలు

లక్షలు పలికిన అమ్మవారి చీరలు

జల్‌పల్లి, న్యూస్‌టుడే: జల్‌పల్లి వీకర్‌సెక్షన్ కాలనీలో కొలువైన అమ్మవారి 10 చీరలను రూ.2.1 లక్షలకు, శ్రీరామాంజనేయ స్వామి దేవాలయంలో అమ్మవారి 9 చీరలు వేలంలో రూ.1.71 లక్షలకు భక్తులు దక్కించుకున్నారు.

భార్యతో గొడవపడి భర్త అదృశ్యం

పహాడీషరీఫ్: తుక్కుగూడ మంఖాల్‌లో ఉండే నరేందర్ సింగ్(38) స్థానికంగా ఓ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈనెల 13న భార్యతో గొడవపడ్డాడు. అనంతరం ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై వెళ్లి తిరిగి రాలేదు. భార్య ఫిర్యాదు మేరకు పహాడీషరీఫ్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



పేరుకున్న వ్యర్థాలు.. తొలగిస్తే మేలు

జాపాల (మంచాల): జాపాల పాఠశాల సమీపంలో చెత్త పేరుకుపోయింది. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సందడిగా దుర్గాదేవి శోభాయాత్ర

అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం, కడ్తాల్, ఆమనగల్లు, న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో ప్రత్యేక మండపాలు ఏర్పాటు చేసి అమ్మవారిని పూజించిన భక్తులు.. దసరా వేడుకల అనంతరం నిమజ్జనోత్సవాలను కనుల పండువగా నిర్వహించారు. అబ్దుల్లాపూర్‌మెట్ లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి శోభాయాత్రను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక చింతల్ చెరువు వరకు శోభాయాత్ర నిర్వహించి అమ్మవారి విగ్రహాన్ని గంగలో నిమజ్జనం చేశారు. ● ఇబ్రహీంపట్నం, ఉప్పరిగూడ, చర్లపటేల్‌గూడ గ్రామాల్లో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా సాగాయి. ఉప్పరిగూడలో మాజీ సర్పంచి బూడిద రాంరెడ్డి.. రూ.1.50లక్షలతో ఊరేగింపు చేసేందుకు ట్రాలీ తయారు చేయించారు. ● కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లిలో దుర్గామాత అమ్మవారు ప్రతిమ వస్తువులకు నిర్వాహకులు వేలం నిర్వహించారు.



అబ్దుల్లాపూర్‌లోని ఊరేగింపులో భక్తులు..



చర్లపటేల్‌గూడలో యువసేనా యూత్ సభ్యులు

చెత్త శుద్ధి ఏదీ..?

నిల్వ కేంద్రాలుగా మారిన గుంతలు

కందుకూరు, న్యూస్‌టుడే: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు సేంద్రియ ఎరువు తయారీ ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వం చెత్తశుద్ధి కేంద్రాలు నిర్మించింది. ఒక్కొక్కడ్డుకు రూ.1.5 లక్షల నుంచి రూ.2.5 లక్షల వరకు వెచ్చించారు. తడి, పొడి చెత్తతో వేర్వేరు పద్ధతుల్లో ఎరువుల తయారీకి అనుగుణంగా వీటిని నిర్మించారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంతో లక్ష్యం నెరవేరడం లేదు.

జనాభా	70 వేలు
పంచాయతీలు	35
సేంద్రియ ఎరువు తయారీ నిర్మాణాలు	35

ఖర్చు చేసిన నిధులు సుమారు రూ.3 కోట్లు

నిర్వహణ గాలికి...

పంచాయతీకి ఒకటి చొప్పున ఉపాధిహామీ, పంచాయతీరాజ్ శాఖ నిధులు వెచ్చించి వీటిని నిర్మించారు. గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్త నుంచి ఎరువు తయారు చేసి ఆదాయం సమకూర్చుకునేందుకు ప్రణాళిక రూపొందించారు. నిర్మాణంలో హడావుడి చేసిన అధికారులు.. ప్రస్తుతం వాటి నిర్వహణను గాలికి వదిలేశారు. దీంతో రోడ్ల పక్కన గుంతలు చెత్త నిల్వ కేంద్రాలుగా మారాయి.



స్టేడియం పక్కన చెత్త కుప్పలు



దెబ్బడగూడలో నిరుపయోగంగా..

నిర్మాణాలకే పరిమితం..

స్వచ్ఛభారత్, పల్లె ప్రగతిలో చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించింది. ప్రతి గ్రామంలో చెత్త సేకరణకు ట్రాక్టర్లు కొనుగోలు చేయడంతో పాటు, చెత్త డబ్బాలు పంపిణీ చేసింది. మండలంలోని 35 పంచాయతీల్లో ఈ నిర్మాణాలు చేపట్టారు. సేకరించిన చెత్తను సేంద్రియ ఎరువుగా మార్చాలన్న లక్ష్యానికి అనుగుణంగా వీటి నిర్మాణాలు చేపట్టారు. కానీ పలు గ్రామాల్లో రోడ్డు పక్కన గుంతల్లో చెత్త వేసి నిప్పు అంటిస్తున్నారు. దీంతో ప్రజారోగ్యం దెబ్బతింటోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగిన చర్యలు చేపట్టి ఈ సమస్యను పరిష్కరించాల్సిన అవసరముంది.

సీఎం రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం



రావిర్యాల వద్ద వేచి ఉన్న కాంగ్రెస్ శ్రేణులు

ఆదిభట్ల, న్యూస్‌టుడే: కొంగరకలాన్‌లోని ఫాక్స్‌కాన్ కంపెనీని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సందర్శించడంతో ఈ ప్రాంతం సందడిగా మారింది. ఆయన రాకకోసం, రేవంత్‌రెడ్డి దృష్టిలో పడాలని నియోజకవర్గ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. స్వాగతం పలికేందుకు నేతలు.. పెద్ద ఎత్తున ఫాక్స్‌కాన్ కంపెనీ వద్దకు చేరుకున్నారు. తిరిగి వెళ్లే సమయంలో రేవంత్‌రెడ్డి కార్యకర్తలకు చెయ్యి ఊపుతూ వెళ్లారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జ్ కేఎల్ఆర్, గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం: రంగారెడ్డి జిల్లా కొంగరకలాన్‌లో నూతనంగా ఏర్పాటు అవుతున్న ఫాక్స్‌కాన్ కంపెనీ పనులను పరిశీలించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం వచ్చారు. ఈ సందర్భంగా మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ బాధ్యులు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు. . సీఎంకు ఘనస్వాగతం పలికారు. అంతకుముందు కేఎల్ఆర్ మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గాన్ని మహానగరంగా మార్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు.

ఖైరతాబాద్

• ఖైరతాబాద్ • జూబ్లీహిల్స్

మానవతావాది డా.బీ.ఆర్.అంబేడ్కర్

హిమాయత్‌నగర్, న్యూస్‌టుడే: డా. బీఆర్ అంబేడ్కర్ బౌద్ధ ధమ్మ దీక్ష పరివర్తన దివస్ సందర్భంగా దళిత బహుజన పార్టీ (డీబీపీ) అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ ఆధ్వర్యంలో ట్యాంక్ బండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ.. కరుణ, ప్రేమ,స్వేచ్ఛ, సమానత్వం, మానవీయతకు పునాది అయిన బౌద్ధ ధర్మాన్ని అంబేడ్కర్ స్వీకరించారని, ఆయన చూపిన మార్గంలో పయనించడమే దళిత బహుజన జాతులకు తాత్విక విముక్తి అన్నారు. కార్యక్రమంలో గణేష్, రాజలీల, అశోక్‌కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.



గోడ పత్రిక ఆవిష్కరిస్తున్న వడ్లమూరి కృష్ణ స్వరూప్, నేతలు

విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

గాంధీనగర్: చదువుతోపాటు నైపుణ్యాలను విద్యార్థులు పెంపొందించుకోవాలని కొనసీమ ద్రవిడ సంఘం ప్రతినిధులు బాలాజీ, ఆదిభట్ల కామేశ్వర రావు కోరారు. విజయవాడమిని పురస్కరించుకుని సంఘం ఆధ్వర్యంలో.. గేటెడ్ ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు పతకాలు సహా స్కాలర్‌షిప్‌లు, ప్రశంసాపత్రాలను ప్రదానం చేసి మాట్లాడారు. సంఘం ప్రతినిధులు బండి శ్రీనివాస్, కందాల భాస్కర రామచంద్ర, మంతా నరసింహశాస్త్రి, దక్షిణామూర్తి, అనంతలక్ష్మి, త్రిమూర్తి, డీఎల్‌వీ సత్యనారాయణ, కర్ర లక్ష్మీనారాయణ, భీమశంకరం పాల్గొన్నారు.



విద్యార్థులతో కోనసీమ ద్రవిడ సంఘం ప్రతినిధులు

మేము న్నాం.. మీకు తోడుగా..

ఉ.10 నుంచి మ.1 గంట వరకు

ఖైరతాబాద్	80085 73345
జూబ్లీహిల్స్	80085 73352
బంజారాహిల్స్	80085 73348

యూసుఫ్‌గూడ: ? యూసుఫ్‌గూడ డివిజన్ ప్రగతినగర్‌కాలనీలో వీధులను ఊడ్చకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోతుంది. ప్రతి రోజు ఊడ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. -నిర్మల, గృహిణి, ప్రగతినగర్‌కాలనీ.

✓ ప్రగతినగర్‌కాలనీలోని వీధులను ప్రతి రోజూ పారిశుద్ధ్య సిబ్బంది ఊడ్చేలా చర్యలు తీసుకుంటాం. - సాల్మాన్‌రాజు, ఎంఎహెచ్, సర్కిల్ నెం. 19.

బంజారాహిల్స్: ? బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ నుంచి రోడ్డు నం.14 కూడలికి వచ్చే దారిలో రెండు వీధిదీపాలు వెలగడం లేదు. ఈ మార్గంలో వాహనాల రాకపోకలు అధికం. వీధిదీపాలు వెలగకపోవడంతో పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. సమస్యను పరిష్కరించండి. - శివ ప్రసాద్, ప్రైవేటు ఉద్యోగి, బంజారాహిల్స్

✓ ఆ ప్రాంతంలో సమస్య తలెత్తిన విషయం మా దృష్టికి రాలేదు. సిబ్బందిని పంపి తనిఖీ చేయించి వీధిదీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం. - సువ్వ మున్సిపల్ ఏఈ (వీధిదీపాల విభాగం), సర్కిల్-18

మురుగు ఎక్కడ కలుస్తుందబ్బా..!

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: ఆ కాలనీలో సీవరేజీ మురుగు వరదనీటి కాలువల్లో కలుస్తోంది.. చాలా చోట్ల ఇలాంటి ప్రక్రియ జరుగుతున్నదే.. అయితే ఇలా బుల్కాపూర్ నాలా నుంచి వచ్చిన మురుగుతో కూడిన వరదను ఎస్టీపీలో శుద్ధి చేసిన తర్వాత లేక్‌వ్యూ పార్కులోని కొలనులోకి వదులుతున్నా.. సదరు కాలనీకి చెందిన మురుగు ఎక్కడి నుంచో వచ్చి కొలనులో చేరుతుండటంతోనే పెద్ద సమస్య వచ్చింది. జలమండలి కాలనీ, పార్కును సందర్శించి పరిశీలించిన జలమండలి ఎండీ.. పరిస్థితిని చక్కదిద్దాలని ఆదేశాలు ఇవ్వడంతో మురుగు ఎక్కడ కలుస్తుందా అని వెతుకుతూనే ఉన్నారు.

డ్రైనేజీ చేరి.. చేపలు మృతి..

ఖైరతాబాద్‌లోని ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్, మింట్‌కాంపౌండ్, తదితర ప్రాంతాల్లో కురిసే వర్షపు నీరు ఐమ్యాక్స్ సమీపంలోని లేక్‌వ్యూ పార్కులోకి చేరేలా వరదనీటి పైప్‌లైన్ మార్గం ఏర్పాటు చేశారు. అలాగే ఖైరతాబాద్ ఫ్లైఓవర్ సమీపంలో ఏర్పాటుచేసిన ఎస్టీపీలో శుద్ధి చేసిన నీటిని ఈ పార్కులోకి మళ్లిస్తున్నారు. పార్కులో పచ్చని చెట్లు, కొలనుతో ఆకట్టుకునే తీరుగా ఉండటంతో శుద్ధి చేసిన నీటిని, వర్షపు నీటిని పంపుతూ సందర్శకులకు ఇబ్బంది



ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్‌లో మురుగు సమస్యపై తనిఖీలు చేస్తున్న సిబ్బంది

లేక్‌వ్యూ పార్కు కొలనులోకి చేరుతున్న దుర్గంధం
గుర్తించే పనిలో జలమండలి, జీహెచ్ఎంసీ సిబ్బంది

లేకుండా చూస్తున్నారు. అయితే కొద్దికాలంగా ఓల్డ్ సీబీఐ క్వార్టర్స్ నుంచి ఉన్న వరద నీటి కాలువలోకి మురుగు చేరి పార్కులోని కొలను నీరు అపరిశుభ్రంగా మారుతోంది. నీరు దుర్వాసనగా మారింది. దీన్ని పత్రికల్లో ప్రచురించడం, పార్కులోని వాకర్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సమస్యను గుర్తించేందుకు కొద్దిరోజులుగా తనిఖీలు చేస్తూనే ఉన్నారు. ఇదిలా ఉండగా రెండ్రోజుల కింద కొలనులో ఓ భారీ చేప మృత్యువాత పడింది. మురుగునీటి కార



కొలనులో చనిపోయిన చేపను బయటకు తీస్తున్న దృశ్యం

ణంగానే జరిగి ఉంటుందని, ఇదే తీరు కొనసాగితే అందులో ఉన్న చేపలన్నీ చనిపోయే ప్రమాదం ఉందని వాకర్లు ఆందోళన వెలిబుచ్చారు.

అనుమానం ఉన్న చోటల్లా పరిశీలన..

సీవరేజీ కలుస్తున్నట్లు అనుమానం ఉన్న ప్రతి మ్యాన్‌హోల్‌ను తెరిచి పైపులైన్‌లో మురుగు నీటి వ్యవస్థ తీరుపై జలమండలి, జీహెచ్ఎంసీ సిబ్బంది తనిఖీలు చేస్తున్నారు. రెండు, మూడు రోజులకోసారి రెండు శాఖలకు చెందిన అధికారులు సీవరేజీ కాలువలు శుద్ధిచేసే యంత్రంలో అక్కడికి చేరుకుని పైపులైన్లలో నిలిచిన నీటిని తొలగించి తనిఖీ నిర్వహించారు. ఓ వీధిలోని మొత్తం మ్యాన్‌హోళ్లను పరిశీలించగా ఇంకా ఎగువ ప్రాంతం నుంచే మురుగు వస్తున్నట్లు గమనించారు. కాలనీలోని పైభాగంలో ఉన్న ప్రతి మ్యాన్‌హోల్‌ను తెరిచి సమస్యను పరిష్కరిస్తామని జలమండలి అధికారులు స్థానికులకు హామీ ఇచ్చారు. పండగ సెలవులు ముగియడంతో మళ్లీ కసరత్తు ప్రారంభించే అవకాశం ఉంది.

చూపుకోల్పోతున్న వారి సంఖ్య పెరుగుతోంది

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: దేశంలో చూపు కోల్పోతున్నవారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందని శాసన మండలి సభ్యుడు తీన్మార్ మల్లన్న అన్నారు. కాబట్టి ఈ రంగంలో కృషి, సేవ చేసేవారి సంఖ్య కూడా పెరుగుతుందన్నారు. సోమవారం రాత్రి రవీంద్రభారతిలో 'ఇట్రాడ్ (ఇన్‌స్టిట్యూట్ ఫర్ ట్రైనింగ్ రిలీఫ్ రిహాబిలిటేషన్ ఆఫ్ డిసెబుల్డ్ డిస్ట్రెస్డ్ అండ్ డిసడ్వాంటేజ్డ్ చిల్డ్రన్) 29వ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ.. మళ్లీ జన్మ లేదు.. పోయేటప్పుడు కళ్లుకుపోయే లేదు. కాబట్టి బతికున్నంత కాలం చరిత్రలో నిలిచిపోయేలా సేవ చేద్దామన్నారు. కేంద్రంలో అందుబాటు మంత్రిగా, అలాగే అందుబాటి అర్చకుడుగా చూడాలని ఉందన్నారు. చిలుకూరు బాలాజీ ప్రధానార్చకులు సీఎస్ రంగరాజన్ మాట్లాడుతూ.. ప్రజల్లో భక్తితో పాటు సామాజిక స్పృహను కూడా పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. బాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, ఎంఎల్‌ఆర్ విద్యా సంస్థల అధినేత మర్రి లక్ష్మణ్‌రెడ్డి, చిలుకూరు బాలాజీ ప్రధాన సేవకుడు పవన్‌కుమార్, సామాజిక కార్యకర్త కె.మాలతీ శ్రీనివాసులు మాట్లాడారు. నిర్వాహకుడు మధుకర్‌రెడ్డి స్వాగతం పలికారు. సంస్థలో 'ఆచార్య దేవో భవ' పురస్కారాలతో పాటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సన్మానించారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రంగరాజన్, తీన్మార్ మల్లన్న, బంగారు శ్రుతి, మధుకర్‌రెడ్డి

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత ఆత్మహత్య

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: విషం తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన భువనగిరి మండలంలోని నమాత్‌పల్లిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడకు చెందిన మమత(27) భర్త వీరం చిన్నాతో గొడవల కారణంగా వేరుగా ఉంటున్నారు. వీరికి ఒక కుమారుడు(6) ఉన్నాడు. నమాత్‌పల్లికి చెందిన సాయికుమార్‌రెడ్డి తనకు డబ్బులు ఇవ్వాల్సి ఉందని ఆదివారం ఆదిగేందుకు వచ్చారు. ప్రస్తుతం తన వద్ద లేవని చెప్పడంతో వాదోపవాదాలు జరిగాయి. డబ్బులు రాకపోవడం..ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై విషం తాగింది. గ్రామ శివారులో అపస్మారక స్థితిలో పడి ఉండటం గమనించి గ్రామస్థులు సాయికుమార్‌రెడ్డికి సమాచారం ఇవ్వగా మమతను భువనగిరి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు గ్రామీణ ఎస్సై సంతోష్‌కుమార్ తెలిపారు.

అమ్మ వెడలె.. భక్తులు ప్రణమిల్లె



రథంపై నిమజ్జనానికి తరలివెళ్తున్న అమ్మవారు

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: హుస్సేన్ సాగర్‌లో దుర్గామాత నిమజ్జనాలు కోలాహలంగా కొనసాగాయి. దసరా పండగ రోజైన 12వ తేదీ నుంచి మూడు రోజులు పాటు నిమజ్జన కార్యక్రమం జరిగింది. తొలి రోజు కొన్ని విగ్రహాలు మాత్రమే రాగా, రెండో రోజు మధ్యాహ్నం నుంచి పెరిగాయి.. సాయంత్రం, రాత్రి వేళల్లో శోభాయాత్రగా బయలేరిన విగ్రహాలు సోమవారం రాత్రి వరకు కొనసాగాయి. పీపుల్స్ ప్లాజా, గార్డెన్ పాయింట్, రెండు బేబీపాండ్లలో కలిపి దాదాపు 1850 పైచిలుకు విగ్రహాలు నిమజ్జనం అయ్యాయి. భారీ వాహనాల్లో చేరుకున్న విగ్రహాలను కేవలం పీపుల్స్ ప్లాజాలోనే నిమజ్జనం చేయడంతో వందల సంఖ్యలో నెక్లెస్ రోడ్డు పొడవునా నిలిపారు. గంటల కొద్దీ సమయం పడుతుండటంతో చాలా మంది అలసిపోయి వాహనాలపైనే విశ్రాంతి తీసుకున్నారు. అయితే కేవలం నెక్లెస్ రోడ్డులోనే నిమజ్జనం కొనసాగించడంతో ట్యాంక్‌బండ్, ఎన్టీఆర్ మార్గ్‌లలో ట్రాఫిక్ అంతరాయం తలెత్తలేదు. దానికి తోడు విద్యాసంస్థలకు సెలవు దినం కావడంతో రోడ్లపై ఎక్కడా రద్దీ కనిపించలేదు.



దుర్గాదేవి విగ్రహాలకు స్వాగతం పలుకుతున్న బాబా ఫసియుద్దీన్

బోరబండ: దసరా శరన్నవరాత్రి ముగియడంతో దుర్గాదేవి విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్లాయి. బోరబండలోని పలు మండపాలను సందర్శించిన కార్పొరేటర్ ఎం.డి.బాబాఫసియుద్దీన్ నిమజ్జనం కోసం తరలుతున్న విగ్రహాలకు స్వాగతం పలికారు.

ప్రయాణికుల రక్షణకు ఆర్పీఎఫ్ కృషి

రెజిమెంటల్‌బజార్: ప్రయాణికుల భద్రతకు ఆర్పీఎఫ్ పోలీసులు కృషి చేస్తున్నారని సికింద్రాబాద్ డివిజనల్ సీనియర్ సెక్యూరిటీ కమిషనర్ దేబాష్మిత ఛటోపాధ్యాయ బెనర్జీ ఓ ప్రకటనలో తెలిపారు. ఆపరేషన్ జీవన్ రక్షలో భాగంగా రైల్వేస్టేషన్లలో తమ సిబ్బంది అప్రమత్తంగా ఉంటూనే కాకుండా ఆపదలో ఉన్న ప్రయాణికులను రక్షిస్తున్నారని పేర్కొన్నారు. 2023లో అరుగురిని, 2024లో నలుగురు ప్రయాణికుల ప్రాణాలను ఆర్పీఎఫ్ సిబ్బంది కాపాడినట్లు తెలిపారు. లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో ఆర్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ పి.రాజశేఖర్, కానిస్టేబుల్ విశ్వజిత్‌కుమార్‌లు ఈ నెల 13న ప్లాట్‌ఫాంపై విధులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్-పూర్ణ ఎక్స్‌ప్రెస్ రైలు 1వ నంబర్ ప్లాట్‌ఫాం నుంచి బయలుదేరే సమయంలో రైల్లో ఎక్కేందుకు ఓ మహిళ ప్రయత్నించింది. కాలు జారడంతో కిందపడుతుండగా.. గుర్తించిన కానిస్టేబుల్లు బయటకు లాగారు. దీంతో ఆమెకు ప్రమాదం తప్పింది. ఈ విషయం తెలుసుకున్న సెక్యూరిటీ కమిషనర్ కానిస్టేబుల్లను అభినందించారు.

డివైడర్‌ను ఢీకొట్టిన ద్విచక్ర వాహనదారుడు

నారాయణగూడ, న్యూస్‌టుడే: ద్విచక్ర వాహనంపై వేగంగా వచ్చి ఎదురు పుట్‌పాత్ ఎన్టీఆర్ మార్గ్‌లో డివైడర్‌ను ఢీ కొట్టిన సంఘటన ఇది. సైఫాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనలో ద్విచక్ర వాహనదారుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికంగా ఉన్న కొందరు 108కు సమాచారం అందించగా సకాలంలో చేరుకున్న వైద్య సిబ్బంది క్షతగాత్రుడికి చికిత్స అందించి ఆసుపత్రికి తరలించారు. సంఘటనా స్థలికి చేరుకున్న సైఫాబాద్ పెట్రో కార్ పోలీసులు క్షతగాత్రునికి సంబంధించిన వివరాలు కనుక్కునే ప్రయత్నం చేయగా అతను మద్యం మత్తులో ఉన్నాడని గమనించారు. తన పేరు రవి అని, కేపీహెచ్‌బీ కాలనీలో ఉంటానని చెప్పినట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదవశాత్తు రైలుకింద పడి ఒకరి దుర్మరణం

రెజిమెంటల్‌బజార్, న్యూస్‌టుడే: రైల్లో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారి రైలు కింద పడిపోవడంతో ఓ గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం చెందారు. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్-లాలాగూడ రైల్వేస్టేషన్ల మధ్య రైలు పట్టాలపై సోమవారం ఉదయం ఓ వ్యక్తి(30) మృతదేహం ఉన్నట్టు రైల్వేస్టేషన్ అధికారుల ద్వారా జీఆర్పీ పోలీసులకు సమాచారం అందింది. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. రైల్లో ప్రయాణిస్తుండగా ప్రమాదవశాత్తు రైలు కింద పడిపోవడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. వివరాలను తెలిసిన వారు 87126 58581 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

వ్యభిచార కేంద్రంపై దాడి

యూసుఫ్‌గూడ, న్యూస్‌టుడే: ఇళ్లమధ్య నిర్వహిస్తున్న వ్యభిచార కేంద్రంపై మధురానగర్ పోలీసులు దాడిచేసి ఓ మహిళతో పాటు నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం... ఎస్ఆర్‌టీనగర్ ప్రాంతంలోని ఓ భవనం మొదటి అంతస్తులో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పక్కా సమాచారంతో పోలీసులు ఆదివారం రాత్రి దాడిచేశారు. నిర్వాహకుడు టి.వంశీతో పాటు ఏపీలోని విశాఖపట్టణం చెందిన ఓ మహిళను (బాధితురాలు) అదుపులోకి తీసుకున్నారు. మరో నిర్వాహకుడు పరారీలో ఉంది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గుడ్లగూబను కాపాడిన అగ్నిమాపక సిబ్బంది

బోరబండ, న్యూస్‌టుడే: మాంజా చుట్టుకొని చెట్టుకొమ్మకు వేలాడుతున్న ఓ గుడ్లగూబను జూబ్లీహిల్స్ అగ్నిమాపక సిబ్బంది సోమవారం కాపాడారు. మోతీనగర్ రహదారిపై ఉన్న పెద్ద రావిచెట్టుకు ఓ గుడ్లగూబ మాంజా దారం చుట్టుకుని వేలాడుతున్న విషయాన్ని స్థానికులు సమాచారంతో తెలుసుకొని సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. సమీపంలోని అపార్ట్‌మెంట్ పైకి చేరుకొని గుడ్లగూబను రక్షించారు. అటవీశాఖ వారికి అప్పగిస్తామని తెలిపారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

● ఏళ్ల నాటి వ్యర్థాల తొలగింపునకు ప్రణాళిక
● రేపటి నుంచి కార్యాచరణ

ఈనాడు, హైదరాబాద్: ముమ్మర పారిశుద్ధ్య కార్యక్రమానికి జీహెచ్ఎంసీ సిద్ధమైంది. ప్రణాళికాబద్ధంగా వీధుల్లోని చెత్తను తొలగించేందుకు నడుంబిగించింది. బల్దియా అధికారులు బుధవారం నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. రోడ్లు, పార్కులు, కాలిబాటలు, విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు, చెత్త కుప్పలు, చెరువులు, నాలాల వద్ద ఉన్న సాధారణ వ్యర్థాలు నిర్మాణ వ్యర్థాలను తొలగించాలన్నది ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశం. అందుకు సంబంధించి ఇప్పటికే అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. జోన్లు, సర్కిళ్లు, వార్డు స్థాయిలో ఎక్కడెక్కడ, ఏమేర వ్యర్థాలు ఉన్నాయనే విషయమై క్షేత్రస్థాయి నుంచి వివరాలను సేకరించి తొలగింపునకు ఏర్పాట్లు చేస్తున్నారు.



గతంలో నిధుల దుర్వినియోగం

ఖాళీ స్థలాల్లోని చెత్త తొలగింపునకు జీహెచ్ఎంసీ 2018-19లో రూ.100 కోట్లు వెచ్చించింది. పలువురు సహాయ వైద్యాధికారులు, సర్కిళ్ల ఉపకమిషనర్లు, కొందరు జోనల్ కమిషనర్లు ఇందుల్లో చేతివాటాన్ని ప్రదర్శించారు. లేని చెత్తను ఉన్నట్లుగా చూపించి, ప్రైవేటు ఒప్పందాలతో వ్యర్థాల తరలింపు వాహనాల పాటోలతో భారీగా నిధులను దారి మళ్లించారు. నిబంధనల ప్రకారం.. ప్రైవేటు ఏజెన్సీలకు చెందిన వ్యర్థాలను సీఅండ్‌డీకేంద్రానికి తరలించాలంటే వారు రవాణా ఛార్జీలు చెల్లించాలి. ప్రభుత్వం ఉచితంగా స్థలం ఇవ్వడంతో నిర్మాణ వ్యర్థాలను నామమాత్రపు ఖర్చుతో పునర్వినియోగంలోకి తెస్తూ రీసైక్లింగ్ చేయాల్సిన బాధ్యత సీఅండ్‌డీ కేంద్రంపై ఉంటుంది. ఆదేమీ పట్టించుకోకుండా ఆనాటి అధికారులు జీహెచ్ఎంసీ ఖజానాకు గండికొట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు కూడా దాదాపు అదే తరహా కార్యక్రమానికి బల్దియా శ్రీకారం చుట్టడంతో.. నిధుల దుర్వినియోగానికి తావు లేకుండా పనులు చేపట్టాలని నగరవాసులు జీహెచ్ఎంసీని హెచ్చరిస్తున్నారు.

మూడు దశల్లో..

మొదటి దశలో ఈ నెల 16 నుంచి 22 వరకు, రెండో దశలో ఈ నెల 23 నుంచి 29 వరకు, మూడో దశలో నవంబరు 2 నుంచి 8 వరకు ముమ్మర పారిశుద్ధ్య కార్యక్రమాన్ని చేపట్టాలన్నది ప్రణాళిక.

జలమండలి నిర్వాకం.. రోడ్లన్నీ అధ్వానం

వెంగళ్‌రావునగర్, న్యూస్‌టుడే: ఎర్రగడ్డ డివిజన్ ఓల్డ్‌సుల్తాన్‌నగర్ వీధుల్లో రోడ్లన్నీ దెబ్బతిని అధ్వానంగా మారాయి. వీటిని క్రితం డ్రైనేజీ పైపులైన్ల కోసం తవ్వకాలు చేపట్టి తిరిగి రోడ్డు వేయకుండా వదిలేయడంతో మట్టిరోడ్లను తలపిస్తున్నాయి. దీంతో స్థానికులు రాకపోకలు సాగించలేక ఇబ్బందులు పడుతున్నారు. బస్తీలో ఉన్న మూడు వీధుల్లో రోడ్లన్నీ గుంతలు పడటంతో చిన్నపాటి వర్షం కురిసినా చిత్తడిగా మారి అవస్థలు పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. తమ ప్రాంతంలో రోడ్ల సమస్యపై సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని తమ ప్రాంతంలో సమస్య పరిష్కరించాలని ఓల్డ్‌సుల్తాన్ వాసులు కోరుతున్నారు. ఈ విషయంపై సర్కిల్-19 ఈఈ రాజ్‌కుమార్ స్పందిస్తూ.. ఆ ప్రాంతంలో డ్రైనేజీ లైను వేసే ముందు రోడ్లు తవ్వడానికి జలమండలి వారు తమ అనుమతి తీసుకోలేదన్నారు. జలమండలి విభాగానికి నోటీసులు ఇస్తామని, వారి నుంచి నిధులు వచ్చాక రోడ్లు వేస్తామని ఈఈ తెలిపారు.





మట్టి రోడ్లను తలపిస్తున్న ఓల్డ్ సుల్తాన్‌నగర్ వీధులు

కేజేకేఎస్ వార్షికోత్సవ సభ 18న

బాగ్‌లింగంపల్లి: కల్యగీత కార్మిక సంఘం(కేజేకేఎస్) 67వ వార్షికోత్సవ సభను ఈ నెల 18న సుందరయ్య కళానిలయంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ తెలిపారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలోని సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్యగీత వృత్తిలో ఉపాధి అవకాశాలు అనే అంశంపై ప్రధానంగా చర్చిస్తామన్నారు. కార్యక్రమానికి మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, బీసీ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు హాజరవుతున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా 'సింధూర్ ఖేలా'

బంజారాహిల్స్ న్యూస్‌టుడే: దసరా పండుగ సందర్భంగా బెంగాలీ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని బంజారా పంక్షన్‌హాల్‌లో నిర్వహించిన 'శ్రీ దుర్గా పూజ' ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా విజయ దశమి (బిజోయ దశమి) రోజున బెంగాలీ సంప్రదాయ ఆచారమైన 'సింధూర్ ఖేలా' వేడుక నిర్వహించారు. దుర్గా పూజ చివరిరోజు మహిళలు వీడ్కోలు పలుకుతూ నిర్వహించిన ఈ వేడుకలో మహిళలు ఒకరికొకరు సిందూరం పూసుకున్నారు.



వేడుకలో మహిళలు

సుభో విజయ అంటూ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. దుర్గమ్మకు వీడ్కోలు పలుకు చేసే ఈ సంప్రదాయం ప్రేమ, ఐక్యత, స్త్రీశక్తికి ప్రతీకగా నిలిచింది. ఇందులో మహిళలు ఉత్సాహంతో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

సనాతన ధర్మంపై అవగాహన అవసరం

నల్లకుంట, న్యూస్‌టుడే: సనాతన ధర్మంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖశర్మ కోరారు. సోమవారం నల్లకుంటలోని శంకరమఠంలో 'సువర్ణ భారతి మహోత్సవం' అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రవచనాలు చెప్పారు. శృంగేరీ పీఠం విశిష్టత, జగద్గురు భారతీ తీర్థ మహాస్వామి వైభవం గురించి భక్తులకు వివరించారు. శృంగేరీ పీఠం, అహం బ్రహ్మస్మి ఫౌండేషన్ ప్రతినిధులు ప్రవీణ్‌శర్మ, గీతాభారతి, మరుమాముల వెంకటరమణశర్మ, శంకరమఠం ప్రధానాచారి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంజీకేవీపీతో ఉర్దూ విశ్వవిద్యాలయం ఒప్పందం

గచ్చిబౌలి: మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూయూనివర్సిటీ, వారణాసిలోని మహాత్మా గాంధీ కాశీ విద్యాపీఠ్ యూనివర్సిటీ (ఎంజీకేవీపీ) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. సోమవారం ఉర్దూవర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో ఉర్దూ వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, ఎంజీకేవీపీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆనంద్‌కుమార్ త్యాగి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు.

పద్యనాటకాల పరిరక్షణ బాధ్యత అందరిది



కళాకారులతో ఎంకె రాము, లక్ష్మీనారాయణ, కృష్ణయ్య

గాంధీనగర్: పౌరాణిక పద్యనాటకాలు కళను భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిదని సాహితీవేత్త ఎంకే రాము అన్నారు. ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో.. సోమవారం రాత్రి త్యాగరాయ గానసభలో పద్యనాటకోత్సవాలను ఘనంగా ముగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రోజులు మారినా కళాభిమానుల సంఖ్య మాత్రం తగ్గలేదన్నారు. సభకు కళాకారులు సత్కరించారు. నాటకాలు పరిరక్షణ బాధ్యత ప్రతిఒక్కరిదీ అన్నారు. ఈ సందర్భంగా ద్వారక మయసభ మట్టాన్ని సాంఘీకరంగా ప్రదర్శించారు. దుర్యోధనుడిగా ఎం.సాంబ్రాజు, శ్రీకృష్ణుడిగా టి.బాబురావు, అర్జునుడిగా నారాయణస్వామిలు ప్రదర్శనకు రక్తి కట్టించారు. నిర్వాహక సంస్థ అధ్యక్షుడు లోకం కృష్ణయ్య, ప్రముఖులు లంకా లక్ష్మీనారాయణ, వీరభోగ వసంతరాయలు తదితరులు పాల్గొన్నారు.

విస్తరణ.. ముందుకు సాగేనా?

బోరబండ, న్యూస్‌టుడే: దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రహ్మత్‌నగర్ కూడలి అభివృద్ధి పనులు త్వరగా

● రహ్మత్‌నగర్ కూడలి అభివృద్ధి సర్వేపై స్థానికుల ఆందోళన

అసమగ్రంగా సర్వే..

మరోవైపు రహదారి విస్తరణలో ప్రభావితమయ్యే ఆస్తుల వివరాల సేకరణ సర్వే సక్రమంగా జరగలేదని బాధితులు వివారం వ్యక్తం చేస్తున్నారు. జాబితాలో కొన్ని చోట్ల రెండంతస్తుల భవనాలకు రేకుల ఇళ్లుగా, ఒక అంతస్తు ఇంటిని బహుళ అంతస్తుల భవంతిగా చూపిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభావితమయ్యే ఆస్తులను 2316 చదరపు గజాలుగా నివేదికలో చూపారు. అందులో 170 గజాల నుంచి ఒక్కోగజం వరకు విస్తరణలో పోతున్నట్లు ఉందని తెలిపారు. పక్కపక్కనే ఉన్న నిర్మాణాల విషయంలో వందల గజాల వ్యత్యాసం ఎలా ఉంటుందని, రాజకీయ ప్రమేయంతో అయోమయం సృష్టిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై జీహెచ్ఎంసీ పట్టణ ప్రణాళిక అధికారులను సంప్రదించగా సరైన సమాచారం అందడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. యూసుఫ్‌గూడ వైపు నుంచి రహ్మత్‌నగర్ కూడలి మీదుగా శ్రీరామ్‌నగర్ వరకు 80 అడుగుల వెడల్పుతో విస్తరించాల్సిన రహదారి పనులు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్నాయి. పలుమార్లు సర్వేలు చేయడం, తరచూ సమావేశాలు నిర్వహించడమే



రహ్మత్‌నగర్ కూడలిలో ట్రాఫిక్

తప్ప పనులు ముందుకు సాగడం లేదని ప్రజలు వాపోతున్నారు. జీహెచ్ఎంసీ చీఫ్ సిటీప్లానర్ ఈ ప్రాంతాన్ని సందర్శించి విస్తరణ పనులు త్వరగా చేపట్టాలని అధికారులను ఆదేశించి ఏళ్లు గడుస్తున్నా ఫలితం మాత్రం శూన్యం.

అభ్యంతరాల వ్యక్తీకరణకు అవకాశం

- జనలీల కృష్ణవేణి, పట్టణ ప్రణాళిక విభాగం ఏసీపీ, సర్కిల్-19

రహ్మత్‌నగర్ కూడలి అభివృద్ధి కార్యక్రమంలో ప్రభావితమయ్యే ఆస్తుల వివరాలలో ఏమైనా అభ్యంతరాలుంటే ప్రధాన కార్యాలయంలో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. ఈ ప్రాంతంలోని ఆస్తులకు సంబంధించిన సర్వే రెండేళ్లక్రితం జరిగింది. పరిహారం చెల్లించాల్సి ఉంటుంది కనుక అన్నివిధాలా సర్వేలు చేసి నిర్ణయిస్తారు. నవంబరు 11వ తేదీలోగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం భూసేకరణ విభాగం ప్రత్యేక ఉప కలెక్టర్‌కు అభ్యంతరాల విషయంలో దరఖాస్తు చేసుకోవాలి. వాటిని పరిశీలించిన అనంతరం తుది జాబితాను విడుదల చేస్తారు.

కూకట్‌పల్లి

శబ్దం.. షరతులమయం!

డీజేలు, మైకుల వినియోగానికి అనుమతి తప్పనిసరి



ఏసీపీ శ్రీనివాసరావు

మూసాపేట, న్యూస్‌టుడే: శుభకార్యాలు, సభలు, సమావేశాలు, ప్రదర్శనలు వంటి కార్యక్రమాల్లో డీజేలు, మైకులు, సౌండ్ బాక్సులు కీలకపాత్ర పోషిస్తాయి. అయితే, వాటి వినియోగం పరిమితికి మించితే శబ్ద కాలుష్యంతోపాటు మానవాళికి ముప్పు వాటిల్లే ప్రమాదముంది. శృతిమించిన శబ్దంతో అనేక మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ చూస్తున్నాం. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో డీజేల వినియోగంపై ప్రభుత్వం నిషేధం విధించింది. సైబరాబాద్ పరిధిలో మాత్రం అనుమతి తప్పనిసరి. అందుకు షరతులతో కూడిన మార్గదర్శకాలున్నాయనే విషయం చాలా మందికి తెలియదు. మీకు తెలుసుకోవాలని ఉందా? అయితే ఈ సమాచారం మీకోసం..

మార్గదర్శకాలు.. డీజేలు, మైకుల వినియోగంపై ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పారిశ్రామిక వాడలు, వాణిజ్య సముదాయాలు, గృహసముదాయాలు, నిశబ్ధ(సైలెన్స్) ప్రాంతాలను 4 కేటగిరీలుగా విభజించారు. ఆయా ప్రాంతాల్లో ఎంత శబ్ద పరిమాణం(డెసిబుల్స్) వినియోగించాలి వంటి నిబంధనలు పొందుపరిచారు. సైలెన్స్ జోన్ పరిధిలో న్యాయస్థానాలు, ప్రార్థనా మందిరాలు, ఆసుపత్రులు, పాఠశాలలు వంటివి వస్తాయి. వాటి పరిసరాల్లో అనుమతి నిరాకరిస్తారు. మిగతా మూడింటికి షరతులతో కూడిన అనుమతినిస్తారు. పగలు, రాత్రి అనే విధానాలు పొందుపరిచారు. ఉదయం 6నుంచి రాత్రి 10గంటల వరకు పగలు. . రాత్రి 10నుంచి ఉదయం 6గంటల వరకు రాత్రిగా పరిగణిస్తారు. అనుమతి తీసుకున్నాక 3గంటలు మాత్రమే ఉపయోగించాలి. కార్యక్రమానికి గంటముందు మాత్రమే ఉపయోగించుకోవాలి. నిర్ణీత దూరానికి మించి శబ్దం వెలువడినా నేరమే.

ఠాణాల నుంచి.. స్థానిక పోలీస్‌స్టేషన్లలో దరఖాస్తు చేయాలి. నిర్ణీతరుసుంతో చలానా జతచేయాలి. పోలీసులు పరిశీలించి ఏసీపీకి నివేదించి మంజూరు చేస్తారు. కొన్ని సందర్భాల్లో అనుమతి నిరాకరించవచ్చు. అనుమతి లేకపోయినా.. పరిమితికి మించి డీజేలు, మైకులు వినియోగిస్తే జైలు శిక్షతోపాటు రూ.లక్ష వరకు జరిమానా విధిస్తారు.

జోన్‌లవారీగా శబ్ద పరిమాణ పట్టిక

జోన్	పగలు (డీబీ)	రాత్రి (డీబీ)	శబ్దం వినిపించాల్సిన దూరం
పారిశ్రామికవాడ	75	70	25 అడుగులు
వాణిజ్య ప్రాంతాలు	65	55	20 అడుగులు
గృహ సముదాయాలు	55	45	10 అడుగులు

అతిక్రమిస్తే చర్యలు: ఏసీపీ కె.శ్రీనివాసరావు, కూకట్‌పల్లి

సౌండ్ సంస్థల యజమానులు తప్పనిసరిగా లైసెన్స్‌లు పొందాలి. అందుకు ప్రతి దుకాణదారుడు డీసీపీ కార్యాలయంలో దరఖాస్తు చేయాలి. డీజేలు, మైకులు ఏర్పాటు చేయాలని వినియోగదారులు వస్తే పోలీసులు ఇచ్చిన అనుమతి లేకుండా ఏర్పాటు చేయడం నేరం. వీటిని అతిక్రమిస్తే సౌండ్ సంస్థ నిర్వాహకుడితోపాటు వినియోగదారుడిపైనా కేసులు నమోదు చేస్తాం.

కేంద్ర మంత్రికి శుభాకాంక్షలు

అల్లాపూర్, న్యూస్‌టుడే: మేడ్చల్ జిల్లా భాజపా ఓబీసీ మోర్చా కార్యదర్శి సుదర్శన్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ వారణాసి నుంచి భాజపా నాయకుడు అశుతోష్ ఓజా, అల్లాపూర్ డివిజన్ నాయకులు వెంకట్‌రెడ్డి, రాజ్‌కుమార్ సోమవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాశీ విశ్వనాథ ఆలయం చిత్రపటాన్ని బహూకరించారు.



కిషన్‌రెడ్డికి చిత్రపటాన్ని బహూకరిస్తున్న నాయకులు

హౌసింగ్‌బోర్డు స్థలాల సర్వే, జియోట్యాగింగ్

రంగంలోకి దిగిన అధికారులు

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే

ఎట్టకేలకు హౌసింగ్‌బోర్డు స్థలాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. హౌసింగ్‌బోర్డు స్థలంలో పలు ఫేజ్‌లను ఏర్పడిన కేపీహెచ్‌బీ ఆసియాలోని అతిపెద్ద కాలనీగా పేరొందింది. అభివృద్ధి ఏ స్థాయిలో ఉందో భూములకు అదే స్థాయిలో అన్యాక్రాంతమయ్యాయనే ఆరోపణలున్నాయి. కబ్జాదారులకు సిబ్బంది ఊతమిచ్చారన్న విమర్శలున్నాయి. ఇవి నిజంకావనేందుకు అధికారులు కబ్జాదారులపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయించారు. తాజా ప్రభుత్వ ఆదేశాలతో పశ్చిమ, ఉత్తర డివిజన్ల అధికారులు స్థలాలను రక్షించేందుకు రంగంలోకి దిగారు.

సచివాలయంలో కూడా పర్యవేక్షించేలా..

రెండు డివిజన్ల పరిధిలోని స్థలాలను గుర్తించి సుమారు 15నుంచి 20 రోజులు డిజిటల్ డీజీపీఎస్(డిఫ్రెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సర్వే) చేశారు. ఫొటోలు తీయించారు. క్షేత్రస్థాయి కార్యాలయాల నుంచి సచివాలయం వరకు జియోట్యాగింగ్ కూడా చేశారు. ఉదాహరణకు స్థలాల్లో కబ్జాదారుల కదలికలు, రాత్రే మట్టి డంప్ చేయడం, ఫెన్సింగ్ ఏర్పాటు, స్థానిక అధికారులు, సిబ్బంది గుర్తించడంలో విఫలమైతే సచివాలయం సిబ్బంది చూసేలా అనుసంధానం చేయనున్నారు. తొందర్లోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే రెండు డివిజన్లల్లో హౌసింగ్‌బోర్డు సిబ్బందితోపాటు ప్రైవేటు సెక్యూరిటీగార్డులు కూడా పహారా కాస్తున్న సంగతి తెలిసిందే.



ప్రీకాస్ట్ ప్రహరీ ఏర్పాటు చేయనున్న స్థలం



కేపీహెచ్‌బీలో సర్వే చేయిస్తున్న అధికారులు

ప్రీకాస్ట్ ప్రహరీలు

స్థలాల రక్షణ విషయమై సరైన నిఘా, ఎక్కడెక్కడ ఎంతెంత హౌసింగ్‌బోర్డు స్థలం ఉందో ప్రభుత్వ ఆదేశాలు మేరకు అధికారులకే తెలియని పరిస్థితి. స్థలం కబ్జా అయినా, వ్యాపారపరంగా వాడుకుంటున్నా.. ఫిర్యాదు అందితే అధికారులకు తెలిసే పరిస్థితి. మూడోఫేజ్‌లోని ఎల్ఐజీ బ్లాక్‌లో 15ఏళ్లకు పైగానే వంటశాల ఏర్పాటు చేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. తొమ్మిదోఫేజ్‌కు ఆనుకుని గోకుల్‌ప్లాట్స్‌లోని స్థలంలో అక్రమ నిర్మాణాల విషయమై 'ఈనాడు' కథనం ప్రచురించడంతో అధికారులు కాపాడారు. గతనెల 26న హౌసింగ్‌బోర్డు స్థలాల రక్షణ విషయమై 'రక్షణ కంచె ఏంతవరకు' శీర్షికన కథనం ప్రచురించింది. ఎక్కడెక్కడ స్థలాలున్నాయో వాటికి ప్రీకాస్ట్(తయారీ చేసిన సిమెంటు గోడలు) ప్రహరీలు ఏర్పాటు చేయించనున్నారు.

స్థలాల సర్వే, జియోట్యాగింగ్

పశ్చిమ డివిజన్ : సుమారు 220 ఎకరాలు
ఉత్తర డివిజన్ : సుమారు 80 ఎకరాలు
స్థలాలపై గట్టి నిఘా: కిరణ్‌బాబు, అంకమ రావు పశ్చిమ, ఉత్తర డివిజన్ల ఈఈలు

హౌసింగ్‌బోర్డు స్థలాలను కాపాడాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నాయి. పైలెట్ ప్రాజెక్ట్ కింద జవహర్‌నగర్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాం. తొందర్లోనే కేపీహెచ్‌బీ చట్టుపక్కల కూడా ఏర్పాటు చేయనున్నాం.

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి

మేడ్చల్ కలెక్టరేట్: మేడ్చల్ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణికి 33 ఫిర్యాదులు వచ్చాయి. దసరా పండగ ప్రభావంతో ప్రజావాణికి ఎక్కువ మంది ప్రజలు రాలేదు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, లా ఆఫీసర్ చంద్రావతితో కలిసి అర్జీలు స్వీకరించారు. వచ్చిన ఫిర్యాదుల్లో భూ సమస్యలు, ధరణి, రెండు పడక గదులు, పింఛన్లు ఇతర సమస్యలపై ఉన్నాయి.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, లా ఆఫీసర్ చంద్రావతి

పోచమ్మ ఆలయ రజతోత్సవాలు నేటి నుంచి

మూసాపేట: మూసాపేట పరిధి భవానీనగర్ పోచమ్మ ఆలయ రజతోత్సవాలను మంగళవారం నుంచి నిర్వహించనున్నారు. మూసాపేట పరిసర ప్రజలు అనారోగ్య సమస్యలను అధిగమించేందుకు వందల ఏళ్ల క్రితం ఇక్కడ అమ్మవారిని ప్రతిష్ఠించారు. 1999లో ఆలయ నిర్మాణం జరిగింది. అప్పటి నుంచి స్థానికులు అమ్మవారిని గ్రామదేవతగా కొలుస్తున్నారు. ఇళ్లల్లో శుభకార్యాలు నిర్వహించే ముందు తొలిపూజలు అమ్మవారికి చేశాకే శ్రీకారం చుట్టడం ఆనవాయితీగా కొనసాగుతుంది. 25ఏళ్లు పూర్తయిన సందర్భంగా మూడు రోజుల పాటు పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఛైర్మన్ అంబటి శ్రీనివాస్ తెలిపారు.



అమ్మవారి మూలవిరాట్టు, ఆలయం

ముగిసిన శ్రీవారి అధ్యయనోత్సవాలు

మూసాపేట: బాలానగర్ పరిధి సాయినగర్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో ఈ నెల 6న ఆరంభైన అధ్యయనోత్సవాలు సోమవారం ముగిసాయి. ఈ సందర్భంగా చివరి రోజైన సోమవారం పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. 108 కలశాలతో అభిషేకం, ధ్వజారోహణం, చక్రస్నానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.



స్వామివారి అలంకారం

మేమున్నాం.. మీకు తోడుగా..

వివరాలు తెలపాల్సింది.. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకే

కూకట్‌పల్లి, బాలానగర్, ఓల్డ్‌బోయిన్‌పల్లి, బాలాజీనగర్: 8008573418
కేపీహెచ్‌బీకాలనీ:8008573195, మూసాపేట:8008573423, అల్లాపూర్:9491124918

వ్యర్థాల తొలగింపు

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ నాలుగు-అయిదో రోడ్డు మధ్య వ్యర్థాల గుట్టను జీహెచ్‌ఎంసీ సిబ్బంది శుభ్రం చేశారు. ఎల్ఐజీ, ఎంఐజీ నివాసాల సముదాయాల్లో నివాసాల ముందు వ్యర్థాలు భారీగా పేరుకున్నాయి. వ్యర్థాలు తగలబెడుతుండటంతో ఆ ప్రదేశం అధ్వానంగా మారింది. వ్యర్థాలను తొలగించాలని 'ఈనాడు' జీహెచ్‌ఎంసీ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లడంతో ఆ ప్రదేశాన్ని శుభ్రం చేయించారు.



రాజేంద్రప్రసాద్‌కు సినీ, రాజకీయ ప్రముఖులు ఓదార్పు

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కుమార్తెను కోల్పోయిన సినీనటుడు రాజేంద్రప్రసాద్‌ను సోమవారం పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఓదార్చారు. భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, వివేకానంద్‌గౌడ్, కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, నటులు శ్రీకాంత్, జీవిత, రాజశేఖర్, దర్శకుడు అనిల్ రావిపూడి కేపీహెచ్‌బీ 13వ ఫేజ్‌లోని ఇందూ విల్లాస్‌లోని రాజేంద్రప్రసాద్ నివాసంలో ఆయనతోపాటు ఆయన కటుంబసభ్యులను పరామర్శించారు. కేటీఆర్ మాట్లాడుతూ..ఎన్నో వినోదాత్మక చిత్రాల్లో ప్రేక్షకులను తన నటనతో నవ్వించిన రాజేంద్రప్రసాద్ కుమార్తె గాయత్రి అకాల మరణం కలచివేసిందన్నారు. తమ కుటుంబం, పార్టీ తరపున ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు తెలిపారు.



గాయత్రి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కేటీఆర్

ఈఎంఆర్ఐలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కీసర, న్యూస్‌టుడే: ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ 108 కాల్ సెంటర్‌లో పని చేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ షేక్ జాన్ షాహిద్ తెలిపారు. ఇంటర్, డిగ్రీ చేసిన వారు అర్హులన్నారు. ఈనెల 15 నుంచి 19వరకు మేడ్చల్ గుండ్లపోచంపల్లిలోని కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఆసక్తిగలవారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ పత్రాలు వెంట తీసుకొని రావాలన్నారు.

దేశంలో చూపుకోల్పోతున్న వారి సంఖ్య పెరుగుతోంది



వేడుకను ప్రారంభిస్తున్న రంగరాజన్, తీన్మార్ మల్లన్న, బంగారు శృతి, మధుకర్‌రెడ్డి తదితరులు...

రవీంద్రభారతి, న్యూస్‌టుడే: దేశంలో చూపు కోల్పోతున్నవారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోందని శాసనమండలి సభ్యుడు తీన్మార్ మల్లన్న అన్నారు. కాబట్టి ఈ రంగంలో కృషి, సేవ చేసేవారి బాధ్యత కూడా పెరుగుతుందన్నారు. సోమవారం రాత్రి రవీంద్రభారతిలో 'ఇట్రాడ్' (ఇనిస్టిట్యూట్ ఫర్ ట్రైనింగ్ రిలీఫ్ రిహాబిలిటేషన్ ఆఫ్ డిసెబుల్డ్ డిస్ట్రెస్డ్ అండ్ డిస్ఇన్‌హెరిటెడ్ చిల్డ్రన్) 29వ వ్యవస్థాపక దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మల్లన్న మాట్లాడుతూ..మళ్లీ జన్మ లేదు. . పోయేటప్పుడు కట్టుకుపోయేది లేదు. కాబట్టి బతికున్నంత కాలం చరిత్రలో నిలిచిపోయేలా సేవ చేద్దామన్నారు. కేంద్రంలో అంధుడిని మంత్రిగా, అంధుడిని అర్చకుడుగా చూడాలని ఉందన్నారు. చిలుకూరు బాలాజీ ప్రధానార్చకులు సీఎస్ రంగరాజన్ మాట్లాడుతూ..ప్రజల్లో భక్తితోపాటు సామాజిక స్పృహను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శృతి, ఎంఎల్ఆర్ విద్యాసంస్థల అధినేత మర్రి లక్ష్మణ్‌రెడ్డి, చిలుకూరు బాలాజీ ప్రధాన సేవకుడు పవన్ కుమార్, సామాజిక కార్యకర్త కె.మాలతీ శ్రీనివాస్‌లు మాట్లాడారు. నిర్వాహకుడు మధుకర్‌రెడ్డి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా 'ఆచార్య దేవో భవ' పురస్కారాలతో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అధినేతలు నేమాని బాలత్రిపుర సుందరి, మల్లంపాటి విజయలక్ష్మీ, పి.స్నేహలత, తుకమ్మ కస్తూరిరెడ్డి, మంద అన్నపూర్ణ, చిమ్ముల జైపాల్‌రెడ్డి, చిమ్ముల పుష్పలత దంపతులు, వి.ఉమామహేశ్వరి, వి.సుధాహరికృష్ణన్, కె.దుర్గాకుమార్‌రెడ్డి తదితరులకు సత్కరించారు. ముందుగా విద్యార్థుల సాంస్కృతిక అంశాలు ఆకట్టుకున్నాయి.

హత్య కేసులో ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ హనుమంతరావు. చిత్రంలో నిందితులు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని దీనబంధు కాలనీలో జరిగిన హత్య కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. బాలానగర్ ఏసీపీ హనుమంతరావు తెలిపిన వివరాల ప్రకారం...దీనబంధు కాలనీకి చెందిన మహ్మద్ నదీమ్ పాషా, మహ్మద్ ఖలీల్(23), వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ నివాసి కట్ట వరప్రసాద్(23) స్నేహితులు. జులాయిగా తిరిగే మహ్మద్ నదీమ్ పాషాకు మద్యం, గంజాయి అలవాటు ఉంది. అతడు తరచూ గంజాయి తాగి స్నేహితులు, చుట్టుపక్కల వారిని బెదిరించేవాడు. గంజాయి తాగడం మానుకోవాలని నదీమ్ పాషాకు స్నేహితులు మహ్మద్ ఖలీల్, వరప్రసాద్ చెప్పేవారు. తన విషయంలో జోక్యం చేసుకుంటే హత్య చేస్తానని బెదిరించేవాడు. శనివారం రాత్రి వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ నివాసి వరప్రసాద్ జన్మదిన వేడుకల్లో అందరూ మద్యం తాగారు. ఆదివారం తెల్లవారుజామున దీనబంధు కాలనీకి వచ్చారు. మహ్మద్ నదీమ్.. ఖలీల్‌తో గొడవపడి చంపేస్తానని బెదిరించాడు. అతడు వరప్రసాద్‌తో కలిసి ఇనుపరాడ్లతో మహ్మద్ నదీమ్ తలపై, ముఖంపై విచక్షణారహితంగా కొట్టడంతో మృతి చెందాడు. నిందితులు పారిపోయారు. సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు మహ్మద్ ఖలీల్, వరప్రసాద్ హత్య చేసినట్లు నిర్ధారించారు. సోమవారం ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ నర్సింహ, డీఐ అంజయ్య, ఎస్సై విఠల్‌రావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

తొర్రూరు, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందిన దుర్ఘటన తొర్రూరు డివిజన్ కేంద్రంలో సోమవారం ఉదయం చోటు చేసుకుంది. స్థానిక ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదారాబాద్ జీడిమెట్లకు చెందిన కోన వరుణ్(22) తన మిత్రుడు సాయిసూర్యవర్ధన్‌తో కలిసి ద్విచక్రవాహనంపై మహబూబాబాద్ వైపునకు వెళ్తున్నారు. ఈ క్రమంలో డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందు వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై బోర్‌వెల్ వాహనం వెళ్తుండగా, ఒక్కసారిగా సైడ్‌కు తిప్పగా, పక్క నుంచి వెళ్తున్న వరుణ్ వాహనానికి తగలడంతో కింద పడిపోయాడు. వెంటనే వరుణ్ పైనుంచి టైర్ వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సాయిసూర్యవర్ధన్‌కు స్వల్ప గాయాలయ్యాయని ఎస్సై పేర్కొన్నారు. మృతుడి బాబాయ్ రాఘవేంద్ర ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని వివరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

కేపీహెచ్‌బీకాలనీ, న్యూస్‌టుడే: కేపీహెచ్‌బీ ఠాణా పరిధిలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం..జేఎన్‌టీయూ చౌరస్తాలోని శివాలయం ఎదురుగా సుమారు 6 నెలలుగా ఓ వ్యక్తి చెప్పులు కుడుతూ పాలిష్ చేస్తున్నాడు. పక్కనే ఉన్న బస్‌షెల్టర్‌లో నిద్రించేవాడు. సోమవారం సాయంత్రం ఆలయ పూజారి వచ్చిన సమయంలో సదరు వ్యక్తి కదల్లేని స్థితిలో ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు వ్యక్తి మృతిచెందాడని నిర్ధారించుకొని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. మృతిచెందిన వ్యక్తి వివరాలు తెలియరాలేదని, వయసు 60ఏళ్లు ఉంటాయని పేర్కొన్నారు.

మద్యం తాగొద్దన్నందుకు భవనంపై నుంచి దూకిన భర్త..

దుండిగల్, న్యూస్‌టుడే: మద్యం విషయంలో దంపతుల మధ్య జరిగిన గొడవతో మనస్తాపానికి గురైన భర్త భవనంపై నుంచి దూకి.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. సారెగూడెంకు చెందిన పి.శ్రీశైలం(40), సౌజన్య దంపతులు. వారికి ఇద్దరు సంతానం. అతను తరచూ మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. ఆదివారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. మద్యం తాగొద్దని భార్య పేర్కొనడంతో గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన భర్త భవనం మూడో అంతస్తు నుంచి కిందికి దూకాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని కుటుంబ సభ్యులు, స్థానికులు సూరారంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

చెట్ల కొమ్మలు.. చెత్తాచెదారం



నడకదారిలో అడ్డుగా ఇలా..

పాదచారుల మార్గంలో అవస్థలు

మూసాపేట, న్యూస్‌టుడే: ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న పాదచారుల మార్గం అపరిశుభ్రంగా మారింది. దీంతో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కూకట్‌పల్లి జాతీయ రహదారి నుంచి రంగధాముని చెరువు కట్ట మీదుగా సైబర్‌సిటీ చౌరస్తా వరకు విస్తరించి ఉన్న మెయిన్ రోడ్డుకు ఇరువైపులా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో నడకదారులు నిర్మించారు. రాకపోకలు సాగించే పాదచారులతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్స్ పెద్దఎత్తున వస్తుంటారు. అత్యంత రద్దీగా ఉండే నడకదారులకు ఈ పాదచారుల మార్గమే శరణ్యం. అయితే, ప్రస్తుతం ఇక్కడ సమస్యలు రాజ్యమేలుతున్నాయి. నడకదారికి చెట్లకొమ్మలు అడ్డుగా వచ్చాయి. దీంతో నడక సాగించే సమయంలో ఆయా చెట్లకొమ్మలకు అంటిపెట్టుకుని ఉండే క్రిమికీటకాలు నడకదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కొన్నిసార్లు చర్మ సంబంధిత సమస్యలు తలెత్తుతున్నాయి. రోజుల తరబడిగా దారిని శుభ్రం చేయకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోతుంది. కొన్నిచోట్ల తాగుబోతులు మద్యం సీసాలు సైతం పారేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని పరిసర ప్రజలు కోరుతున్నారు.



మరో ప్రాంతంలో..

దేశ ప్రగతే లక్ష్యంగా భాజపా ఆవిర్భావం



పార్టీ సభ్యత్వ నమోదులో ఎంపీ రఘునందన్‌రావు, స్థానిక నాయకులు

రాయదుర్గం, న్యూస్‌టుడే: భాజపా ప్రజా సేవ, దేశ ప్రగతి కోసమే ఆవిర్భవించిందని, దశాబ్దాలుగా అదే విలువలపైనే ముందుకు సాగుతోందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. నానక్‌రాంగూడలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై పలువురి సభ్యత్వ పత్రాలను అందజేశారు. ఇతర పార్టీలు అధికారం కోసమే పనిచేస్తాయని, వారసులకు పదవులు కట్టబెట్టడం, వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకోవాలనే స్వార్థ చింతనతోనే ఉంటాయని, భాజపా అందుకు భిన్నంగా పేదల అభ్యున్నతి, నీతివంతమైన పాలనపై దృష్టి పెడుతుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి రవికుమార్ యాదవ్, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, నేతలు వసంత్ కుమార్ యాదవ్, నరేందర్ ముదిరాజ్, మీన్‌లాల్ సింగ్, వరలక్ష్మి, హనుమంతు నాయక్, దయాకర్, శివా సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీకేవీపీతో ఉర్దూ విశ్వవిద్యాలయం ఒప్పందం

గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూయూనివర్సిటీ, వారణాసిలోని మహాత్మాగాంధీ కాశీ విద్యాపీఠ్ యూనివర్సిటీ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. సోమవారం ఉర్దూ వర్సిటీలో వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, ఎంజీకేవీపీ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆనంద్‌కుమార్ త్యాగి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. రెండు వర్సిటీలు విద్య, పరిశోధన సంబంధిత అంశాల్లో కలిసి పనిచేయనున్నాయి. కొత్త కోర్సుల రూపకల్పన, నిర్వహణ వంటి అంశాల్లో పరస్పర సహకారంతో ముందుకెళ్లాలని నిర్ణయించారు.

కూకట్‌పల్లి ఎస్సైగా నర్సింహ

మూసాపేట: కూకట్‌పల్లి ఎస్సైగా కె.నర్సింహ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న చంద్రకాంత్ మైలార్‌దేవులపల్లి ఠాణాకు బదిలీ కాగా.. ఆయన స్థానంలో రామచంద్రాపురం ఠాణాలో పనిచేస్తున్న నర్సింహను ఇక్కడికి బదిలీ చేస్తూ సీపీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మారణాయుధాలతో దుండగుల హల్‌చల్!

రాయదుర్గం: గోపన్‌పల్లి టీఎన్‌జీఓస్ కాలనీలో ఆదివారం రాత్రి ముసుగులు ధరించిన ముగ్గురు మారణాయుధాలతో సంచరించడం స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. కాలనీవాసుల కథనం ప్రకారం..అర్ధరాత్రి ప్రహరీ దూకి ఓఇంట్లోకి ప్రవేశించేందుకు యత్నించగా పక్కన హాస్టల్‌లోని యువకులు చూసి అరవడంతో పరారయ్యారు. మరో ఇంట్లోకి వెళ్లేందుకూ చేసిన యత్నం స్థానికుల అప్రమత్తతతో విఫలమవడంతో పారిపోయారు. గస్తీ పోలీసులు ఆ ప్రాంతాన్ని పరిశీలించినట్లు చెప్పారు. ఈ విషయంపై ఫిర్యాదు అందలేదని గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ హబీబుల్లా ఖాన్ తెలిపారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

ఏళ్ల నాటి వ్యర్థాల తొలగింపునకు రేపటి నుంచి కార్యాచరణ

ఈనాడు, హైదరాబాద్: ముమ్మర పారిశుద్ధ్య కార్యక్రమానికి జీహెచ్‌ఎంసీ సిద్ధమైంది. ప్రణాళికాబద్ధంగా వీధుల్లోని చెత్తను తొలగించేందుకు నడుంబిగించింది. బల్దియా అధికారులు బుధవారం నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. రోడ్లు, పార్కులు, కాలిబాటలు, విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు, చెత్తకుప్పలు, చెరువులు, నాలాల వద్ద ఉన్న సాధారణ వ్యర్థాలు నిర్మాణ వ్యర్థాలను తొలగించాలన్నది ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశం. అందుకు సంబంధించి ఇప్పటికే అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. జోన్లు, సర్కిళ్లు, డివిజన్ల స్థాయిలో ఎక్కడెక్కడ, ఏమేర వ్యర్థాలు ఉన్నాయన్న విషయమై క్షేత్రస్థాయి నుంచి వివరాలను సేకరించి తొలగింపునకు ఏర్పాట్లు చేస్తున్నారు.

గతంలో నిధుల దుర్వినియోగం

దారులు, ఖాళీ స్థలాల్లోని చెత్త తొలగింపునకు జీహెచ్‌ఎంసీ 2018-19లో రూ.100 కోట్లు వెచ్చించింది. పలువురు సహాయ వైద్యాధికారులు, సర్కిళ్ల ఉపకమిషనర్లు, కొందరు జోనల్ కమిషనర్లు ఇందుల్లో చేతివాటాన్ని ప్రదర్శించారు. లేని చెత్తను ఉన్నట్లుగా చూపించి, ప్రైవేటు ఆస్తుల్లోని వ్యర్థాల తరలింపు వాహనాల ఫొటోలతో భారీగా నిధులను దారి మళ్లించారు. నిబంధనల ప్రకారం.. ప్రైవేటు వ్యక్తులకు చెందిన వ్యర్థాలను సీఅండ్‌డీ కేంద్రానికి తరలించాలంటే వారు రవాణా ఛార్జీలు చెల్లించాలి. ప్రభుత్వం ఉచితంగా స్థలం ఇవ్వడంతో నిర్మాణ వ్యర్థాలను నామమాత్రపు ఖర్చుకు సేకరించి వాటిని రీసైక్లింగ్ చేయాల్సిన బాధ్యత సీఅండ్‌డీ కేంద్రంపై ఉంటుంది. అదేమీ పట్టించుకోకుండా ఆనాటి అధికారులు జీహెచ్‌ఎంసీ ఖజానాకు గండికొట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు కూడా దాదాపు అదే తరహా కార్యక్రమానికి బల్దియా శ్రీకారం చుట్టడంతో.. నిధుల దుర్వినియోగానికి తావు లేకుండా పనులు చేపట్టాలని నగరవాసులు జీహెచ్‌ఎంసీని హెచ్చరిస్తున్నారు.

మూడు దశల్లో..

- మొదటి దశలో ఈ నెల 16 నుంచి 22 వరకు, రెండో దశలో ఈ నెల 23 నుంచి 29 వరకు, మూడో దశలో నవంబరు 2 నుంచి 8 వరకు ముమ్మర పారిశుద్ధ్య కార్యక్రమాన్ని చేపట్టాలన్నది ప్రణాళిక.

శేరిలింగంపల్లి

•శేరిలింగంపల్లి • పటాన్‌చెరు

ఎంజీకేవీపీతో ఉర్దూ విశ్వవిద్యాలయం ఒప్పందం

గచ్చిబౌలి:గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూయూనివర్సిటీ, వారణాసిలోని మహాత్మాగాంధీ కాశీ విద్యాపీఠ్ యూనివర్సిటీ (ఎంజీకేవీపీ) మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. సోమవారం ఉర్దూవర్సిటీలో నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, ఎంజీకేవీపీ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఆనంద్‌కుమార్ త్యాగి ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. రెండు వర్సిటీలు విద్య, పరిశోధన సంబంధిత అంశాల్లో కలిసి పనిచేయనున్నాయి. కొత్త కోర్సుల రూపకల్పన, నిర్వహణ వంటి అంశాల్లో పరస్పర సహకారంతో ముందుకెళ్లాలని నిర్ణయించారు.

విద్యార్థులకు గుర్తింపు కార్డుల పంపిణీ

శేరిలింగంపల్లి, న్యూస్‌టుడే: బీహెచ్ఈఎల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఐడీ కార్డుల జారీ ప్రారంభించారు. ప్రిన్సిపల్ రవీందర్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.

వృథాగా వెజ్ మార్కెట్..
వీధుల్లోనే వ్యాపారాలు

వినియోగంలోకి తేవడంపై దృష్టి సారించని అధికారులు

న్యూస్‌టుడే, చందానగర్: రోడ్లకు ఇరువైపులా కూరగాయలు, పండ్ల వ్యాపారాల కారణంగా తలెత్తుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం రూ.లక్షల వ్యయంతో చందానగర్‌లో జీహెచ్ఎంసీ వెజ్‌మార్కెట్‌ను నిర్మించింది. వినియోగంలోకి తేవడంపై మాత్రం అధికారులు దృష్టి సారించకపోవడంతో అలంకారప్రాయంగా మారింది.



64 మందిని గుర్తించి...

2020లో వీధి వ్యాపారుల కోసం చందానగర్ హుడాకాలనీ వద్ద రూ. 80 లక్షలతో వెజ్ మార్కెట్ నిర్మించారు. 64 మందిని అర్హులుగా గుర్తించి అక్కడ వ్యాపారానికి అనుమతించినా, అక్కడ తగిన వసతులు లేవంటూ వెళ్లేందుకు వారు ఆసక్తి చూపలేదు. ఈ క్రమంలో నాలుగేళ్లు గడిచిపోయినా.. వసతులు కల్పించి వినియోగంలోకి తేవడంపై అధికారులు శ్రద్ధ కనబరచడం లేదు.

వీధి వ్యాపారుల డిమాండ్లు ఇవీ..

- మార్కెట్‌లో తాగునీరు ఇతర మౌలిక వసతులు కల్పించాలి.
- రాత్రి వేళ కూరగాయలు, పండ్లు భద్రంగా నిల్వ చేసుకునేందుకు ప్రత్యేక గదులు నిర్మించాలి.
- గతంలో గుర్తింపు కార్డులు ఉన్న వారినే మార్కెట్‌లోకి అనుమతించాలి.
- కొత్తగా రహదారులపై విక్రయించే వారిని ఇక్కడికి అనుమతించకూడదు.
- మార్కెట్ ఉన్న హుడాకాలనీ, పాపిరెడ్డికాలనీ ప్రాంతాల్లో వారాంతపు సంతల నిర్వహణ జరగకుండా చర్యలు తీసుకోవాలి.

పేరుకే వెండింగ్ కమిటీ..

ప్రభుత్వం 2014లో వీధి వ్యాపారుల చట్టం తీసుకొచ్చింది. టౌన్ వెండింగ్ కమిటీ ఏర్పాటు చేసి నిబంధనల ప్రకారం అందులో ఉండాల్సిన సభ్యులను పేర్కొంది. సర్కిల్ స్థాయిలో ఉపకమిషనర్ ఛైర్‌పర్సన్‌గా, డీపీవో కన్వీనర్‌గా వ్యవహరించే కమిటీలో 19 మంది సభ్యులు ఉంటారు. స్థానిక ప్రజాప్రతినిధి, ట్రాఫిక్, రెవెన్యూ, పారిశుద్ధ్యం, టౌన్ ప్లానింగ్ విభాగాల ప్రతినిధులు, జిల్లా బ్యాంక్ అధికారి, ఎన్జీఓ, ట్రేడ్ మార్కెట్, కమ్యూనిటీ బేస్ ఆర్గనైజేషన్, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల నుంచి ఒక్కొక్కరు, వీధి వ్యాపారులు ఏడుగురు సభ్యులుగా ఉంటారు. వీధి వ్యాపారుల సమస్యలపై చర్చించేందుకు ప్రతి రెండు నెలల కోసారి ఈ కమిటీ సమావేశం జరగాలి. అలాంటిది ఏడాది వ్యవధిలో ఒక్కసారి జరిగిన దాఖలాలు లేవు. సభ్యులు హాజరు కాకపోవడంతో కోరం లేక సమావేశాలు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది.

సమస్య ఉన్నప్పుడైనా.. ఏదీ శ్రద్ధ?

చందానగర్ సర్కిల్ పరిధి అంతటా జాతీయ రహదారితోపాటు ముఖ్యమైన అంతర్గత రహదారులు ఉండటంతో వీధి వ్యాపారాలపరంగా రెడ్ జోన్‌లు ఎక్కువ. అంటే ఈ జోన్‌లో వ్యాపారాలకు అనుమతి ఉండదు. మరోవైపు గ్రీన్ జోన్ ప్రాంతమైన హుడాకాలనీ వెజ్ మార్కెట్ వాడకంలో లేని పరిస్థితి. ఇలాంటి సమస్య ఉన్నందునైనా వెండింగ్ కమిటీ క్రియాశీలకంగా వ్యవహరించాలి. అన్ని విభాగాల అధికారులు సమావేశమై చర్చిస్తే సమస్య పరిష్కారానికి అవకాశం ఉంటుంది. వీధి వ్యాపారుల డిమాండ్ల పరిష్కారం దిశగా చర్యలు చేపట్టడంలో ఆయా శాఖల అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.

ప్రజా సేవ, దేశ ప్రగతే లక్ష్యంగా భాజపా ఆవిర్భావం: ఎంపీ

రాయదుర్గం, న్యూస్‌టుడే: భాజపా ప్రజా సేవ, దేశ ప్రగతి కోసమే ఆవిర్భవించిందని, దశాబ్దాలుగా అదే విలువలపైనే ముందుకు సాగుతోందని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. నానక్‌రాంగూడలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై పలువురి సభ్యత్వ పత్రాలను అందజేశారు. ఇతర పార్టీలు అధికారం కోసమే పనిచేస్తాయని, వారసులకు పదవులు కట్టబెట్టడం, వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకోవాలనే స్వార్థ చింతనతోనే ఉంటాయని, భాజపా అందుకు భిన్నంగా పేదల అభ్యున్నతి, నీతివంతమైన పాలనపై దృష్టి పెడుతుందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి రవికుమార్ యాదవ్, కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి, నేతలు వసంత్ కుమార్ యాదవ్, నరేందర్ ముదిరాజ్, మీన్‌లాల్ సింగ్, వరలక్ష్మి, హనుమంతు నాయక్, దయాకర్, శివా సింగ్ తదితరులు పాల్గొన్నారు.


పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో రఘునందన్‌రావు, స్థానిక నాయకులు

గచ్చిబౌలిలో 'వస్త్రం బై సింఘానియాస్'

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: మిస్ యూనివర్స్ ఆంధ్రప్రదేశ్ 2024 టైటిల్ విజేత చందనా జయరాం సోమవారం గచ్చిబౌలిలో సందడి చేశారు. ఇక్కడ ది ప్లాటినా మాల్‌లో "వస్త్రం బై సింఘానియాస్" పేరిట ఏర్పాటు చేసిన షోరూంను ప్రారంభించారు. షోరూం డైరెక్టర్ శైలేష్ సింఘానియా మాట్లాడుతూ...ఫాస్ట్ ఫ్యాషన్ ఉత్పత్తులతో పాటుచీరలు, సమకాలిన దుస్తులు, వైవిధ్యమైన ఫ్యాషన్ డ్రస్సులు ఇక్కడ అందుబాటులో ఉంటాయని చెప్పారు.


షోరూంను ప్రారంభిస్తున్న చందనా జయరాం

వైభవంగా అమ్మవారి ఊరేగింపు


కార్యక్రమంలో మియాపూర్ గ్రామ యూత్ అసోసియేషన్ సభ్యులు

మియాపూర్, న్యూస్‌టుడే: మియాపూర్ గ్రామంలో దసరా నవరాత్రి వేడుకల్లో భాగంగా తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న అమ్మవారి నిమజ్జనోత్సవ ఊరేగింపు ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మియాపూర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగిన ఈ కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా సాగింది. గ్రామ పెద్దలు రామ్‌చందర్ ముదిరాజ్, ఓం ప్రకాష్, నాగేశ్వర్ గౌడ్, గోపాల్ ముదిరాజ్, సత్యం గౌడ్, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌లో దేవీ శరన్నవ రాత్రుల సందర్భంగా పూజలు అందుకున్న అమ్మవారి విగ్రహాన్ని సోమవారం నిమజ్జనం చేశారు. తొలుత మున్సిపల్ ఛైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో పుర వీధుల్లో ఊరేగించారు.

6 తులాల బంగారం, 30 తులాల వెండి చోరీ

పటాన్‌చెరు అర్బన్: దసరా పండగకు స్వగ్రామాలకు వెళ్లిన వారి ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగలు రెచ్చిపోయారు. పటాన్‌చెరు ఠాణా పోలీసుల కథనం ప్రకారం.. తెల్లాపూర్ మున్సిపల్ పరిధి పోచారం శివారులో ఆదివారం రాత్రి మూడిళ్లలో చోరీకి యత్నించారు. ప్రవీణ్ ఇంట్లో 6 తులాల బంగారం, రమేష్ ఇంట్లో 30 తులాల వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. దొంగలు ఇళ్ల లోపల సంచరిస్తున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి.

మారణాయుధాలతో దుండగుల హల్‌చల్!

రాయదుర్గం: గోపన్‌పల్లి టీఎన్‌జీఓస్ కాలనీలో ఆదివారం రాత్రి ముసుగులు ధరించిన ముగ్గురు మారణాయుధాలతో సంచరించడం స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. కాలనీ వాసుల కథనం ప్రకారం.. అర్ధరాత్రి దాటాక ప్రహరీ దూకి ఓ ఇంట్లోకి ప్రవేశించేందుకు యత్నించగా పక్కన ఉన్న హాస్టల్‌లోని యువకులు చూసి పెద్దగా అరవడంతో పలాయనం చిత్తగించారు. మరో ఇంట్లోకి వెళ్లేందుకూ వారు చేసిన యత్నం స్థానికుల అప్రమత్తతతో విఫలమవడంతో పారిపోయారు. సమాచారం ఇవ్వడంతో గస్తీ పోలీసులు వచ్చి ఆ ప్రాంతాన్ని పరిశీలించినట్లు చెప్పారు. ఈ విషయంపై ఎలాంటి లిఖిత పూర్వక ఫిర్యాదు అందలేదని గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ హబీబుల్లా ఖాన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

పటాన్‌చెరు అర్బన్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతిచెందిన ఘటన పటాన్‌చెరు ఠాణా పరిధిలో జరిగింది. ఎస్సై కుర్షిద్ తెలిపిన వివరాల ప్రకారం.. అంబేడ్కర్‌కాలనీకి చెందిన నవీన్‌కుమార్(35) ప్రైవేటు ఉద్యోగి. దసరారోజున స్నేహితులను కలుస్తానని ఇంట్లో చెప్పి ద్విచక్రవాహనంపై వెళ్లాడు. మార్కెట్ కాంటా వద్ద రహదారిపై వాహనం పడిపోవడంతో గాయాలయ్యాయి. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు.

చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పటాన్‌చెరు, న్యూస్‌టుడే: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం చెరువులో తేలింది. అమీన్‌పూర్ పోలీసు స్టేషన్ సీఐ నాగరాజు తెలిపిన వివరాలు.. మున్సిపాలిటీ పరిధి నర్రిగూడ గ్రామానికి చెందిన షంబి చెరువులో ఆదివారం సాయంత్రం ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెలికితీసి పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి తరలించి.. హెడ్ కానిస్టేబుల్ వెంకటేశం ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు ఉద్ధృతం చేస్తాం: సీపీఎం

పటాన్‌చెరు అర్బన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు డిమాండ్ చేశారు. పటాన్‌చెరు ఐలా భవన్‌లో సోమవారం సీపీఎం ఏరియా మహాసభల్లో ఆయన మాట్లాడారు. సమస్యలపై పోరాటాలను ఉద్ధృతం చేస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వం మతోన్మాద విధానాలను విడనాడాలని, ప్రజల మధ్య చీలికలు తెచ్చే రాజకీయాలను భాజపా మానుకోవాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లేష్, రాజయ్య, ఏరియా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.





శేరిలింగంపల్లి

• శేరిలింగంపల్లి • పటాన్‌చెరు

మురుగు పొంగింది.. నివాసాల మధ్య నిలిచింది



ఆల్విన్ కాలనీ డివిజన్ పీజేఆర్ కాలనీలో..

ఆల్విన్‌కాలనీ: మ్యాన్‌హోళ్లలో పేరుకున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించి. .మురుగు సాఫీగా ముందుకు వెళ్లేలా చూడాల్సిన అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారుతోంది. ఆల్విన్‌కాలనీ డివిజన్ పీజేఆర్‌నగర్‌లో సోమవారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికే మ్యాన్‌హోళ్ల నుంచి పొంగి కాలనీలోని ఆరు బ్లాక్‌లను ముంచెత్తింది. వర్షానికి ఎగువ కాలనీల నుంచి మురుగు పోటెత్తింది. 19, 21, 22, 27, 25, 26 బ్లాక్‌ల మధ్య నిలిచిపోవడంతో స్థానికులు అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.

సీఎం సహాయ నిధి చెక్కు అందజేత

ఆల్విన్‌కాలనీ, న్యూస్‌టుడే: శేరిలింగంపల్లి నియోజకవర్గం కొండాపూర్ డివిజన్ కొత్తగూడ గ్రామానికి చెందిన శివశంకర్ రెడ్డికి అత్యవసర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 5 లక్షలు మంజూరయ్యాయి. చెక్కును సోమవారం ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు

గ్రామ కార్యదర్శుల బదిలీ

పటాన్‌చెరు: పటాన్‌చెరు, అమీన్‌పూర్ మండలాలకు చెందిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు బదిలీ అయ్యారు. పోచారం కార్యదర్శి ప్రవీణ్‌ను ఇస్నాపూర్‌కు, ఇస్నాపూర్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిని పోచారం గ్రామానికి, ఐలాపూర్ కార్యదర్శి సచిన్‌ను సదాశివపేట మండలం ఆత్మకూరుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. న్యాల్‌కల్ మండలానికి చెందిన దయానంద్ ఐలాపూర్‌కు వచ్చారు.



ప్రజల సహకారంతో నేరాల నియంత్రణ




మియాపూర్ నూతన సీఐ క్రాంతి కుమార్

మియాపూర్, న్యూస్‌టుడే: ప్రజల తోడ్పాటుతో నేరాల నియంత్రణకు కృషి చేస్తానని మియాపూర్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన కె. క్రాంతికుమార్ అన్నారు. జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ నుంచి ఆయన బదిలీపై వచ్చారు. ఎస్ఐగా సైబరాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పని చేశానని, ఇక్కడ జరిగే నేరాల తీరుతెన్నులపై అవగాహన ఉందని పేర్కొన్నారు. కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, నిర్వహణ, సైబర్ మోసాలనును తగ్గించే దిశగా ప్రజల్లో చైతన్యం తెచ్చే కార్యక్రమాలు చేపడతామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.







కుత్బుల్లాపూర్

భక్తిశ్రద్ధలతో పవిత్రోత్సవాలు ప్రారంభం


కార్యక్రమంలో వేద పండితులు

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: జీడిమెట్ల డివిజన్ ఎన్సీఎల్ కాలనీ సౌత్‌లోని శ్రీదేవి, భూదేవిసమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి సహిత అభయాంజనేయస్వామి ఆలయంలో సోమవారం చతుర్ధ పవిత్రోత్సవాలు భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. దేవాలయ కమిటీ నేతృత్వంలో విశ్వక్సేనారాధన, రక్షాబంధనం, అకుంరార్పణ, అధివాస హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు, దేవాలయ కమిటీ, సంక్షేమ సంఘం నేతలు ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ కమిటీ ఛైర్మన్ సాంబశివరాజు దంపతులు పాల్గొన్నారు.

అలరించిన భగవద్గీత అగ్నిహోత్రం


శైలజను అభినందిస్తున్న జగదీశ్వర్

నిజాంపేట: ఓం పరంపర సంస్థ ఆధ్వర్యంలో బాచుపల్లి శివాలయంలో అష్టోత్తర శత కుండాత్మక భగవద్గీత అగ్నిహోత్రం కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమానికి సీఐ జగదీశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీరాం స్కూల్ డైరెక్టర్ శ్రీకాంత్, బీవీఆర్ఐటీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కె.కవిత, విశ్వ గ్లోబల్ స్కూల్ వ్యవస్థాపక సభ్యుడు గంప సుధాకర్ పాల్గొన్నారు.

పోలీస్ డ్యూటీ మీట్‌కు జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్


గడ్డం మల్లేశ్

జీడిమెట్ల, న్యూస్‌టుడే: పోలీసు శాఖ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే పోలీస్ డ్యూటీ మీట్ కార్యక్రమానికి జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేశ్ ఎంపికయ్యారు. సోమవారం నుంచి ఈ నెల 19 వరకు తెలంగాణ పోలీస్ అకాడమీ లో నిర్వహిస్తున్నారు. ఇందులో పోలీసులు నేరాల పరిశోధనలో వ్యవహరించాల్సిన తీరు, ప్రజలతో ఎలా మెలగాలి అనే అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తారు. దీనికి సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ నుంచి మల్లేశ్‌కు అవకాశం దక్కింది.

సనాతన ధర్మంపై అవగాహన అవసరం

నల్లకుంట, న్యూస్‌టుడే: సనాతన ధర్మంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ ప్రవచనకర్త సామవేదం షణ్ముఖశర్మ కోరారు. సోమవారం నల్లకుంటలోని శంకరమఠంలో 'సువర్ణ భారతీ మహోత్సవం' అంశంపై జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రవచనాలు చెప్పారు. శృంగేరీ పీఠం విశిష్టత, జగద్గురు భారతీ తీర్థ మహాస్వామి వైభవం గురించి భక్తులకు వివరించారు. శృంగేరీ పీఠం, అహం బ్రహ్మాస్మి ఫౌండేషన్ ప్రతినిధులు ప్రవీణ్‌కులకర్ణి, గీతామూర్తి, మరుమాముల వెంకటరమణశర్మ, శంకరమఠం ప్రధానాధికారి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కూడళ్ల విస్తరణ.. తీరనున్న కష్టాలు

టెండర్లు నిర్వహించిన ఏడాదికి కదలిక

రూ. 4.32 కోట్లతో నాలుగు చౌరస్తాల అభివృద్ధికి శ్రీకారం


అందుబాటులోకి వచ్చిన ఐడీపీఎల్ కూడలి


రంగా, భుజంగ థియేటర్ వద్ద చౌరస్తాలో పనులు

కూడలి	నిధులు (రూ. కోట్లు)
జగద్గిరిగుట్ట	0.48
జీడిమెట్ల రంగా, భుజంగ థియేటర్	1.00
గాజులరామారం	1.27
షాపూర్‌నగర్	1.57

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: ప్రధాన రహదారులపై రాకపోకలు సాగించే వాహనాలు అనూహ్యంగా పెరుగుతున్నాయి. అందుకనుగుణంగా ఆయా రహదారులతో పాటు కూడళ్లను విస్తరించాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. ట్రాఫిక్ సమస్యను అధిగమించేందుకు రెండేళ్ల క్రితం బెంగళూర్‌కు చెందిన సంస్థతో సర్వే చేయించారు. ఈ మేరకు రూ. 3.3 కోట్లతో ఐడీపీఎల్, కుత్బుల్లాపూర్ కృష్ణ పుంజి కూడళ్లను అభివృద్ధి చేసి ఏడాది క్రితం అందుబాటులోకి తెచ్చారు. తాజాగా రూ. 4.32 కోట్లతో షాపూర్‌నగర్, గాజులరామారం, జీడిమెట్ల రంగా భుజంగ థియేటర్, జగద్గిరిగుట్ట కూడలి అభివృద్ధికి శ్రీకారం చుట్టారు.

ముగియనున్న గడువు..ఐడీపీఎల్ కాలనీ నుంచి చింతల్, షాపూర్‌నగర్, జీడిమెట్ల మీదుగా సూరారం కట్టమైసమ్మ వరకు 7.5 కిలోమీటర్ల వరకు విస్తరించిన ఆర్‌అండ్‌బీ రహదారిని సీఆర్ఎంపీ పథకం కింద రూ. 14 కోట్లతో.. కుత్బుల్లాపూర్ కూడలి నుంచి బీరప్పనగర్ మీదుగా జీడిమెట్ల సుచిత్ర కూడలి వరకు 3.8 కి.మీ. మేర రహదారిని రూ. 6 కోట్లతో.. ఐడీపీఎల్ కూడలి నుంచి గాంధీనగర్ మీదుగా 2 కి.మీ. మేర రహదారిని రూ. 1.7 కోట్లతో ప్రైవేటు ఏజన్సీ వారు అభివృద్ధి చేశారు. ఆ ఏజెన్సీ కాలపరిమితి ఈ ఏడాది డిసెంబరు నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో షాపూర్‌నగర్, రంగా భుజంగా థియేటర్, గాజులరామారం, జగద్గిరిగుట్ట చౌరస్తాలను ట్రాఫిక్ రద్దీకి అనుగుణంగా విస్తరించడానికి ఏడాది క్రితం రూ. 4.32 కోట్లతో టెండర్లు నిర్వహించారు.

మూడు సార్లు నోటీసులు..

అంచనా వ్యయంపై 5-10 శాతం తక్కువతో కాంట్రాక్టు దక్కించుకున్న గుత్తేదార్లు పనులు చేపట్టకుండా జాప్యం చేశారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన జంట సర్కిళ్ల ఈఈలు కిష్టప్ప, గణేష్ సంబంధిత దస్త్రాలను బయటికి తీసి బాధ్యులైన గుత్తేదారులకు మూడుసార్లు నోటీసులు జారీ చేయడంతో పనుల్లో కదలిక వచ్చింది. ప్రధానంగా షాపూర్‌నగర్ కూడలిలో నడి రోడ్డుపై ఏర్పాటు చేసిన రెండు విగ్రహాలు విస్తరణకు అడ్డుగా మారాయి. ఏడాదిపాటు వాటిని అక్కడి నుంచి తొలగించడానికి ఎవరూ సాహసం చేయలేదు. ఈఈ కిష్టప్ప స్థానిక కాంగ్రెస్ నాయకులతో చర్చించి విగ్రహాలను ఈఎస్ఐ ఆసుపత్రి ప్రహరీ పక్కన ఏర్పాటు చేయించడంతో చౌరస్తా విస్తరణకు మార్గం సుగమమైంది.

మేమున్నాం.. మీకు తోడుగా..

కుత్బుల్లాపూర్ - 80085 73403, దుండిగల్ - 80085 73410
షాపూర్‌నగర్: 8008573404, పేట్‌బషీరాబాద్: 8008573405
నిజాంపేట: 8008573423, జీడిమెట్ల: 8008574405

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే:

? గాజులరామారం ప్రధాన రహదారిలోని ఉషాముళ్లపూడి ప్రహరీని ఆనుకొని రోడ్డు పక్కనే చెత్త వేశారు. దుర్వాసన వెలువడుతోంది.
–వెంకటప్పయ్య, హెచ్.ఎ.ఎల్.కాలనీ

✓ దసరా పండగ నేపథ్యంలో సిబ్బంది కొరత వల్ల చెత్త తరలించలేదు. వెంటనే చెత్తను డంపింగ్‌యార్డుకు తరలిస్తాం.
–మమత, జీహెచ్ఎంసీ వైద్యాధికారి

? గాజులరామారం డివిజన్ పరిధి ఉషోదయ కాలనీ ఫేస్-2లో రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. నెలరోజులుగా ఈ రోడ్డు గుండా రాకపోకలు నిలిపివేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
–రషీద్‌బేగ్, ఇందిరానగర్

✓ కూడలిలో అప్పటికే ఉన్న సీసీ రోడ్డును తవ్వడంతో పనుల్లో జాప్యం జరిగింది. పక్కనే ఉన్న మరో దారి గుండా రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకుంటాం.
–కల్యాణ్, ఏఈ, గాజులరామారం

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు


కేటీఆర్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న కృష్ణారావు, వివేకానంద్, వెంకటేశ్

కుత్బుల్లాపూర్: నగరంలో భారాస వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఆయన నివాసంలో సోమవారం ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద్, కాలేర్ వెంకటేశ్‌లు కలిశారు. వారు ఆయనకు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

పేట్‌బషీరాబాద్: దసరా పండగను పురస్కరించుకుని ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ నివాసంలో సోమవారం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. కుత్బుల్లాపూర్ హరిహర అర్చక సంఘం అధ్యక్షుడు గోపికృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పలువురు ప్రజాప్రతినిధులు, భారాస నేతలు, ఎమ్మెల్యేను దండమూడి ఎన్‌క్లేవ్‌లోని నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నిజాంపేట సెక్టార్ ఎస్సై సత్యనారాయణ బదిలీ

నిజాంపేట: బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధి నిజాంపేట సెక్టార్ ఎస్సైగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఎం.సత్యనారాయణ జీడిమెట్ల ఠాణాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చందానగర్ ఠాణాలో పనిచేస్తున్న సాగినాల రఘును ఇక్కడికి బదిలీ చేస్తూ సైబరాబాద్ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం నూతన ఎస్సై రఘు బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

★ ఏళ్ల నాటి వ్యర్థాల తొలగింపునకు ప్రణాళిక
★ రేపటి నుంచి కార్యాచరణ

ఈనాడు, హైదరాబాద్: ముమ్మర పారిశుద్ధ్య కార్యక్రమానికి జీహెచ్ఎంసీ సిద్ధమైంది. ప్రణాళికాబద్ధంగా వీధుల్లోని చెత్తను తొలగించేందుకు నడుం బిగించింది. బల్దియా అధికారులు బుధవారం నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు. రోడ్లు, పార్కులు, కాలిబాటలు, విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్లు, చెత్తకుప్పలు, చెరువులు, నాలాల వద్ద ఉన్న సాధారణ వ్యర్థాలు నిర్మాణ వ్యర్థాలను తొలగించాలన్నది ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశం. అందుకు సంబంధించి ఇప్పటికే అధికారులు కార్యాచరణ సిద్ధం చేశారు. జోన్లు, సర్కిళ్లు, డివిజన్ల స్థాయిలో ఎక్కడెక్కడ, ఏమేర వ్యర్థాలు ఉన్నాయన్న విషయమై క్షేత్రస్థాయి నుంచి వివరాలను సేకరించి తొలగింపునకు ఏర్పాట్లు చేస్తున్నారు.

గతంలో నిధుల దుర్వినియోగం

దారులు, ఖాళీ స్థలాల్లోని చెత్త తొలగింపునకు జీహెచ్ఎంసీ 2018-19లో రూ.100 కోట్లు వెచ్చించింది. పలువురు సహాయ వైద్యాధికారులు, సర్కిళ్ల ఉపకమిషనర్లు, కొందరు జోనల్ కమిషనర్లు ఇందుల్లో చేతివాటాన్ని ప్రదర్శించారు. లేని చెత్తను ఉన్నట్లుగా చూపించి, ప్రైవేటు ఆస్తుల్లోని వ్యర్థాల తరలింపు వాహనాల ఫొటోలతో భారీగా నిధులను దారి మళ్లించారు. నిబంధనల ప్రకారం.. ప్రైవేటు వ్యక్తులకు చెందిన వ్యర్థాలను సీఅండ్‌డీ కేంద్రానికి తరలించాలంటే వారు రవాణా ఛార్జీలు చెల్లించాలి. ప్రభుత్వం ఉచితంగా స్థలం ఇవ్వడంతో నిర్మాణ వ్యర్థాలను నామమాత్రపు ఖర్చుకు సేకరించి వాటిని రీసైక్లింగ్ చేయాల్సిన బాధ్యత సీఅండ్‌డీ కేంద్రంపై ఉంటుంది. అదేమీ పట్టించుకోకుండా ఆనాటి అధికారులు జీహెచ్ఎంసీ ఖజానాకు గండికొట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు కూడా దాదాపు అదే తరహా కార్యక్రమానికి బల్దియా శ్రీకారం చుట్టడంతో.. నిధుల దుర్వినియోగానికి తావు లేకుండా పనులు చేపట్టాలని నగరవాసులు జీహెచ్ఎంసీని హెచ్చరిస్తున్నారు.

మూడు దశల

మొదటి దశలో ఈ నెల 16 నుంచి 22 వరకు, రెండో దశలో 23 నుంచి 29 వరకు, మూడో దశలో నవంబరు 2 నుంచి 8 వరకు ముమ్మర పారిశుద్ధ్య కార్యక్రమాన్ని చేపట్టాలన్నది ప్రణాళిక.

మేడ్చల్ డీఈఈగా రాజు జాన్


రాజు జాన్‌ను సన్మానిస్తున్న 327 యూనియన్ నేతలు

పేట్‌బషీరాబాద్: మేడ్చల్ డీఈఈగా రాజు జాన్ నియమితులయ్యారు. కార్పొరేట్ కార్యాలయం నుంచి ఆయన బదిలీపై వచ్చారు. సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. వెన్నెలగడ్డలోని మేడ్చల్ డీఈఈ కార్యాలయంలో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. నూతన డీఈఈ రాజు జాన్‌ను 327 యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు. రీజినల్ ఉపాధ్యక్షుడు శీలం రాజ్‌కుమార్, నేతలు, జగన్, దేవతరాజ్, శవశంకర్, అజయ్‌కమార్ తదితరులు సన్మానించారు. ఇక్కడ డీఈఈగా విధులు నిర్వహించిన శ్రీనాథ్ రెడ్డి డీఈఈ టెక్నికల్ మేడ్చల్ సర్కిల్‌కు బదిలీపై వెళ్లారు.


కుత్బుల్లాపూర్ ఏడీఈగా నరేందర్

కుత్బుల్లాపూర్ ఏడీఈగా నరేందర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన నకిరేకల్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన సత్యనారాయణ షాద్‌నగర్‌కు బదిలీపై వెళ్లారు.

కొంపల్లి ఏఈగా శ్రీనివాస్

కొంపల్లి సెక్షన్ ఏఈగా శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కార్పొరేట్ కార్యాలయం నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి విధులు నిర్వహించిన వినాయన్ రాథోడ్ డీపీఈ -2గా బదిలీపై వెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


వరుణ్

తొర్రూరు: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందిన దుర్ఘటన తొర్రూరు డివిజన్ కేంద్రంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ జీడిమెట్లకు చెందిన కోన వరుణ్(22) తన మిత్రుడు సాయిసూర్యవర్ధన్‌తో కలిసి ద్విచక్రవాహనంపై మహబూబాబాద్ వైపునకు వెళ్తున్నారు. ఈ క్రమంలో డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ముందు వరంగల్-ఖమ్మం జాతీయ రహదారిపై బోర్‌వెల్ వాహనం వెళ్తుండగా, ఒక్కసారిగా సైడ్‌కు తిప్పగా, పక్క నుంచి వెళ్తున్న వరుణ్ వాహనానికి తగలడంతో కిందపడిపోయాడు. వెంటనే వరుణ్ పైనుంచి టైర్ వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సాయిసూర్యవర్ధన్‌కు స్వల్ప గాయాలయ్యాయని ఎస్సై పేర్కొన్నారు. మృతుడి బాబాయ్ రాఘవేంద్ర ఫిర్యాదు మేరకు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

జంట సర్కిళ్లలో విన్నపాలు వినవలె

ప్రజావాణికి ॥ దరఖాస్తులు



నర్సింహకు సెల్‌ఫోనులో సమస్యను వివరిస్తున్న వ్యక్తి

కుత్బుల్లాపూర్, న్యూస్‌టుడే: జంట సర్కిళ్లలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి స్పందన కరవైంది. దసరా పండగకు చాలామంది ప్రజలు స్వగ్రామాలకు వెళ్లడం వల్ల వినతులు అతి తక్కువగా వచ్చినట్లు అధికారులు తెలిపారు. కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో ఉప కమిషనర్ నర్సింహ, గాజులరామారం సర్కిల్‌లో సూపరింటెండెంట్ హరిబాబు ఆధ్వర్యంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు 'ప్రజావాణి' కార్యక్రమం నిర్వహించారు. కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో మొత్తం 9 అర్జీలు వచ్చాయి. ఇందులో పట్టణ ప్రణాళికకు 5, ఇంజినీరింగ్‌నకు 2, ప్రజారోగ్య విభాగానికి, ఉద్యాన వనాల విభాగాలకు ఒక్కో దరఖాస్తు వచ్చింది. గాజులరామారం సర్కిల్‌లో మాత్రం కేవలం ఇంజినీరింగ్, ఆస్తిపన్నుల విభాగాలకు ఒక్కో దరఖాస్తు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఈఎంఆర్ఐలో ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

కీసర, న్యూస్‌టుడే: ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ 108 కాల్ సెంటర్‌లో పని చేసేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ షేక్ జాన్ షాహిద్ తెలిపారు. ఇంటర్, డిగ్రీ చేసిన వారు అర్హులన్నారు. ఈనెల 15 నుంచి 19వరకు మేడ్చల్ గుండ్లపోచంపల్లిలోని కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. ఆసక్తిగల వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ పత్రాలు వెంట తీసుకొని రావాలన్నారు.

బౌరంపేటలో కుక్కలు పట్టివేత



దుండిగల్, న్యూస్‌టుడే: దుండిగల్ పురపాలిక పరిధి బౌరంపేటలో సోమవారం బ్లూ క్రాస్ సొసైటీ సభ్యులు 15 కుక్కలను పట్టుకున్నారు. వాటికి సంతానం కలుగకుండా ఆపరేషన్ చేయడంతోపాటు యాంటీ రేబిస్ టీకాలను వేసి వదిలిపెడతారని దుండిగల్ పురపాలిక కమిషనర్ సత్యనారాయణ పేర్కొన్నారు. పురపాలిక పరిధిలో ఎక్కడైనా కుక్కల బెడద ఉంటే 95427 15377, 88853 43470 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

ఐటీఐ కొత్త కోర్సుల్లో చేరేందుకు గడువు 19 వరకు

మేడ్చల్, న్యూస్‌టుడే: మేడ్చల్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో నూతనంగా ప్రవేశపెట్టిన కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 19వరకు అవకాశం కల్పించినట్లు, ప్రిన్సిపల్ ఎం.హనుమనాయక్ తెలిపారు.

అల్వాల్ పరిధిలో..

మేడ్చల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఐటీఐ అల్వాల్‌లో 2024-2025 అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్‌కి (ఏటీసీ) సంబంధించిన ప్రవేశాలకు ఆసక్తిగల విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఐటీఐ కన్వీనర్ పి.శంకరయ్య కోరారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా హాజరై ప్రవేశం పొందాలని సూచించారు. ఇతర వివరాలకు 90596 85237, 98491 88346 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'హరిత ప్రయాణ విధానం దేశమంతా అమలు కావాలి'

నిజాంపేట, న్యూస్‌టుడే: హరిత ప్రయాణ విధానం దేశమంతా అమలు కావాలని రాష్ట్ర ప్రభుత్వ ఆటోమోటివ్, ఈవీ డైరెక్టర్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. న్యూ గో సంస్థ ఆధ్వర్యంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు 4 వేల కిలోమీటర్ల వరకు జరుగుతున్న బస్సు యాత్ర సోమవారం బాచుపల్లికి చేరింది. ఈ నెల 4న ప్రారంభమైన యాత్ర 19న కన్యాకుమారికి చేరుకుంటుంది. బాచుపల్లిలోని న్యూ గో డిపోకు చేరిన యాత్ర బస్సును గోపాలకృష్ణ జెండా ఊపి కొనసాగించారు. ఎలక్ట్రిక్ బస్సులతో పర్యావరణ పరిరక్షణ కలుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా 'గ్రీన్ మొబిలిటీ'పై ప్రజలకు అవగాహన కలిగించాల్సిన అవసరం ఉందన్నారు.



జెండా ఊపి యాత్రను కొనసాగిస్తున్న గోపాలకృష్ణ

మద్యం తాగొద్దన్నందుకు.. భవనంపై నుంచి దూకి

● చికిత్స పొందుతూ మృతి

దుండిగల్: మద్యం విషయంలో దంపతుల మధ్య జరిగిన గొడవతో మనస్తాపానికి గురైన భర్త భవనంపై నుంచి దూకి.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. సారెగూడెంకు చెందిన పి.శ్రీశైలం(40), సౌజన్య దంపతులు. వారికి ఇద్దరు సంతానం. అతను తరచూ మద్యం తాగి ఇంటికి వచ్చేవాడు. ఆదివారం రాత్రి మద్యం తాగి ఇంటికి వచ్చాడు. మద్యం తాగొద్దని భార్య పేర్కొనడంతో గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన భర్త భవనం మూడో అంతస్తు నుంచి కిందికి దూకాడు. తీవ్రంగా గాయపడిన అతన్ని కుటుంబ సభ్యులు, స్థానికులు సూరారంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

హత్య కేసులో ఇద్దరి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ హనుమంతరావు

షాపూర్‌నగర్, న్యూస్‌టుడే: జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని దీనబంధు కాలనీలో జరిగిన హత్య కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. బాలానగర్ ఏసీపీ హనుమంతరావు తెలిపిన వివరాల ప్రకారం... దీనబంధు కాలనీకి చెందిన మహ్మద్ నదీమ్ పాషా, మహ్మద్ ఖలీల్(23), వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ నివాసి కట్ట వరప్రసాద్(23) స్నేహితులు. జులాయిగా తిరిగే మహ్మద్ నదీమ్ పాషాకు మద్యం, గంజాయి అలవాటు ఉంది. అతడు తరచూ గంజాయి తాగి స్నేహితులు, చుట్టుపక్కల వారిని బెదిరించేవాడు. గంజాయి తాగడం మానుకోవాలని నదీమ్ పాషాకు స్నేహితులు మహ్మద్ ఖలీల్, వరప్రసాద్ చెప్పేవారు. తన విషయంలో జోక్యం చేసుకుంటే హత్య చేస్తానని బెదిరించేవాడు. శనివారం రాత్రి వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ నివాసి వరప్రసాద్ జన్మదిన వేడుకల్లో అందరూ మద్యం తాగారు. ఆదివారం తెల్లవారుజామున దీనబంధు కాలనీకి వచ్చారు. మహ్మద్ నదీమ్.. ఖలీల్‌తో గొడవపడి చంపేస్తానని బెదిరించాడు. అతడు వరప్రసాద్‌తో కలిసి ఇనుపరాడ్లతో మహ్మద్ నదీమ్ తలపై, ముఖంపై విచక్షణారహితంగా కొట్టడంతో మృతి చెందాడు. నిందితులు పారిపోయారు. సీసీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు మహ్మద్ ఖలీల్, వరప్రసాద్ హత్య చేసినట్లు నిర్ధారించారు. సోమవారం ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ నర్సింహ, డీఐ అంజయ్య, ఎస్సై విఠల్‌రావు పాల్గొన్నారు.

భారీ వర్షం.. లోతట్టు జలమయం


బౌరంపేట ల్యాండ్‌మార్క్-2 గేటెడ్ కమ్యూనిటీలో ..

దుండిగల్, న్యూస్‌టుడే: భారీ వర్షానికి దుండిగల్ పురపాలికలోని లోతట్టు ప్రాంతాలు, రోడ్లు జలమయమయ్యాయి. సోమవారం సాయంత్రం కురిసిన భారీ వానకు బౌరంపేటలోని ల్యాండ్‌మార్క్-2 గేటెడ్ కమ్యూనిటీలోకి భారీగా వరద చేరింది. గేటెడ్ కమ్యూనిటీలోని పలు రహదారులపై రెండు అడుగుల మేర నీరు నిలిచింది. స్థానికులు మోటార్ల సహాయంతో నీటిని బయటికి పంపారు. బౌరంపేట అవుటర్ అండర్ పాస్, మల్లంపేట ఉన్నత పాఠశాలకు వెళ్లే మార్గం, డ్రీమ్ వ్యాలీ రోడ్లు జలమయం కావడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి.

సీఆర్ఎంపీ రహదారిపై..

కుత్బుల్లాపూర్: సోమవారం సాయంత్రం కురిసిన ఓ మోస్తారు వర్షానికి ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. పలుచోట్ల రోడ్లపైకి మోకాలు లోతు వరద చేరింది. ప్రధానంగా సూరారం సీఆర్ఎంపీ (సమగ్ర రహదారుల నిర్వహణ కార్యక్రమం) రోడ్డుపైకి భారీగా చేరిన వరదతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

సాయిపూజ థియేటర్ వద్ద ఈ రహదారిపై దశాబ్దాల క్రితం నిర్మించిన కల్వర్టులు రెండు వైపుల మట్టితో కూరుకుపోయాయి. వాటిని పునరుద్ధరిస్తే రహదారిపై వరద నిలిచే అవకాశం ఉండదు. కానీ మల్లారెడ్డి ఆసుపత్రి వైపు ఉన్న కల్వర్టును పూర్తిగా మూసేస్తూ అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో సమస్య తలెత్తుతోంది. అధికారులు మూడేళ్ల క్రితం సుమారు రూ.60 లక్షలు వెచ్చించి వరద రహదారిపై నిలువకుండా సమీపంలోని లింగంచెరువులోకి మళ్లిస్తూ భూగర్భ వరద కాలువ నిర్మించారు. ఇదే కాలువలోకి సూరారం కాలనీ, సిద్ధివినాయకనగర్ తదితర ప్రాంతాలకు చెందిన మురుగు అవుట్‌లెట్లను అనుసంధానం చేయడంతో కాలువలో మురుగు, వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల వరద చెరువులోకి సాఫీగా వెళ్లే అవకాశం లేక రోడ్డుపై నిలుస్తోందని సూరారం కాలనీ నివాసి, సామాజిక కార్యకర్త కోల రవీందర్ వాపోయారు.

వాహనదారులకు ఇబ్బందులు..

షాపూర్‌నగర్: సూరారంలో సోమవారం సాయంత్రం కురిసిన కొద్ది పాటి వర్షానికే రోడ్లు జలమయమయ్యాయి. మల్లారెడ్డి నారాయణ హృదయాల ఆసుపత్రి ఎదురుగా కల్వర్టులన్నీ మూసుకుపోవడంతో వరద రోడ్డుపై నిలిచింది. ఇటీవల ఇక్కడ రోడ్డు పనులు పూర్తయినా కల్వర్టులను మాత్రం పునరుద్ధరించలేదు. సూరారం ప్రధాన కూడలి నుంచి లింగం చెరువులోకి వెళ్లాల్సిన వరద ప్రవాహాన్ని అటువైపు నుంచి ప్రధాన కూడలి వైపు మళ్లించడంతో వరద ప్రవాహం సరిగా లేక రోడ్డుపైకి చేరుతోంది. వర్షం పడినప్పుడు వరద రోడ్డుపై నిలిచి రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. వాహనదారులు రెండు అడుగులలోతు నీటిలోంచి ప్రయాణించారు. రెండు గంటలపాటు వరద రోడ్డుపైనే నిలిచిపోయింది. కల్వర్టులను పునరుద్ధరించి నీరు నాలాల్లోకి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


బౌరంపేట ల్యాండ్‌మార్క్-2లో..


మల్లంపేట డ్రీమ్ వ్యాలీ వద్ద రోడ్డుపై ..


ప్రధాన రహదారిపై..


మల్లంపేట ఉన్నత పాఠశాలకు వెళ్లే దారిలో..


మల్లారెడ్డి ఆసుపత్రి ఎదుట..

రెండిళ్లలో చోరీ

పేట్‌బషీరాబాద్, న్యూస్‌టుడే: జీడిమెట్ల డివిజన్ పరిధిలోని మీనాక్షిఎస్టేట్స్ కాలనీలో రెండిళ్లలో శనివారం సాయంత్రం చోరీ జరిగింది. ఇళ్ల యజమానులు సొంతూళ్లకు వెళ్లారు. వారు వచ్చి చూడడంతో విషయమ వెలుగులోకి వచ్చింది. ఇద్దరు మైనర్లు చోరీకి పాల్పడినట్లు సీసీ ఫుటేజీల్లో నిక్షిప్తమైంది. న్యాయవాది ఇంట్లో వారికి ఎం లభించలేదు. పక్కింటికి తాళం వేసి ఉండటం వల్ల చోరీకి యత్నించారు. ఆ ఇంట్లో రూ.12 వేల నగదు, బంగారు ఆభరణాలు అపహరణకు గురయ్యాయి. కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలని సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. బాధితుల ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.